05-04-2024
శుక్రవారం
హైదరాబాద్
సంపుటి 26, సంచిక: 288
పేజీలు: 8 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్: 8
వెల రూ. 5.00
Published from:
Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

భర్తృహరి నీతి శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

# దేశంచూపు..మనవైపే..

జనజాతర సభకు భారీగా జనసమీకరణ
కాంగ్రెస్ నేతలకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
తుక్కుగూడలో మంత్రులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించిన టిపిసిసి చీఫ్



ప్రజాపక్షం/హైదరాబాద్

కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసే 'కాంగ్రెస్ జన జాతర సభ'కు భారీగా జనసమీకరణ చేయాలని కాంగ్రెస్ నాయకులను టిపిసిసి అధ్యక్షులు, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దేశమంతా మనవైపు చూస్తుందని , కాబట్టి సభ కూడా అదే తరహాలో ఉండాలని సూచించారు. కాంగ్రెస్ జన జాతర బహిరంగ సభ జరిగే తక్కుగూడలోని రాజీవ్‌గాంధీ ప్రాంగణాన్ని గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించారు. మైదానమంతా కలియదిరుగుతూ ఏర్పాట్లను పరిశీలించారు. ఎక్కడెక్కడ ఏమి చేయాలో చెప్పడంతో పాటు లోటుపాట్లు ఉన్న చోట్ల మార్పులను కూడా సూచించారు. ఎండలు బాగా ఉన్నందున మంచినీళ్ళు, ఇతర సౌకర్యాలు కల్పించాలని, మహిళలు కూర్చునేందుకు ప్రత్యేక ప్రాంతాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వారికి తప్పనిసరిగా కుర్చీలు ఉండాలని చెప్పారు. వెనుకకనపడేవారికి భారీ ఎల్ఇడి స్క్రీన్‌లు పెద్ద ఎత్తున పెట్టాలని, ప్రసంగాలు స్పష్టంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడే ఏర్పాటు చేసిన తాత్కాలిక గుడారంలో ఎఐసిసి కార్యదర్శి రోహిత్ చౌదరి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు, 17 లోక్‌సభ స్థానాల ఇన్‌ఛార్జ్‌లు, ఇప్పటి వరకు ఖరారైన 14 మంది ఎంపి అభ్యర్థులతో బహిరంగ సభకు జనసమీకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో శాసనసభ ఎన్నికలకు ముందు ఇదే తుక్కుగూడ ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభలో ఆరు గ్యారెంటీలను సోనియాగాంధీ ప్రకటించారని, అది కాంగ్రెస్ గెలుపునకు తరువాయి 2లో



## సోనియాగాంధీ సహా 14 మంది రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, రైల్వేశాఖమంత్రి అశ్విని వైష్ణవ్ సహా మొత్తం 14 మంది గురువారం రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం చేశారు. నూతన పార్లమెంట్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ కొత్త రాజ్యసభ సభ్యులతో ప్రమాణం చేయించారు. సోనియాగాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎన్నిక కాగా, వైష్ణవ్ ఒడిశా నుంచి తిరిగి ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నేతలు అజయ్ మాకెన్, సయ్యద్ నసీర్ హుస్సేన్ కర్నాటక నుంచి, బిజెపి నేత ఆర్‌పిఎన్ సింగ్ ఉత్తరప్రదేశ్ నుంచి, మరో బిజెపి నేత సమిక్ భట్టాచార్య పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. వీరితో పాటు బీహార్ నుంచి ఎన్నికైన జెడియు నేత సంజయ్ కుమార్ ఝా, ఒడిశా నుంచి బిజెడి నేతలు సుభాశీష్ ఖుంటియా, డెబాశీష్ సమంటరి, రాజస్థాన్ నుంచి బిజెపి నాయకుడు మదన్ రాథోర్ కూడా రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం చేశారు. వైఎస్‌ఆర్‌సిపి నేత గొల్ల బాబురావ్, మేడ రాఘునాథ్‌రెడ్డి, యెర్రం వెంకట సుబ్బారెడ్డి (ముగ్గురూ ఆంధ్రప్రదేశ్‌కు చెందివారే), బిఆర్‌ఎస్ నేత రవి చంద్ర వద్దిరాజు (తెలంగాణ) రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం చేసిన వారిలో ఉన్నారు. సభ్యులు అందరు కూడా రాజ్యసభ చైర్మన్‌తో కలిసి ఫోటోగ్రాఫ్ తీసుకున్నారు. కాగా, ఒడిశా, రాజ్యస్థాన్ నుంచి ఎన్నికైన సభ్యుల పదవీ కాలం గురువారం నుంచి ప్రారంభమైందని, మిగతా సభ్యుల పదవీ బుధవారం నుంచే ప్రారంభమైనట్లు రాజ్యసభ సచివాలయం పేర్కొంది. సోనియాగాంధీ తొలిసారి రాజ్యసభ సభ్యులయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాజ్యసభపక్ష నాయకుడు పీయూష్ గోయల్, రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ కుమార్తె ప్రియాంకాగాంధీ వాద్రా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, సెక్రటరీ జనరల్ పిసి మోదీ హాజరయ్యారు.

## కవిత బెయిల్ పిటిషన్‌పై సోమవారం తీర్పు



**న్యూఢిల్లీ :** ఢిల్లీ మద్యం కేసులో అరెస్ట్ అయి ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్న ఎమ్మెల్సీ కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టులో గురువారం వాదనలు ముగిశాయి. ఇడి దాఖలు చేసిన కౌంటరుపై కవిత తరపు న్యాయవాదులు రిజాయిండర్ దాఖలు చేశారు. కుమారుడి పరీక్షల దృష్ట్యా మధ్యంతర బెయిల్ ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. కవిత తరపున మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై సీనియర్ న్యాయవాది అభిషేక్ మనూ సింఘ్వీ కోర్టులో వాదనలు వినిపించారు. బెయిల్ ఇస్తే ఆధారాలు, సాక్షులను ప్రభావితం చేస్తారని ఇడి తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. 'కవితకు వ్యతిరేకంగా చాలా ఆధారాలు ఉన్నాయి. ఢిల్లీ మద్యం కుంభకోణానికి కవితే ప్రణాళిక రచించారు. ఆమె తన ఫోన్ డేటాను డిలీట్ చేశారు. దర్యాప్తులో తరువాయి 2లో

## కేజ్రీవాల్‌కు ఊరట

పదవి నుంచి తప్పించాలని పిల్
విచారణకు హైకోర్టు నిరాకరణ

**న్యూఢిల్లీ :** ఢిల్లీ హైకోర్టులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట లభించింది. జైల్లో ఉన్న ఆయనను సిఎం పదవి నుంచి తొలగించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు న్యాయస్థానం నిరాకరించింది. హిందూసేన అధ్యక్షుడు విష్ణు గుప్తా వేసిన పిల్‌ను జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోడాతో కూడిన బెంచ్ కొట్టేసింది. సిఎం పదవిలో కొనసాగాలా వద్ద అనే అంశం కేజ్రీవాల్ వ్యక్తిగత నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ అంశంలో న్యాయస్థానం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని బెంచ్ తెలిపింది. దీనిపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ లేదా రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని బెంచ్ తెలిపింది. ''ప్రభుత్వం పనిచేయట్లేదని మేం ఎలా తేలుస్తాం. ఎల్‌జి ఇందుకు సరైన వ్యక్తి. ఆయనకు మా మార్గదర్శకత్వం అవసరం లేదు. ఆయనకు సలహాలు ఇచ్చే అవకాశం మాకు లేదు. చట్ట ప్రకారం ఏం చేయాలో ఆయన ఆలోచిస్తారు'' తరువాయి 8లో

## భానుడి ప్రతాపం... పట్టపగలే చుక్కలు...

ఎండల ధాటికి జనం బేజారు

ప్రజాపక్షం/హైదరాబాద్



భానుడి ప్రతాపం కారణంగా ప్రజలకు పట్టపగలే చుక్కలు కనపడుతున్నాయి. మండే ఎండల దాటికి జనం బేజారౌతున్నారు. దాదాపు అన్ని ప్రాంతాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదౌతున్నాయని వాతావరణశాఖ వెల్లడించింది. మండుతున్న ఎండల ధాటికి నగర వీధులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. నల్లగొండ జిల్లా నిడమనూరులో అత్యధికంగా 43.5 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదవ్వగా, జోగులాంబ గద్వాల్ జిల్లాలో 43.3 డిగ్రీలు, కుమురం భీం జిల్లాలో 43.3 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లాలో 43.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలో 43 డిగ్రీలు, వనపర్తి జిల్లాలో 42.9 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 42.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఎండల ధాటికి ఇక్కట్లు పడుతున్నారు. వివిధ పనులు నిమిత్తం బయటకు వచ్చిన వారంతా త్వరత్వరగా పనులు తరువాయి 2లో

కెటిఆర్ లీగల్ నోటీసులు పంపి
బెదిరించాలని చూస్తున్నారు 03

## సూర్యాపేటలో ఘోర రోడ్డు ప్రమాదం

నలుగురు మృతి, 13మందికి తీవ్ర గాయాలు

ప్రజాపక్షం/సూర్యాపేట



ఆగి ఉన్న లారీని వెనుక నుండి ఆటో ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందగా మరో 13 మందికి గాయాలైన ఘటన గురువారం అంజనపురి కాలనీ సమీపంలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుండి విజయవాడవైపుకు వెళ్తున్న లారీని డ్రైవర్ రోడ్డుపై నిలిపాడు. అదే సమయంలో అర్వపల్లి నుండి సూర్యాపేట పట్టణానికి 14 మంది ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకోని వస్తున్న డ్రైవర్ ఒక్కసారిగా ముందు ఆగి ఉన్న లారీని గ్రహించి దానిని దాటేందుకు ప్రయత్నిస్తుండగా వెనుక నుండి అతి వేగంగా వస్తున్న ఎర్టిగా కారు ఆటోను ఢీకొట్టగా ముందు ఆగి ఉన్న లారీని ఆటో బలంగా ఢీకొంది. ఈ ఘటనలో అర్వపల్లి నుండి ఆటోలో వస్తున్న ప్రయాణికుల్లో సూర్యాపేట పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు చింతరెడ్డి సరితారెడ్డి (44), లక్ష్మీ తండాకు చెందిన లూనావత్ రుక్కమ్మ(63), తుంగతుర్తి మండలం పసునూరు గ్రామానికి చెందిన 17 నెలల తరువాయి 2లో



## అతి సంపన్నులపై పన్ను

కొత్తగా సాధారణ సంపద, వారసత్వ ఆస్తి పన్ను
ఉపాధి హామీ బడ్జెట్ రెట్టింపు
సిపిఐ(ఎం) మ్యానిఫెస్టో విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

బిజెపి, దాని మిత్రపక్షాలను ఓడించాలని,లోక్‌సభలో సిపిఐ(ఎం), వామపక్ష పార్టీల బలాన్ని పెంచాలని ప్రజలకు సిపిఐ(ఎం) విజ్ఞప్తి చేసింది. కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని కోరింది. ఢిల్లీలోని సిపిఐ(ఎం) కేంద్ర కార్యాలయం ఎకెజి భవన్‌లో ఆ పార్టీ మ్యానిఫెస్టోను గురువారం నాడు సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కారత్ , తపన్ సేన్, తరువాయి 2లో

ఫోన్ ట్యాపింగ్‌పై ఉన్నతస్థాయి విచారణకు

## గవర్నర్‌ను కోరుతాం

బిఆర్‌ఎస్ 'గుర్తింపు' పై ఇసి పునరాలోచించాలి
కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్



ఫోన్ ట్యాపింగ్ తీవ్రమైన అంశమని, దీనిపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని గవర్నర్‌ను కోరుతామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. గత కెసిఆర్ ప్రభుత్వం అనేక ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ నియమావళికి విరుద్ధంగా ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలుతోందన్నారు. ఫోన్ ట్యాపింగ్ పై ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ గుర్తింపుపై పునరాలోచన చేయాలని ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు ఇంటెలిజెన్స్ చీఫ్ నేతృత్వంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తరువాయి 2లో



## ఏనుగు దాడిలో ఇద్దరు రైతులు మృతి

ప్రజాపక్షం/చింతలమానేపల్లి/పెంచికల్ పేట్

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో గడిచిన 24 గంటల్లోపే ఇద్దరు రైతులు ఏనుగు దాడిలో ప్రాణాలు కోల్పోయారు. మహారాష్ట్ర వైపు నుంచి ప్రాణహిత నది దాటి ఏనుగు జిల్లాలోకి ప్రవేశించినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. బుధవారం చింతలమానేపల్లి మండలం బూరేపల్లి గ్రామం మిరప తోటలో మధ్యాహ్నం పనిచేసుకుంటున్న అల్లూరి శంకర్ (55) అనే రైతు పై ఏనుగు దాడి చేయడంతో మిరప తోటలో అక్కడికక్కడే చనిపోయాడు. గురువారం తెల్లవారుజామున పెంచికల్‌పేట్ మండలంలోని కొండపల్లి గ్రామంలో కారు పోషం 60 అనే రైతు తన పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లే సమయంలో గ్రామ సమీపంలో అతనిపై దాడి చేసి హతమార్చింది. ఉదయం వాకింగ్ చేస్తున్న మాజీ సర్పంచ్ సంజీవ్ సుధాకర్ గ్రామస్తులు గమనించి సుధాకర్ ముందుగా ఏనుగు నుంచి రెండూ కిలో మీటర్లు పరుగెత్తి తనని తాను రక్షించుకొని ఈ దారి నుండి ఏనుగు వచ్చిందని తరువాయి 2లో

## ఎన్నికల బాండ్‌లలో 'మనీ లాండరింగ్' ప్రహసనం

### నష్టాల్లోని కంపెనీలూ వందలకోట్లు కుమ్మరించాయి!

ఎన్నికల బాండ్ల వ్యవహారం ఎంత ప్రహసనంగా నడిచిందో లోతుగా పరిశీలించే కొద్దీ, సుప్రీంకోర్ట్ ఆదేశంపై స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన బాండ్ల కొనుగోలుదారులు, వాటిని నగదుగా మార్చుకున్న వారి సమాచారాన్ని విశ్లేషించేకొద్దీ వెల్లడవుతున్నది. లాభాల్లోలేని, నష్టాల్లో ఉన్న కంపెనీలు సైతం పెద్దమొత్తంలో బాండ్ల రూపేణా ఎన్నికల విరాళాలు సమర్పించుకున్నాయంటే మనీ లాండరింగ్ జరిగినట్లు, కొన్ని కంపెనీలు ఏవో ఇతర కంపెనీలకు సూట్‌కేసు కంపెనీలుగా వ్యవహరించినట్లు అనుమానించవచ్చని ప్రసిద్ధ ఆంగ్ల దినపత్రిక ''ది హిందూ'' డేటా టీం ప్రసేన్ జిత్ బోస్ నేతృత్వంలో జరిపిన విశ్లేషణ తెలియజేస్తున్నది. ఆ బృందం కథనం ఏప్రిల్ 4, గురువారంనాడు ఆ పత్రిక ప్రచురించింది. సందేహాస్పదమైన నిధులతో 45 కంపెనీలు ఇచ్చిన బాండ్లలో 74 శాతాన్ని బిజెపి నగదుగా మార్చుకుంది. ఆ కథనాన్ని ఇక్కడ ఇస్తున్నాం – సం॥

ఏప్రిల్ 12, 2019 – జనవరి 24, 2024 మధ్యకాలంలో ఎన్నికల బాండ్ల కొనుగోలుదారుల, వాటిని నగదులోకి మార్చుకున్న వారి సమాచారాన్ని విశ్లేషించినట్లయితే, ఆ బాండ్ల ద్వారా మొత్తంమీద రూ.1432కోట్ల 40 లక్షలు విరాళంగా ఇచ్చిన 45 కంపెనీల నిధుల మూలాలు సందేహాస్పదం అని తేలుతుంది.

బిజెపి రూ.1068.4కోట్లను – అనగా ఈ బాండ్లలో 75 శాతాన్ని నగదు చేసుకుంది. ఈ బాండ్లు అందజేసిన 45 కంపెనీల్లో 33 కంపెనీల నికర లాభాలు నెగటివ్‌గా లేదా సున్నగా ఉన్నాయి; 6 కంపెనీలు అవి ప్రకటించిన నికరలాభాలకన్నా చాలా హెచ్చు మొత్తాలకు బాండ్లు కొన్నాయి. 3 కంపెనీలకు లాభాలున్నా మొత్తంమీద ప్రత్యక్ష పన్నులు చెల్లించలేదు. మరో మూడు నికర లాభాలుగాని లేక ప్రత్యక్ష పన్నులు చెల్లించినట్లు లేదు. ఇదీ 2016–17 నుంచి 2022–23 కాలంలో పరిస్థితి.

స్వతంత్ర పరిశోధకుల సహకారంతో ది హిందూ ఈ విశ్లేషణ చేసింది. బిజెపికి మొత్తంమీద రూ.5362.2 కోట్లు బాండ్లు విరాళమిచ్చిన మొత్తం 385 కంపెనీలను సమీక్షించింది. ఎన్నికల బాండ్లలో అతిపెద్ద వాటా పొందింది బిజెపియే కదా!

కార్పొరేట్ మరియు పన్ను డేటాకు సంబంధించి వాటిలో 221 కంపెనీల సమాచారం సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ ప్రొయిస్ ఐక్యు డేటాబేస్‌తో సరిపోలుతున్నది. ఈ కంపెనీల బాండ్ డేటా (2019–20 నుంచి 2023–24) వాటి లాభం, చెల్లించిన ప్రత్యక్ష పన్నుల డేటాతో సరిపోలుతున్నది.

కనీసం 45 కంపెనీల నిధుల మూలాలు అనుమానించదగినవిగా ఉన్నాయి. ఈ 45కంపెనీలను నాలుగు విభాగాలు చేసి (ఎ,బి,సి,డి) విశ్లేషించారు. 33 కంపెనీలు కలిపి ఎలక్టోరల్ బాండ్ల కింద రూ.576.2 కోట్లు సమర్పించుకున్నాయి. అందులో రూ.434.2 కోట్లు (దాదాపు 75శాతం) బిజెపి నగదు చేసుకుంది. ఈ కంపెనీలకు ఏడు సంవత్సరాలపాటు (2016–17 నుంచి 2022–23) లాభాలు లేవు లేదా సున్నగా ఉన్నాయి. ఈ 33లో 16 కంపెనీలు (కేటగిరి ఎ) మొత్తంమీద ప్రత్యక్ష పన్నులు చెల్లించలేదు లేదా రుణాత్మకత (నెగటివ్)లో ఉన్నాయి.

నష్టాలు ఆర్జిస్తున్న ఈ కంపెనీలు అంత భారీ మొత్తంలో ఎలక్టోరల్ బాండ్‌ల ద్వారా ఎన్నికల విరాళాలు చెల్లించాయంటే, ఈ 'బి' కేటగిరి కంపెనీలు వేరే కంపెనీలకు సూట్‌కేసు కంపెనీలుగా పనిచేసి ఉండాలి లేదా తమ లాభ–నష్టాలను తప్పుగా అయినా రిపోర్టు చేసి ఉండాలి – ఇది మనీ లాండరింగ్ అవకాశాన్ని లేవనెత్తుతున్నది.

ఆరు కంపెనీలు మొత్తంమీద రూ.646కోట్లు విరాళమిచ్చాయి. అందులో రూ.601కోట్లు (93 శాతం) బిజెపి ఖాతాకే చేరింది. ఆ కంపెనీలకు 2016–17 నుంచి 2022–23 వరకు సకారాత్మక లాభాలున్నాయి. అయితే అవి విరాళంగా ఇచ్చిన సొమ్ము వాటి లాభాలకన్నా చాలా హెచ్చుగా ఉంది.

'సి' కేటగిరిలోని మూడు కంపెనీలు మొత్తంమీద రూ.193.8 కోట్లు సమర్పించుకోగా అందులో 15శాతం (రూ.28.3కోట్లు) బిజెపి సొమ్ముగా మార్చుకుంది. మిగతాది రూ.91.6కోట్లు (47శాతం) కాంగ్రెస్, రూ.45.9కోట్లు (24 శాతం) తృణమూల్, బిఆర్‌ఎస్, బిజెడిలకు చెరో రూ.10కోట్లు (ఒక్కొక్కరికి సుమారు 5శాతం), ఆప్‌కు రూ.7కోట్లు (3.6శాతం) ఇచ్చాయి. ఈ 3 కంపెనీలకు సకారాత్మక నికర లాభాలున్నాయిగాని ప్రత్యక్ష పన్నులు చెల్లింపు లేదు.

కేటగిరి 'డి'లోని 3 కంపెనీలు ఎన్నికల బాండ్ల రూపంలో రూ.16.4 కోట్లు చెల్లించుకున్నాయి. అందులో రూ.4.9కోట్లు (సుమారు 30శాతం) బిజెపికి, కాంగ్రెస్‌కు 58శాతం, అకాలీదళ్, జెడియులు చెరో 6.1శాతం అందాయి. ఈ కంపెనీలు ఆ సమీక్షలోని కాలంలో నికర లాభాలు ఆర్జించినట్లు లేదా ప్రత్యక్ష పన్నులు చెల్లించినట్లు సమాచారం లేదు. ఈ దాతలు మనీలాండరింగ్‌లో పాల్గొన్న సూట్‌కేసు తరువాయి 2లో



## నేతన్నలను ఆదుకోండి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ బహిరంగ లేఖ

ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్రంలోని నేత కార్మికులపై కాంగ్రెస్ సర్కార్ కక్ష కట్టిందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ఆరోపించారు. 'నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఆదుకోరా! కార్మికులు రోడ్డున పడ్డా కనకరించరా?' అని కెటిఆర్ ప్రశ్నించారు. కెటిఆర్ గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. గత పదేండ్లలో నేతన్నలకు చేతి నిండా పని కల్పిస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సమైక్య రాష్ట్రంలోని నాటి సంక్షోభం తిరిగి నేడు నెలకొందని ఆయన తెలిపారు. నేతన్నలకు ఆర్డర్లు ఆపడం సరికాదన్నారు. బిఆర్‌ఎస్ తరువాయి 2లో

ప్రపంచం

# నాటో నుండి వైదొలగండి

## ఆస్ట్రియా ప్రభుత్వానికి లేబర్‌పార్టీ డిమాండ్




**వియన్నా :** నాటో కూటమి నుండి తక్షణం వైదొలగాలని ఆస్ట్రియా లేబర్ పార్టీ (యూరప్ కమ్యూనిస్టు అండ్ వర్కర్స్ పార్టీస్) ఆ దేశ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నాటో కూటమి ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నాటో కూటమి బ్రస్సెల్స్‌లో ఉత్సవాలు చేసుకుంటున్న తరుణంలో ఆస్రియా లేబర్‌పార్టీ సెంట్రల్ కమిటీ సమావేశమై గురువారంనాడు ఒక తీర్మానం చేసింది. ఆస్ట్రియా దేశం ఇక మీదట ఒక తటస్థదేశంగా ప్రపంచ రాజకీయాల్లో తనవంతు పాత్ర నిర్వహించాలని కూడా ఆస్ట్రియా లేబర్‌పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రస్తుతం ఆస్ట్రియా మంత్రివర్గంలో పన్నెండుమంది మంత్రులు ఉన్నారు. నాటో కూటమితో సహాయ సహకారాలు కొనసాగించవద్దని, నాటోతో ఆస్ట్రియి సాయుధ దళాల సహకారానికి ఇకమీదట నిలిపివేయాలని పార్టీ సెంట్రల్ కమిటీ తన తీర్మానంలో పేర్కొంది. తటస్థవైఖరితో ప్రపంచశాంతికోసం ఆస్ట్రియా పాటుపడాలని కోరింది. నాటో, అమెరికా, యూరోపియన్ యూనియన్ కమాండ్‌లతో ఉన్న సైనిక సంబంధాలను, విదేశాలలో వ్యాప్తిచేసిన బలగాలను వెనక్కు మళ్ళించాలని కూడా తీర్మానం డిమాండ్ చేసింది. 75 ఏళ్ళ క్రితం కమ్యూనిస్టు వ్యతిరేకతతో, సామ్యవాద ఆలోచనలను అణచివేసేందుకు నాటో కూటమి ఆవిర్భవించింది. పెట్టుబడిదారీ దేశాలకు ఇది మార్గదర్శి. ఆస్ట్రియా లేబర్ పార్టీ సామ్రాజ్యవాదాన్ని, పెట్టుబడిదారీ నియంతృత్వాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తుందని సెంట్రల్ కమిటీ స్పష్టం చేసింది. సోషలిస్టు భావజాల దేశాలకు ఆర్థిక, రాజకీయ, సైనికపరమైన బెదిరింపులు చేయడంకోసమే నాటో కూటమి ఆవిర్భవించిందని పార్టీ సమావేశం విమర్శించింది.

# జులై 9 నుండి నాటో ఆవిర్భావ వేడుకలు

## ఉక్రేన్‌కు 100 బిలియన్ డాలర్ల నాటో నిధి!



**బ్రస్సెల్స్ :** నాటో కూటమి విదేశాంగమంత్రుల సమావేశం బ్రస్సెల్స్‌లో గురువారం జరిగింది. నాటో కూటమి ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ సమావేశం జరిగింది. ఇదే సందర్భంగా యుద్ధంలో నిండా మునిగిఉన్న ఉక్రేన్‌కు 100 బిలియన్ డాలర్లు నిధిని సమకూర్చాలని కూడా నాటో కూటమి ఒక వరాన్ని ఇస్తున్నది. దీనిపై కూటమి విదేశాంగమంత్రులు సమాలోచనలు చేశారు. ఉక్రేన్–రష్యా మధ్య యుద్ధం మూడో సంవత్సరంలోకి ప్రవేశించింది. ఈ నేపథ్యంలో మరింత ఐక్యత నాటో దేశాలమధ్య పెంపొందాల్సిన అవసరం ఉందని కూటమి దేశాల విదేశాంగ మంత్రులు అభిప్రాయపడ్డారు. నాటో కూటమి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమాన్ని మంత్రులు నిర్వహించారు. 1949 ఏప్రిల్ 4వ దీన వాషింగ్టన్‌లో నాటో కూటమి ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ పూర్వరంగంలో రాబోయే జులై 9 నుండి 11వ తేదీ వరకూ భారీ ఎత్తున సమావేశం జరిపి ఉత్సవం చేసేందుకు విదేశాంగమంత్రుల సమావేశం సమాలోచనలు చేసింది. కాగా స్వీడన్‌దేశం నాటో కూటమిలో చేరిన తర్వాత మొదటిసారిగా ఈ సమావేశంలో పాల్గొంది. స్వీడన్ విదేశాంగమంత్రి తోయిస్ బిల్‌స్త్రోమ్ బ్రస్సెల్స్ సమావేశానికి వెళ్ళారు. స్వీడన్ నాటోలో చేరిన 32వ దేశంగా ఆ జాబితాలో చేరింది. ఏడు దశాబ్దాలలో ఈ కూటమి మూడురెట్లు తన బలాన్ని పెంచుకుంది. వాషింగ్టన్ ఒప్పందంలోని ఐదవ అధికరణ ప్రకారం సభ్యదేశాల్లో ఎవరిపై దాడి చేసినాగానీ నాటో తీవ్రంగా స్పందిస్తుంది. 2001లో అమెరికాపై అల్‌ఖైదా దాడులు చేశాక నాటో కూటమి యుద్ధం ప్రకటించింది. ఈ సమావేశంలో నాటో కూటమి ప్రధాన కార్యదర్శి జెన్స్ స్టోల్‌టెన్‌బర్గ్ మాట్లాడుతూ, ప్రపంచ చరిత్రలో నాటో కూటమి అత్యంత శక్తిమంతమైన కూటమిగా విజయవంతమైన కూటమిగా వర్ధిల్లుతోందని ప్రకటించారు. బెర్లిన్ గోడను కుప్పకూల్చి ప్రచ్ఛన్నయుద్ధంపై నాటో కూటమి గొప్ప విజయం సాధించిందని ఆయన గుర్తుచేశారు. మాసిడోనియాలో అంతర్యుద్ధాన్ని నివారించిందనీ, వేర్పాటువాద ఆల్బేనియన్ల రక్తపాతాన్ని అడ్డుకునేందుకు గతకాలపు యుగొస్లావియాకు వ్యతిరేకంగా 1999లో నాటో పెద్ద ప్రచారం చేసిందని ఆయన గుర్తుచేశారు. ఏ దేశంపైనా కూడా కుట్రలు చేయకుండా ప్రాదేశిక సమగ్రతను నిలబెట్టడంకోసం నాటో కూటమి పాటుపడుతోందని ఆయన చెప్పుకొచ్చారు. ఈనాడు నాటో తన బలాన్ని పెంచుకుందని, ఉక్రేన్ కూడా నాటోలో చేరేందుకు ఎంతో ఉత్సాహం చూపిస్తోందని స్టోల్‌టెన్‌బర్గ్ అన్నారు.

# అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ముందంజ

## వాల్‌స్ట్రీట్ జర్నల్ సర్వే





**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఆరు లేదా ఏడు రాష్ట్రాలలో డోనాల్డ్ ట్రంప్ ముందంజలో ఉన్నట్లు అభిప్రాయ సేకరణలో వెల్లడైంది. నిర్ణీత ప్రకారం ఈ ఏడాది నవంబరులో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. దేశాధ్యక్షుడు జో బైడెన్ కంటే ట్రంప్ ముందంజలో ఉన్నారని వాల్‌స్ట్రీట్ జర్నల్ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. దేశాధ్యక్షుడు బైడెన్ వృద్ధాప్యంపై అమెరికాలో చాలా విస్తారంగా చర్చ జరుగుతోంది. ఆయనకు మతి మరపుతోపాటు నిలకడగా నిలబడలేని పరిస్థితులు అప్పుడప్పుడు ఎదురవుతున్నాయి. ఆయన ఆరోగ్యం బ్రహ్మాండంగా ఉందని వైట్‌హౌస్ కితాబు ఇచ్చినప్పటికీ బైడెన్ తడబాటు, ఆయన వయోభారంపై ప్రజల్లో తీవ్ర సందేహాలు ఎదురవుతున్నాయి. చాలా రాష్ట్రాలలో బైడెన్‌కు సర్వేలో ప్రతికూల ఫలితాలు వచ్చాయి. జాతీయ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బైడెన్ శక్తిసామర్థ్యాలు, ఉద్యోగావకాశాల కల్పన విషయాలపై ప్రజలకు చాలా సందేహాలు ఉన్నాయని సర్వేలో వెల్లడైంది. ఈ పూర్వరంగంలో డోనాల్డ్ ట్రంప్ రెండు నుండి ఎనిమిది పాయింట్లు ఆధిక్యంలో ఉన్నారు. పెన్సిల్వేనియా, మిచిగాన్, అరిజోనా, జార్జియా, నెవాడా, నార్త్ కరోలినా రాష్ట్రాలలో ట్రంప్ హవా కొనసాగుతోందని సర్వే వెల్లడించింది. ఐతే బైడెన్ కూడా విస్కాన్‌సిన్‌లో ట్రంప్ కంటే మూడు పాయింట్లు ఆధిక్యంలో ఉన్నారు. ప్రతి రాష్ట్రంలోనూ జరిపిన సర్వేలో బైడెన్‌కు ఉద్యోగాల సృష్టిపై వ్యతిరేకత వచ్చిందని వాల్‌స్ట్రీట్ పేర్కొంది. ఈ వ్యతిరేకత 16 పర్సంటేజీ పాయింట్లకంటే ఎక్కువగా ఉంది. మొత్తంగా చూసినప్పుడు బైడెన్ కంటే డోనాల్డ్ ట్రంప్ 0.8 పాయింట్లు ఆధిక్యంలో ఉన్నారు. ఐతే ఇద్దరు నాయకులూ 2020 కంటే చాలా భిన్నమైన పద్ధతిలో ప్రచారంలో ఎదురీత ఈదుతున్నారని సర్వే వెల్లడించింది. వీరిద్దరిమధ్య నువ్వా–నేనా అన్న రీతిలో ఎన్నికలు సమీపించేకొద్దీ పరిస్థితుల్లో మార్పులు సంభవించవచ్చునని కూడా సర్వే వెల్లడించింది.

# ఇరాన్‌లో ఉగ్రదాడి

## ఐదుగురు రివల్యూషనరీ గార్డ్స్ మృతి



**టెహ్రాన్ :** ఇరాన్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఐదుగురు భద్రతా సిబ్బంది మరణించారు. కిడ్నాపులు, ఆత్మహత్యతో బాంబుదాడులు చేయడంలో ఆరితేరిన జైషే అల్ అదిల్ సంస్థ ఈ దాడికి పాల్పడిందని గుర్తించారు. ఈ దాడిలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్‌కు చెందిన ఐదుగురు మరణించారు. ఛాబహార్‌లోని పోలీసు పోస్ట్‌పైన, రాస్క్‌లోని రివల్యూషనరీ గార్డ్స్‌పైనా ఉగ్రవాదులు ఈ దాడులు చేసినట్లు ఇరాన్ ప్రభుత్వ టీవీ తెలియజేసింది. 15 మంది ఉగ్రవాదులు ఈ దాడిలో పాల్గొన్నారని ప్రభుత్వ టీవీ తెలియజేసింది. బుధవారం సాయంత్రం జరిగిన ఈ దాడిలో మరో పది మంది గార్డులు గాయపడ్డారు.

**ఇజ్రాయెల్ దాడిలో మా జోక్యం లేదు : అమెరికా**

ఇదిలా ఉండగా, రెండురోజుల క్రితం ఇజ్రాయెల్ సిరియాలో దౌత్యకార్యాలయంపై దాడులు చేయడంపై ఇరాన్ దేశాధ్యక్షుడు ఆయెతుల్లా ఖొమైనీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడికిగాను ఇజ్రాయెల్‌కు కఠినశిక్ష తప్పదని హెచ్చరిక చేశారు. ఈ నేపథ్యంలో అమెరికా గురువారం ఒక ప్రకటన చేస్తూ ఇజ్రాయెల్ చేసిన దాడిలో తమ ప్రమేయం లేదని సంజాయిషీ ఇచ్చింది. ఇజ్రాయెల్ చేసిన గగనతల దాడిలో ఇరాన్‌కు చెందిన ఇద్దరు సైనిక జనరల్స్, మరో ఐదుగురు సైనిక సలహాదారులు మరణించారు. దీంతో ఖొమైనీ తీవ్ర ఆగ్రహం చెందారు. సిరియాలో ఉన్న ఇరాన్ దౌత్యకారాలయాన్ని ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసం చేసింది. దీంతో అమెరికాకు చెందిన అగ్రశ్రేషిన కమాండర్ ఒకరు వివరణ ఇచచ్చారు. ఇజ్రాయెల్ పశ్చిమాసియా అంతటా దాడులకు పాల్పడుతోందని ఇరాన్ మండిపడింది. ఈ దాడుల విషయంపై తమకు సరైన సమాచారం తెలియదని కూడా అమెరికా కమాండర్ ఇరాన్‌కు సందేశం పంపారు.

# తైవాన్‌లో సహాయ చర్యలు ముమ్మరం



**తైపే :** తైవాన్‌లో భారీ భూకంప మృతుల సంఖ్య తొమ్మిదికి పెరిగింది. గాయపడినవారిసంఖ్య 1000 కు చేరిందన అధికారులు ప్రకటించారు. సహాయ చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రజలు కూలిపోయిన భవంతులలోకి వెళ్ళి తమ విలువైన వస్తువులను, సామాగ్రిని బయటకు తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం హెలికాప్టర్ల ద్వారా సహాయ చర్యలు ముమ్మరం చేసింది. బుధవారం ఉదయం తైవాన్‌లో భారీ భూకంపం సంభవించింది.

## నేతన్నలను ఆదుకోండి (మొదటి పేజీ తరువాయి)

హయాంలో మాదిరిగానే నేతన్నలకు చేతి నిండా పని కల్పించాలని కోరారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వడంతోపాటు ఎన్నికల కోడ్ వల్ల ఆపిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి అని డిమాండ్ చేశారు. చేనేత మిత్రా వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం అందుతున్న అన్నీ కార్యక్రమాలను ప్రభుత్వం అమ లు చేయాలి. అవసరమైతే మరింత సాయం చేసి ఆదుకోవాలన్నారు. కేవ లం గత ప్రభుత్వంపై దుగ్ధతో నేతన్నల పొట్ట కొట్టడం సరైంది కాదు. రైతన్న మాదిరే, నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత బాధకరం. వస్త్ర పరిశ్రమను ఆదుకోకపోతే కాంగ్రెస్ భారీ మూల్యం చెల్లించక తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ రాశారు.

## అతి సంపన్నులపై పన్ను

(మొదటి పేజీ తరువాయి)

బృందా కారత్, నీలోత్పల్ బసులు విడుదల చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా), మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) వంటి నిరంకుశ చట్టాలను రద్దు చేస్తామని మ్యానిఫెస్టోలో సిపిఐ(ఎం) ప్రకటించింది. అతి సంపన్నుల (సూపర్ రిచ్)పై పన్ను వేస్తామని, సాధారణ సంపద పన్ను, వారసత్వ ఆస్తి పన్ను విధింపుపై కొత్త చట్టాన్ని తీసుకువస్తామని పేర్కొంది. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం బడ్జెట్‌ను రెట్టింపు చేస్తామని, పట్టణ ఉపాధి హామీ కోసం నూతన చట్టం చేస్తామని తెలిపింది. విద్వేష ప్రసంగాలకు వ్యతిరేకంగా చట్టం కోసం పోరాడుతామని, పౌరసత్వ సవరణ చట్టం–2019 (సిఎఎ)ని రద్దు చేస్తామని పేర్కొంది. మతాన్ని రాజకీయల నుండి వేరు చేయాలనే రాజీ లేని సూత్రానికి కట్టుబడి ఉంటామని సిపిఐ(ఎం) స్పష్టం చేసింది. స్వతంత్ర వ్యవస్థల స్వయంప్రతిపత్తిని కాపాడుతామని, ప్రజల ప్రజాస్వామిక హక్కులను పరిరక్షిస్తామని పేర్కొంది. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను పునఃపరిశీలిస్తామని, లేబర్ కోడ్‌ల స్థానంలో కార్మికుల అనుకూల చట్టాలను తీసుకుస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రాలకు రాజ్యాంగ హక్కులను పునరుద్ధరిస్తామని, కేంద్రం వసూలు చేసే పన్నులు, సర్‌ఛార్జ్‌ల మొత్తంలో రాష్ట్రాలకు 50 శాతం వాటా కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. జనాభా లెక్కల సందర్భంగా ఓబిసి వివరాలు సేకరించాల్సిన అవసరం ఉన్నదని, మహిళలకు చట్ట సభల్లో మూడవ వంతు రిజర్వేషన్ కల్పించాలని కోరింది. ప్రస్తుత ప్రభుత్వం అవలంభిస్తున్న ఆశ్రిత పక్షపాత విధానాలు, మతతత్వం, కార్పొరేట్‌ల అనుబంధ విధానాలకు పూర్తి భిన్నమైన విధానాల కోసం కృషి చేస్తామ పేర్కొంది. త్వరలోనే మరింత విస్తారంగా ప్రత్యామ్నాయ విధానాలతో మ్యానిఫెస్టో రెండవ భాగాన్ని తీసుకువస్తామని తెలిపింది.

## ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

చిన్నారి వేదశ్విని అక్కడికక్కడే మృతి చెందారు. జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పసునూరుకు చెందిన మోక్షిత్ (7) మృతి చెందాడు. అర్వపల్లి మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన కంపసాటి మహేష్, అడివేంలకు చెందిన సాయిరెడ్డి, పిల్లలమర్రి గ్రామానికి చెందిన చెరుకుపల్లి సైదమ్మ, చింటు, శైలజ, విజయేందర్, తుంగతుర్తి మండలం పసునూరు గ్రామానికి చెందిన గొలుసుల సంధ్య, కొమ్ము సువర్ణ, చివ్వెంల మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన జీడిమెట్ల సైదులు, గుంపులకు చెందిన శివరాత్రి హైమావతి, శివరాత్రి రాములమ్మ, ఆత్మకూర్(ఎస్) మండలం ఏనుభాములకు చెందిన బొప్పాని పావని, లావణ్య తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదం జరగగానే సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని గాయపడ్డ వారిని జిల్లా జనరల్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మృతి చెందిన వారిని మార్చురికి చేర్చారు. గాయపడ్డ వారి పరిస్థితి విషమించడంతో పలువురుని మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌కు తరలించారు. జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు, డిఎస్పి రవిలు సంఘటన స్థలానికి చేరుకోని ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు.

## దేశంచూపు..మనవైపే..

(మొదటి పేజీ తరువాయి)



ఎంతో ఉపయోగపడిందన్నారు. అలాగే ఈ నెల 6న జరిగే జనజాతర సభలో పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి పాంచ్ న్యాయ్ పథకాలను, మ్యానిఫెస్టోను ఎఐసిసి అధ్యక్షులు, మల్లిఖార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ విడుదల చేస్తారని తెలిపారు. ఈ సభకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీతో పాటు పలువురు జాతీయ నాయకులు హాజరవుతారని తెలిపారు. మండల స్థాయి నాయకులను సమన్వయం చేసుకుంటూ కింది స్థాయి ప్రజలకు సభ ఉద్దేశ్యాన్ని వివరించి, తీసుకురావాలని సూచించారు.

కనీవిని ఎరుగని రీతిలో సభ : శ్రీధర్‌బాబు

రాజీవ్ గాంధీ ప్రాంగణంలో పెద్ద స్థాయిలో బహిరంగ సభ నిర్వహించి, కాంగ్రెస్ పార్టీ జాతీయ మ్యానిఫెస్టోను విడుదల చేయనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సిఎం సమీక్ష అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమావేశ వివరాలను వెల్లడించారు. ఇండియా బ్లాక్ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలని, యావత్తు రాష్ట్రం నుండి లక్షలాది మంది కాంగ్రెస్ జన జాతర సభకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సభలోనే దేశానికి సంబంధించిన కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజల ముందు పెడతామన్నారు. రానున్న 48 గంటల్లో పార్లమెంటు నియోజకవర్గ స్థాయిలో మండలస్థాయి నాయకులను సంప్రదించి సభ ఉద్దేశ్యాన్ని తెలియజేయాలని అన్నారు.

### ప్రజలే తాట తీస్తారు

తాట తీస్తానన్న కెటిఆర్ మాటలను మీడియా ప్రస్తావించగా, ప్రజలు ఎవరి తాట తీసారో చూశామని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మరోసారి ఎవరి తాట తీస్తారో చూస్తామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మంత్రి కొండా సురేఖకు కెటిఆర్ పంపిన లీగల్ నోటీసుపై చట్టపరంగా, న్యాయపరంగా ఏమి సమాధానం చెప్పాలో, ఎలా ఎదుర్కోవాలో అలా చేస్తామని అన్నారు. చేనేత కార్మికులకు రూ.400 కోట్ల గురించి కెటిఆర్ లేఖ రాయడం విడ్డూరంగా ఉన్నదని, ఆ బకాయిలన్నీ గత ప్రభుత్వ హయానికి సంబంధించినవేనని చెప్పారు.

### పదేళ్ళలో కెటిఆర్ ఎందుకు విచారణ చేయలేదుః పొన్నం

ఉమ్మడి ఎపి ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో తనది, సహచర ఎంపిలవి ఫోన్‌లు ట్యాప్ చేశారని తాను ఆరపించినట్లు కెటిఆర్ అన్నారని, దానికి కట్టుబడి ఉన్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆ తరువాత వచ్చిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ళు అధికారంలో ఉన్నదని, అందులో కెటిఆర్ మంత్రిగా ఉన్నారని, ఆయన తన సహచర ఉద్యమకారులైన మా ఫోన్ ట్యాపింగ్‌పై ఎందుకు విచారణ చేయలేదని ప్రశ్నించారు. ప్రతిపక్షాలను, స్వంత పార్టీ వారిని అణిచివేసేందుకు , వ్యవస్థను నియంత్రణలోకి తెచ్చుకునేందుకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇష్టమొచ్చినట్లు ట్యాపింగ్ చేసారని మండిపడ్డారు. అది వదిలేసి గతంలో పొన్నం ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేయాలని కెటిఆర్ అనడం హాస్యాస్పదమన్నారు.

## సోమవారం తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదు. పది ఫోన్లు ఇచ్చినా అన్నీ ఫార్మాట్ చేసే ఇచ్చారు. నోటీసులు ఇచ్చిన తర్వాత 4 ఫోన్లను కవిత ఫార్మాట్ చేశారు. నిందితులు వందల డిజిటల్ డివైజ్‌లను ధ్వంసం చేశారు. అప్రూవర్‌గా మారిన వ్యక్తిని కవిత బెదిరించారు. తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పవద్దని బెదిరించారు. ఆమె చిన్న కుమారుడు ఒంటరి కాదు. సోదరుడు, కుటుంబ సభ్యులు తోడుగా ఉన్నారు. కుమారుడి పరీక్షల కోసం మధ్యంతర బెయిల్ అడిగారు. కొన్ని పరీక్షలు ఇప్పటికే పూర్తయ్యాయి'' అని ఇడి తెలిపింది. వాదనల అనంతరం రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును రిజర్వు చేసింది. సోమవారం తీర్పు వెలువరించనున్నట్టు న్యాయమూర్తి తెలిపారు. ఏప్రిల్ 20న రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై వాదనలు వింటామని కోర్టు తెలిపింది.

## పట్టపగలే చుక్కలు... (మొదటి పేజీ తరువాయి)

ముగించుకుంటున్నారు. మధ్యాహ్న సమయంలో ట్రాఫిక్ రద్దీ తగ్గి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. చిరువ్యాపారులు, రోజు వారి కూలీలు నానా అగచాట్లు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉంది. 2016 తర్వాత ఈ ఏడాది అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు . రాత్రి పూట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు డిగ్రీలు అధికంగా ఉంటున్నాయని వెల్లడించారు. కాగా, శుక్ర, శని వారాల్లో రాష్ట్రంలో వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తీవ్రత అధికంగా ఉంటుందని పేర్కొంది. వృద్ధులు, పిల్లలు ఈ సమయంలో బయటకు రావద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏప్రిల్ మొదటి రెండు మూడు రోజుల్లోనే 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు ముందుముందు మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## గవర్నర్‌ను కోరుతాం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి పరిధిలోకి వచ్చే అంశమని, ముఖ్యమంత్రి ఆదేశాలు లేకుండా ఫోన్ ట్యాపింగ్ జరగబోదని కిషన్ రెడ్డి అన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల ఫోన్లను ఇష్టారాజ్యంగా అక్రమ పద్ధతిలో ట్యాపింగ్ చేశారని, దుబ్బాక, హుజురాబాద్, మునుగోడు ఉపఎన్నికల్లో బిజెపి నాయకుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు పోలీసుల నివేదికలో తెలుస్తున్నాయని, పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు, సమాజంలో ప్రముఖ వ్యక్తుల ఫోన్లు ట్యాపింగ్ చేశారు. కొంతమందిని బెదిరించి కోట్లాది రూపాయలు వసూలు చేసినట్లుగా తెలుస్తోందన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి కారణం ఎవరనేదానిపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. కెసిఆర్, వారి కుటుంబ సభ్యుల ప్రత్యక్ష ప్రమేయం స్పష్టంగా బయటపడుతోందని, ఇది తీవ్రమైన అంశం, దీని ఫలితాలు కూడా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

హోం శాఖ లిఖిత అనుమతి ఉండాలి

దేశ భద్రత, సమగ్రతకు భంగం వాటిల్లే అంశంతో ముడిపడి ఉన్నప్పుడే కేంద్ర హోం శాఖ కార్యదర్శి లిఖితపూర్వకమైన అనుమతి తీసుకుని మాత్రమే ఫోన్ ట్యాపింగ్ చేయాల్సి ఉంటుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన వ్యక్తి వివరాలు హోంశాఖ కార్యదర్శికి పంపించి ముందస్తు అనుమతి తీసుకున్నాకే ఫోన్ ట్యాపింగ్ చేయాలని చెప్పారు. తరువాత పూర్తి వివరాలను నివేదిక సమర్పించాల్సి ఉంటుందన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం దేశ సమగ్రతకు భంగం కలిగించేలా వ్యవహరించిందని, రాజకీయాల్లో లబ్ధి కోసం, కక్షసాధింపు చర్యతో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, కోట్లాది రూపాయలను దోపిడీ చేసేందుకు ప్రైవేటు వ్యక్తుల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేశారని విమర్శించారు. కెసిఆర్ తనయుడు కెటిఆర్ స్వయంగా అక్కడక్కడ ఒకరిద్దరి ఫోన్లు ట్యాపింగ్ జరిగి ఉండొచ్చని ప్రకటించారని, నాడు షాడో ముఖ్యమంత్రిగా కెటిఆర్ వ్యవహరించారని, నేడు కేసులు వస్తే తనకేం సంబంధం అంటూ బుకాయిస్తున్నారని అన్నారు. దీనిపై సుమోటోగా స్వీకరించి కఠినంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఎలక్షన్ కమిషన్ పై ఉన్నదన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్రమైన అంశమని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని, బరితెగించి ప్రజాస్వామ్యాన్ని హత్యచేసేలా, వ్యక్తి స్వేచ్ఛను హరించే విధంగా వ్యవహరించిందన్నారు.

పార్టీ ఫిరాయింపు చట్టానికి బిఆర్‌ఎస్ తూట్లు:గత పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో పార్టీ ఫిరాయింపుల చట్టానికి తూట్లు పొడిచిందని కిషన్ రెడ్డి విమర్శించారు. ఒక పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలను ఫిరాయింపులకు ప్రోత్సహించి కనీసం రాజీనామా చేయకుండానే తమ ప్రభుత్వంలో చేర్చుకుని మంత్రి పదవులు ఇచ్చిన చరిత్ర బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలది అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ దుర్మార్గపు అలవాట్లను కొనసాగిస్తూ పార్టీ ఫిరాయింపులకు పాల్పడటాన్నే ఎజెండాగా పెట్టుకుందని ఆరోపించారు.

## రైతులు మృతి

సమాచారం ఇవ్వడంతో అటు వైపు వెళ్తున్న వారు చూడగా ఆ దారిలో పోశం శవమై ఉన్నాడు. గ్రామస్థులు పోలీసులకు, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఏనుగు సంచరిస్తున్న ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలను అటవీ శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. మరణించిన కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం పది లక్షల రూపాయల ఎక్స్‌గ్రేసియా అటవీ శాఖ నుంచి అందుతాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. అల్లూరి శంకర్ కుటుంబాన్ని, కారు పోశం కుటుంబాన్ని కాగజ్ నగర్ ఎంఎల్‌ఏ పాల్వాయి హరీష్ బాబు, బెజ్జూర్ మాజి జెడ్‌పిటిసి పాల్వాయి సుధాకర్ రావు పరామర్శించారు. ఏనుగు దాడిలో మరణించిన కుటుంబాలకు 20 లక్షల ఎక్స్‌గ్రేషియా 5 ఎకరాల భూమి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఏనుగును తిరిగి పంపించే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఏనుగు దాడిలో గ్రామాలలో భయాందోళన నెలకొంది.

అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యమే ఇద్దరు రైతుల మరణానికి కారణం

మండల ఫారెస్ట్ అధికారులు కొండపల్లి గ్రామంలో, అడవి ప్రాంత గ్రామాలలో నివసిస్తున్న గ్రామస్తులకు ముందస్తుగానే ఏనుగు జిల్లాలో ప్రవేశించిందని, పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తే పోశం చనిపోయేవాడు కాదని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కొండేపల్లి సంఘటన స్థలాన్ని అడిషనల్ కలెక్టర్ దాసరి వేణు, ఇంచార్జ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి సుధాకర్, కాగజ్ నగర్ డిఎస్‌పి కరుణాకర్, రూరల్ సిఐ రాంబాబు, తహసిల్దార్ వెంకటేశ్వర్ రావు, ఎస్ఐ కొమురయ్య గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోశం కుటుంబానికి ఐదు ఎకరాల భూమి, పది లక్షల రూపాయలు ఇంట్లో ఒకరుకి ఉద్యోగం తో పాటు భరోసా ఇవ్వాలంటూ గ్రామస్తులు ఆందోళనకు దిగడంతో దానిని ముందుగా నిరాకరించిన రేంజ్ అధికారిపై గ్రామస్తులు ఘర్షణకు దిగారు. సంఘటన స్థలంలో డిఎస్‌పి కరుణాకర్, సిఐ రాంబాబు పోలీసు బందోబస్తుతో ఘర్షణ కాకుండా చూసి గ్రామస్తులను సంజాయించడంతో పాటు ఒప్పంద పత్రం రాసి అందజేయగా ఆందోళన విరమించుకున్నారు. మృతునికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. భార్య కారు సుశీల ఫిర్యాదు మీరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిఎస్‌పి కరుణాకర్ తెలిపారు.

## ప్రహసనం (మొదటి పేజీ తరువాయి)

కంపెనీలా అని అనుమానాలు ఉత్పన్నమవుతున్నాయి.

ఎన్నికల బాండ్ల పథకం ప్రారంభమైన నాటినుంచే రిజర్వుబ్యాంక్ అనుమానాలను సెంట్రల్ బ్యాంక్, ఆర్థిక మంత్రిత్వశాఖ మధ్య అంతర్గత ఉత్తర ప్రత్యుత్తరాలు వెలుగులోకి తెచ్చాయి. ఆర్థిక మంత్రిత్వశాఖ అధికారికి 2017 జనవరి 30న ఆర్‌బిఐ జనరల్ మేనేజర్ రాసిన లేఖలో ఇలా వుంది ః ఎన్నికల బాండ్ల ''అసలు కొనుగోలుదారు... ఒక రాజకీయ పార్టీకి వాస్తవికమైన దాత కాకపోవచ్చు. అటువంటప్పుడు పారదర్శకత అనే ఉద్దేశిత ప్రయోజనం నెరవేరకపోవచ్చు. ఈ బాండ్లు బేరర్ బాండ్లు. డెలివరీలో బదిలీకి వీలైనవి. అందువల్ల అంతిమంగా రాజకీయ పార్టీకి బాండ్ ఇచ్చిన దాత ఎవరో తెలియదు. బేరర్ బాండ్ కొనుగోలు చేస్తున్న వ్యక్తి లేదా సంస్థ వివరాలు లేదా మధ్యలో ప్రవేశిస్తున్న వ్యక్తులు, సంస్థల గుర్తింపు, కొలమానాలు కెవైసి (మీ కస్టమర్‌ను తెలుసుకోండి) ప్రకారం తెలియకపోవచ్చు. ఆ విధంగా ''మనీ లాండరింగ్ నిరోధక చట్టం, 2002 స్ఫూర్తి దెబ్బతింటుంది''. నాటి రెవెన్యూ కార్యదర్శి హస్ముఖ్ అదియా ఇలా జవాబు రాశారు ః ''దాతను గోప్యంగా ఉంచుతూ, ఒక వ్యక్తి పూర్తిగా పన్ను చెల్లించిన అనంతర ధనం నుండే విరాళం చెల్లించేటట్లు ప్రతిపాదించిన మెకానిజంను ఆర్‌బిఐ అర్థం చేసుకోలేదు.''

ఆర్థిక మంత్రిత్వశాఖ 2018 జనవరిలో ఎలక్టోరల్ బాండ్‌ల పథకం ప్రవేశపెట్టింది. బేరర్ బాండ్లు జారీచేసే, వాటిపై నగదు చెల్లించే అధికారం ఎస్‌బిఐకి అప్పగించబడింది. 2024 జనవరిలో సుప్రీం కోర్టు దాన్ని రాజ్యాంగ విరుద్ధంగా కొట్టివేసేవరకు అది కొనసాగింది. మనీలాండరింగ్, పన్ను ఎగవేత గూర్చి ఆర్‌బిఐ వ్యక్తం చేసిన ఆందోళనలను ఈ 45 కంపెనీల డేటా సూచనప్రాయంగా ధృవీకరిస్తున్నది.

## బాబు జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం : సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని, దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతిని పురస్కరించుకొని బాబూజీ సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. అత్యంత పేదరికంలో జన్మించిన బాబూజీ అకుంఠిత దీక్షతో అత్యున్నత స్థానానికి ఎదిగారని ముఖ్యమంత్రి అన్నారు. జాతీయోద్యమంలో పాల్గొన్న బాబూజీ రాజ్యాంగ పరిషత్ సభ్యునిగానూ సేవలందించారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో తొలి కార్మిక శాఖమంత్రిగా బాధ్యతలు స్వీకరించి, కార్మిక సంక్షేమానికి పాటు పడ్డారని కొనియాడారు. కార్మిక పక్షపాతిగా గుర్తింపు పొందిన బాబూజీ రెండు దఫాలు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగానూ సేవలు అందించారన్నారు. దేశవ్యాప్తంగా కరవు తాండవిస్తున్నప్పుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవం విజయవంతంలో కీలక పాత్ర పోషించారన్నారు. రైల్వే, జాతీయ రవాణ శాఖమంత్రిగానూ తనదైన ముద్ర వేశారన్నారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు పోరాడారన్నారు. దళితుల అభ్యున్నతికి ఎంతగానో పాటుపడ్డారని చెప్పారు. బాబూజీ స్ఫూర్తితో ప్రజా పాలన కొనసాగిస్తున్నామని, ఆయన ఆశయ సాధనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు.





## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో భారీగా బిఆర్ఎస్ నేతల చేరికలు

**ప్రజాపక్షం / హైదరాబాద్:** టిపిసిసి అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో వరంగల్, చేవెళ్ల, మహబూబ్‌నగర్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన పలువురు బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సిఎం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ కడియం శ్రీహరి, వరంగల్, చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థులు కడియం కావ్య, రంజిత్‌రెడ్డి, మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి వంశీచందర్ రెడ్డి, ఎంఎల్‌సి పట్నం మహేందర్‌రెడ్డి, నాయకులు మైనంపల్లి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపికి ఓటువేస్తే మనుధర్మ శాస్త్రానికి మద్దతు ఇచ్చినట్లే : మారుపాక అనిల్ కుమార్

**ప్రజాపక్షం/వరంగల్ :** మనుధర్మ శాస్త్రం మనిషిని మనిషిగా చూడలేదు అలాంటి మనుధర్మ శాస్త్ర భావాజాలంతో కలిగిన బిజెపికి ఓటేస్తే మను ధర్మ శాస్త్రానికి మద్దతు ఇచ్చినట్లే అని డిపిహెచ్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. దళితుల హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) వరంగల్ జిల్లా కౌన్సిల్ సమావేశం ఎలేందర్ అధ్యక్షతన గురువారం శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. బిజెపి మోడీ నేతృత్వంలో అధికారంలోకి వచ్చాక దేశంలో మత సామరస్యం తీవ్రంగా దెబ్బతిందన్నారు. దళితుల పైన దాడులు పెరిగాయని, లౌకి క దేశాన్ని హిందూ రాజ్యాం గ మార్చడానికి కేంద్రంలోని మోడీ ప్రభు త్వం శరవేగంగా పావులు కదుపుతుందన్నారు.



పౌరసత్వ చట్టాన్ని వెంటనే అమలు చేస్తామని చెప్పడం వరకు ఆ పోకడలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలన్నింటిని తన గుప్పెట్లోకి తీసుకుంది. రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి ఒక పథకం ప్రకారం సకల ప్రయత్నాలు ప్రారంభించింది. 400 సీట్లు పార్లమెంట్‌లో గెలిస్తే భారత రాజ్యాంగాన్ని పూర్తిగా రద్దు చేస్తామని కర్ణాటక బిజెపి ఎంపి అనంత హెగ్డే వాఖ్యానించారన్నారు. గతంలో నిజామాబాద్ బిజెపి పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ భారత రాజ్యాంగాన్ని బాజాప్తిగా మారుస్తామని చెప్పారు. కేవలం ఆ ఇద్దరు ఎంపిలు మాటలు అనుకుంటే పొరపాటది, ఆర్ఎస్ఎస్ సూచనతో బిజెపి నేతలు మాటలుగా మనం గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ‘రెరా’ అనుమతులు లేని ‘రియల్ ఎస్టేట్’లో పెట్టుబడి పెట్టొద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ‘రెరా’ అనుమతులు లేని రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులలో పెట్టుబడి పెట్టి, కొనుగోలు చేసి మోసపోరాదని కొనుగోలుదారులకు తెలంగాణ రెరా అదారిటీ సూచించింది. కొనుగోలుదార్లకు భరోసా కల్పిస్తూ వారి రక్షణ కోసం రెరా అథారిటీ అన్ని చర్యలు తీసుకుంటుందని అథారిటీ తెలిపింది. రెరా రిజిస్ట్రేషన్ పొందకుండా వ్యాపార ప్రకటనలు జారి చేయడం, మార్కెటింగ్ కార్యకలాపాలు నిర్వహించడం రెరా నిబంధనలు ఉల్లంఘించినట్లుగా భావించి, తగిన చర్యలు తీసుకుంటామని అథారిటీ స్పష్టం చేసింది. అదేవిధంగా ప్రీలాంచింగ్ పేరుతో అమ్మకాలు చేపట్టడం రెరా చట్టం ప్రకారం శిక్షర్హులుగా పరిగణిస్తామని, అందుకు చర్యలు తీసుకుంటామని రెరా అదారిటీ హెచ్చరించింది. రెరా చట్టం నిబంధనల మేరకు దేవలపర్లు, ప్రమోటర్లు సంబంధిత సంస్థల నుండి అన్ని అనుమతులు పొందిన వెంటనే వాటిని రెరా అధికారిక వెబ్ సైట్‌లో సంబంధిత ప్రాజెక్ట్ పూర్తి వివరాలు నమోదు చేసి రేరా రిజిస్ట్రేషన్ పొందాలని స్పష్టం చేసింది. కొనుగోలుదారుల నమ్మకానికి పూర్తిస్థాయి భరోసా ఇవ్వడానికి రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు క్రమం తప్పకుండా త్రైమాసిక, వార్షిక నివేదికలను విధిగా రెరా వెబ్ సైట్‌లో ప్రాజెక్టు అభివృద్ధి వివరాలను పొందుపరచాలని ఆదేశించింది.

**బిల్డాక్స్‌పై రూ.3కోట్ల 96లక్షల 39వేల600 అపరాధ రుసుం విధింపు..**

బిల్డాక్స్ ప్రాజెక్టు విషయంలో రెరా ట్రిబ్యునల్ గురువారం హియరింగ్ (విచారణ) జరిపిన ఆధారంగా బిల్డాక్స్ ప్రాజెక్టుకు రూ. 3 కోట్ల 96 లక్షల 39 వేల 600 అపరాధ రుసుం విధించింది. బిల్డాక్స్ జారి చేసిన ప్రకటన ఫేస్ బుక్ లో ఇంకనూలో కొనసాగుతున్నందున, ఈ కారణంగా ప్రజలకు తప్పుడు సమాచారం చేరవేస్తూ సంబంధిత వ్యక్తుల నుండి నగదు వసూళ్ళకు పాల్పడుతున్నట్లు గ్రహించి రెరా చట్టంలోని సెక్షన్ 59, 60 రెడ్విత్ 38 ప్రకారం రూ. 3 కోట్ల 96 లక్షల 39 వేల 600 అపరాధ రుసుంగా విధించినట్లు రెరా అథారిటీ చెప్పింది. బిల్డాక్స్ తరఫు న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేయడానికి 3 వారాల సమయం కావాలని కోరినప్పటికీ ఫేస్‌బుక్ బిల్డాక్స్ ప్రాజెక్టు వారి ప్రకటన ఇంకా కొనసాగడాన్ని పరిగణలోకి తీసుకుని కొనుగోలు దారులు మోసాలకు గురికాకుండా వారిని అప్రమత్తం చేయడానికి బిల్డాక్స్‌కు అపరాధ రుసుం విధించినట్లు రెరా అథారిటీ గురువారం జారీ చేసిన ప్రకటనలో వెల్లడించింది. ఇదే ప్రాజెక్ట్ విషయంలో ఎలాంటి ప్రకటనలు, మార్కెటింగ్, విక్రయాలు కొనసాగించరాదని రెరా అథారిటీ బిల్డాక్స్‌కు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫేస్ బుక్ ప్రకటనలు వెంటనే తొలగించాలని రెరా ట్రిబ్యునల్ బిల్డాక్స్‌ను ఆదేశించింది.

# కాంగ్రెస్, కమలం మధ్య నలుగుతున్న కారు

**కారు దిగుతున్న నేతలు - బేజారులో క్యాడర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ప్రత్యేక రాజకీయ పరిస్థితులు నెలకొన్నాయి. అధికార పార్టీ కాంగ్రెస్, బిజెపి మధ్య బిఆర్ఎస్ పార్టీ నలుగుతుంది. పదేళ్లుగా అధికారానికి అలవాటు పడిన బిఆర్ఎస్ నాయకత్వం అధికారం చేజారే సరికి ఒడ్డున పడిన చేపలా గిలగిలలాడుతున్నారు. కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్ వైపుకు మళ్లేటప్పుడు జపించిన అభివృద్ధి మంత్రాన్నే బయటకు వెళ్లేటప్పుడు కూడా జపిస్తున్నారు. అక్రమ సంపాదనలో అక్రమ ఆస్తులు ఎక్కడ బయటపడతాయోనన్న ఆందోళనలో కొందరిలో నెలకొంది. పదవి ఉన్నా లేకపోయినా అధికార పార్టీలో ఉంటే మన జోలికి ఎవరు రారన్న భావన కొందరి నేతల్లో ఉంది. ఈ భావనే బిఆర్ఎస్ పార్టీని బలహీనపరుస్తుంది. ఇక కాంగ్రెస్ కాస్త దూకుడుగానే ఉంది. ముఖ్యంగా వలస వాదులకు పార్లమెంటుకు పోటీ చేసే అవకాశం కల్పించడం విస్తృత చర్చకు దారి తీస్తుంది. ఇతర పార్టీల నుంచి చేరిన వారికి అవకాశం కల్పిస్తే వారిని ప్రజలు ఆదరించిన దాఖలాలు గడిచిన పదేళ్లలో లేవు. పార్టీ ఫిరాయించి గెలిచిన వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. అయినా కాంగ్రెస్ నాయకత్వం అతి నమ్మకంతో ఫిరాయింపు అభ్యర్థులకు అవకాశం కల్పిస్తుంది. బిఆర్ఎస్ నుంచి పార్లమెంటు అభ్యర్థిగా ప్రకటించిన కడియం కావ్యను పార్టీలో చేర్చుకుని వరంగల్ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించింది. ఇది ఒక రకంగా బిఆర్ఎస్‌కు ఇబ్బందికరమేమో కానీ భవిష్యత్తులో కాంగ్రెస్‌కు ఇబ్బందులు తప్పక పోవచ్చు. బిఆర్ఎస్ పార్టీ ఫిరాయింపులు, వలస వాదులకు పార్టీలో ప్రాధాన్యత కల్పించడం పార్టీ ఓటమికి దారి తీసిన పరిస్థితులు అందరికి విధితమే. ఇక బిఆర్ఎస్ పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారైంది. ఒక పక్క శాసన సభ ఎన్నికల్లో ఘోర ఓటమి, ఆ తర్వాత కేసులు, అతి పెద్ద విజయంగా చెప్పుకునే కాళేశ్వరం విఫలం కావడం కూడా బిఆర్ఎస్‌ను కోలుకోలేనివిధంగా దెబ్బతీసింది. ఎవరిని నమ్మి పార్టీలో అవకాశాలు కల్పించారో ఆ వ్యక్తులే పార్టీ మారుతున్నారు. ఇప్పటికీ ఇద్దరు ఎంఎల్‌ఎలు చేజారగా మరి కొంత మంది ఎంఎల్‌ఎలు తుక్కుగూడ సభలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోబోతున్నారన్న ప్రచారం బిఆర్ఎస్‌ను మరిన్ని ఇబ్బందులకు గురి చేస్తుంది. ఇప్పటికే ఇద్దరు ఎంఎల్‌ఎలు చేజారగా మరో 12 మంది కాంగ్రెస్‌లో చేరితే కాంగ్రెస్ బలం 76కు చేరుకుంటుంది. ఇక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలన్న ఆలోచన ఉన్నా ఏమి చేయలేని స్థితికి బిఆర్ఎస్ చేరుకుంటుంది. ఇప్పుడు వరుస పెట్టి పార్టీ మారుతున్న వారిని నిలువరించలేని స్థితిలో బిఆర్ఎస్ అధినాయకత్వం ఉంది. కరువు, నీటి ఎద్దడి ఇవేమి కూడా ప్రజలు కాంగ్రెస్‌ను కాదని బిఆర్ఎస్ వైపు చూసేలా చేయడం లేదు. కాంగ్రెస్ పార్టీ పైనా ఇప్పటికీ ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతుంది. ఇక బిజెపి దేశంలో పదేళ్లుగా అధికారంలో ఉండడంతో ఆ పార్టీ పట్ల తెలంగాణలో సానుకూలత లేదు. గత పార్లమెంటు ఎన్నికల్లో సాధించిన సీట్లు కూడా ఈ దఫా తెలంగాణలో బిజెపి సాధించ లేకపోవచ్చు. రెండవ సారి బిజెపి పట్ల తీవ్రమైన సానుకూలత 2018 శాసన సభ ఎన్నికల్లో ఓడిన తర్వాత బిఆర్ఎస్‌కు కాంగ్రెస్ ప్రత్యామ్నాయంగా ఎదగక పోవడంతో 2019 పార్లమెంటు ఎన్నికల్లో కొంత మంది కొన్ని జిల్లాల ప్రజలు బిజెపి వైపు చూశారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రాష్ట్రంలో 2023 శాసన సభ ఎన్నికల తర్వాత బిజెపి మూడో స్థానానికే పరిమితం కావడంతో ప్రజలు ఆ వైపుగా చూసే పరిస్థితి లేదు. చైతన్యవంతమైన తెలంగాణ గడ్డ మీద బిజెపి రామ మంత్రం అంతగా పని చేయక పోవచ్చు. బిజెపి మరోక సారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేయడం సహా ప్రజల జీవన విధానం పైన దాడి జరుగుతుందన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. ఎట్టి పరిస్థితుల్లోను తెలంగాణలో బిజెపికి మూడో స్థానమే దక్కుతుంది. గతంలో నాలుగు స్థానాలు గెలిచిన బిజెపికి ఈసారి ఆ నాలుగు స్థానాలు గెలవడం కూడా గగనమే. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ స్థానాల్లో కనీస పోటీ ఇవ్వలేని స్థితిలో బిజెపి ఉందన్నది వాస్తవం. కానీ బిజెపి ఎత్తుగడల ముందు అప్పుడు కాంగ్రెస్ ఇప్పుడు బిఆర్ఎస్ చిత్తవుతుంది. మీడియా దన్ను బిజెపికి వరంగా మారింది. ఏదో సాధిస్తామన్న ఒక భ్రమకు ప్రజలను గురి చేయడంలో బిజెపి ఒక్కింత ముందు ఉంది. దీనితో బిఆర్ఎస్ నాయకత్వం కాంగ్రెస్ తప్పితే బిజెపి అన్న ఆలోచనలో ఉన్నారు. ఈ ఆలోచనే కారు పార్టీని తీవ్ర ఒత్తిడికి గురి చేస్తుంది. కానీ వాస్తవానికి ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు బిఆర్ఎస్సే ప్రత్యామ్నాయ పార్టీగా ఉంది. కాంగ్రెస్ సైతం ఇది అంగీకరించక తప్పని స్థితి. ఇక బిజెపిని తెలంగాణ గడ్డ మీద వేళ్లునుముకోకుండా చేయడం ప్రజాస్వామ్య వాదులందరి ప్రధాన కర్తవ్యం కావాలి. ఇప్పటికే బిజెపి విధానాలతో విసిగిపోయిన దేశ ప్రజలకు మరోసారి బిజెపికి మద్దతు నివ్వడం లేదా అధికారంలోకి తీసుకు రావడం ఇష్టం లేని పని. రామ మంత్రం, అభివృద్ధి జపం రెండు ఈ దఫా బిజెపికి ఓట్లను సాధించిపెట్టలేవన్న వాస్తవాన్ని ప్రజల కంటే ముందు బిఆర్ఎస్ నేతలు గుర్తెరిగితే మంచిది.

## కెటిఆర్ లీగల్ నోటీసులు పంపి బెదిరించాలని చూస్తున్నారు

**ఎంఎల్ఎ యన్నెం శ్రీనివాస్‌రెడ్డి**

**ప్రజాపక్షం / హైదరాబాద్:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారకరామారావుకు లా, ఆడిమినిస్ట్రేటివ్ పరిజ్ఞానంలేదని, తనకు లీగల్ నోటీసులు పంపి బెదిరించాలని చూస్తున్నారని మహబూబ్‌నగర్ ఎంఎల్ఎ యన్నెం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి రూ.2500 కోట్లు ఢిల్లీకి కప్పం కట్టారని మాజీ మంత్రి కెటిఆర్ చేసిన ఆరోపణలకు తామే కెటిఆర్‌కు లీగల్ నోటీసులు ఇవ్వాలన్నారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో వివిధ ప్రాంతాల్లో వార్ రూమ్‌లు ఏర్పాటు చేసి ఫోన్ ట్యాపింగ్ చేశారని మీడియాలో కథనాలు వచ్చాయని, మీడియాలో వార్తలను చూసి తన ఫోన్ కూడా ట్యాపింగ్ జరిగిందనే అనుమానంతో విచారణ జరపమని డిజిపికి ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో ఉన్న అధికారులు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, డిజిపికి తెలియకుండా స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి ట్యాపింగ్ చేశారని ఆయన ఆరోపించారు. ఇందిరాగాంధీ ఆఫీషియల్‌గా వాహనాలు వాడుకున్నారని అలహాబాద్ కోర్ట్ డిస్క్వాలీఫై చేసిందని, దీని ప్రకారం బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు అందరూ అనర్హులేనన్నారు. తీవ్రవాదుల కదలికలపై నిఘాకోసం ఫోన్లు ట్యాప్ చేస్తారని, కానీ ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేయడం చరిత్రలో లేదని, ఫోన్ ట్యాపింగ్‌లు అన్నీ ప్రగతిభవన్ వేదికగానే జరిగిందని ఆయన ఆరోపించారు. ఫామ్ హౌస్,గెస్ట్ హౌస్‌లో కూర్చుని పరిపాలన చేశారని అర్థమవుతుందని, ఇప్పటికే అధికారులు సస్పెండ్ అయ్యారని, టాస్క్ పోర్క్ వాహనాలలో డబ్బులు చేరవేశామని రిమాండ్‌లో ఉన్న పోలీసు అధికారులు చెప్పారని ఆయన అన్నారు.





## స్వాతంత్ర్యం తెచ్చింది.. తెలంగాణ ఇచ్చిందీ కాంగ్రెస్సే

**మాజీమంత్రి జానారెడ్డి**



**ప్రజాపక్షం/డిండి :** స్వాతంత్ర్యం తెచ్చింది తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. గురువారం డిండి మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జానారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గ్రామాల్లో ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లు ఇప్పటికి దర్శనమిస్తున్నాయని బిఆర్ ఎస్ ప్రభుత్వం ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా పేదలకు అందించలేదని అన్నారు ఎస్ఎల్‌బిసి, డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికి పదేళ్ల కాలయాపన చేశారని, కేవలం కాళేశ్వరం కమిషన్లకోసం కాళేశ్వరం కట్టారని అన్నారు.

రఘువీరా రెడ్డిని నల్లగొండ పార్లమెంట్ నుండి అత్యధిక మెజార్టీతో గెలిపించి చరిత్ర తిరగరాయాలన్నారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో 33 వేల మెజారిటీ ఇచ్చి బాలు నాయక్‌ను ఎలా గైతే గెలిపించారో అదే పట్టుదలతో నియోజకవర్గం నుండి లక్ష మెజార్టీని అందించి దేవరకొండ సత్తా చాటలని అన్నారు.

చిరకాల కోరిక అయినటువంటి డిండి ప్రాజెక్టుకు ఎదుల ద్వారా నీటిని అందించి, ఎస్ఎల్‌బిసి సోరంగాన్ని పూర్తి చేసేందుకు జానారెడ్డి కృషి చేయాలని కోరారు. పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ జానారెడ్డి తనయుడుగా దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటానని, ఎమ్మెల్యే బాలు నాయక్ తో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.ఈ సమావేశం లో డిసిసి అధ్యక్షులు శంకర్ నాయక్, మాజీ జడ్పి వైస్ చైర్మన్ లింగారెడ్డి,జడ్పీటీసీ దేవేందర్ రావు, పిఏసిఎస్ చైర్మన్‌లు జాల నర్సింహా రెడ్డి, వేణుధర్ రెడ్డి,నాగార్జున రెడ్డి, సిరాజ్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు రాజేష్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర రావు,మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగా రెడ్డి,భాస్కర్ రెడ్డి,శేఖర్ రెడ్డి, రాం కిరణ్, కుర్మా రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, గోపాల్ రావు,కాశన్న, వెంకటయ్య, రాములు, లక్‌పతి, రేఖ్యా,తిరుపతి, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్‌తో అతి పెద్ద స్కామ్

**నయీమ్ కేసును మళ్లీ విచారించాలి**

**కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు**

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ ద్వారా అతిపెద్ద స్కాం జరిగిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ అంశం ఇప్పుడు దేశంలోనే సంచలనంగా మారిందన్నారు. హైదరాబాద్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తప్పు చేసిన వారు ఎంతటివారైనా ప్రభుత్వం వదిలిపెట్టబోదని ఆయన హెచ్చరించారు. మాజీ నక్సలైట్ నయీమ్ కేసును మళ్లీ విచారణ చేపట్టాలని విహెచ్ డిమాండ్ చేశారు. నయీమ్ కేసులో ఉన్న నాయకులు, పోలీసు అధికారులు ఎవరో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. నయీమ్‌కు చెందిన వందల కోట్ల ఎకరాలు, పేదల భూములు ఎక్కడకు పోయాయని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నయీమ్ కేసును నీరుగార్చిందని హనుమంతరావు ఆరోపించారు.





## హెచ్‌సియులో ఉగాది వేడుకలకు రండి

**సిఎంకు హెచ్‌సియు విద్యార్థుల ఆహ్వానం**

**ప్రజాపక్షం / హైదరాబాద్:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియు) నిర్వహించనున్న ఉగాది వేడుకలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్‌సియు ఎన్ఎస్‌యుఐ యూనిట్ ఆహ్వానించింది. ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఎన్ఎస్‌యుఐ విద్యార్థులు గురువారం సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. ఉగాది వేడుకల పోస్టర్‌ను ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

## వందరోజుల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేశాం : మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన స్వల్ప కాలంలోనే ఐదు గ్యారెంటీలను అమలు చేసి ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధతను చాటుకుందని అటవీ, పర్యావరణ, దేవాదా య శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ జి ల్లా కరీమాబాద్‌లోని 32, 33 డివిజన్ల పరిధిలో నిర్వహించి న బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవానికి మంత్రి సురేఖ హాజరయ్యారు. బొడ్రాయిలకు నిర్వహించిన అభిషేక కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య మంత్రి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వందరోజుల్లోనే ఐదు గ్యారెంటీలను అమలు చేసి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం చేతల ప్రభుత్వంగా నిరూపించుకుందని చెప్పారు. తొమ్మిదిన్నర ఏండ్ల పాలనలో ప్రజలకు ఉపయోగపడే ఏ పనిచేయని బిఆర్ఎస్ ప్రభుత్వం పథకాల అమలు ఏమైందంటూ కాంగ్రెస్ ప్రజాప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ జనంలో మరింత దిగజారిపోతుందని విమర్శించారు. రాబోయే కాలంలో తెలంగాణ ఉజ్వలంగా ఎదుగుతుందని చెప్పారు.



## బిసిలకు 10 లోక్‌సభ స్థానాలు కేటాయించాలి

**జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో బిసిలకు 10 లోక్‌సభ స్థానాలు కేటాయించాలని కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీల అధ్యక్షులను జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య కోరారు. హైదరాబాద్ కాచిగూడలో గురువారం జాతీయ బి.సి సంక్షేమ సంఘం కోర్ కమిటీ సమావేశం జరిగింది. బిసి ఉద్యమం ఉధృతం చేయడానికి తెలంగాణ జిల్లాల వారిగా బిసి జోడో యాత్ర నిర్వహించాలని ఈ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ బిసి డిమాండ్‌లపై విధాన ప్రకటన చేసి తమ తమ మేనిఫెస్టో లో ప్రకటించాలన్నారు. 15 లక్షల ఉద్యోగాలను ప్రకటించాలని, లేనిచో పార్టీలను చితుగా ఒడిస్తామని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బిసిలు పార్టీలకు అతీతంగా పోరాటానికి సిద్ధం కావాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు. గతంలో అన్ని రాజకీయ పార్టీలు సామాజిక న్యాయం నినాదంతో పరుగులు తీస్తుంటే, మన రాష్ట్రంలో అన్ని స్థాయిలలో టికెట్ల కేటాయింపులలో, నామినేటెడ్ పోస్టల కేటాయింపులలో బిసిలకు అన్యాయం చేస్తున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడి బిసిలకు అన్యాయం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైన బిసిల జనాభాకు అనుగుణంగా లోక్‌సభ ఎన్నికల్లో టికెట్లు కేటాయించాలని రాజకీయ పార్టీలను ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, అంజి, ఉదయ్ నేత, రాజ్ కుమార్, రాజు, నిఖిల్ పటేల్ మోడి, రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.



# జవాబుదారీతనంతోనే పాలన

**మీడియా సమావేశంలో మల్లు భట్టివిక్రమార్క**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలో కేసిఆర్ మాదిరి ఇష్టానుసారంగా పాలన చేయడం లేదని జవాబుదారి తనంతో పని చేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ముఖ్యమంత్రి నుంచి సహచర మంత్రులందరూ వారి వారి శాఖలకు సంబంధించి నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ పురోగతి సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుండి ఈ ప్రభుత్వాన్ని కూల్చేస్తాం, పడగొడతామంటూ బిఆర్ఎస్, బిజెపి నేతలు మాట్లాడుతున్నారని ప్రభుత్వం పటిష్టంగా ఉంటే ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే విధంగా నిర్ణయాలు తీసుకోవచ్చునన్న ప్రజాస్వామ్య స్ఫూర్తికి లోబడి బిఆర్ఎస్ లేదా ఇతర పార్టీల నుంచి ప్రజా ప్రతినిధులను పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని ఆయన తెలిపారు.

కేసిఆర్ విమర్శలకు అర్థం పర్థం లేదని ముఖ్యమంత్రి కానీ తాను లేదా ఇతర మంత్రులు ఢిల్లీ వెళ్లినప్పుడు రాష్ట్రానికి కావాల్సిన ప్రాజెక్టులు మంజూరు చేయిస్తున్నామని నిధులు సాధిస్తున్నామని కేసిఆర్ మాదిరి ఢిల్లీ వెళ్లి బీహార్ లేదా ఇతర రాజకీయ పార్టీల నేతలతో తాము మాట్లాడలేదని ఆయన తెలిపారు. కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి అంటూ కేసిఆర్ మాట్లాడడంలో అర్థం లేదని ఏ ప్రాజెక్టును ఆయన పూర్తి చేయక పోగా నిర్మాణ వ్యయం విపరీతంగా పెరిగిందని యాదాద్రి పవర్ ప్రాజెక్టు ఒక్కసారిగా రూ. 24 వేల కోట్ల నుంచి రూ. 35 వేల కోట్లకు పెరిగిందని ఆయన తెలిపారు. భద్రాద్రి ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ అనుమతులే తీసుకోలేని కేసిఆర్ మూడు నెలల కాంగ్రెస్ పాలనను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఖమ్మం జిల్లా ప్రజలు పది స్థానాల్లో తొమ్మిదింటిలో కాంగ్రెస్‌ను గెలిపించారని మరో సారి పార్లమెంటు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రంలో 12 నుంచి 14 పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించబోతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, మహ్మద్ జావిద్, డిసిసిబిఅధ్యక్షులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అప్పులను తీరుస్తూ సంక్షేమం అందిస్తున్నాం

**రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** దేశం తెలంగాణ వైపు చూస్తున్నదని మూడు నెలల కాలంలో చేసిన కార్యక్రమాలు దేశం మొత్తం చూసేలా ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు రుణమాఫీ చేయకుండా ఇప్పుడు బిఆర్ఎస్ నేతలు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని ఆయన తెలిపారు. గురువారం ఖమ్మంలో జరిగిన నియోజక వర్గ కార్యకర్తల సమావేశంలో తుమ్మల మాట్లాడుతూ అవినీతి, కబ్జాలతో, పోలీసుల సహాయంతో తిరిగి అధికారంలోకి వస్తామని ప్రజలను కాంగ్రెస్ కార్యకర్తలను హింసించి భయపెట్టారన్నారు. ప్రజల శక్తి యుక్తుల ముందు వారి ఆశలు పటాపంచాలయ్యాయన్నారు.

సోనియా గాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తుమ్మల తెలిపారు. బిఆర్ఎస్ చేసిన అప్పులకు ఒక పక్క వడ్డీలు చెల్లిస్తూనే సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. 125 రోజుల కాంగ్రెస్ పాలన వైపు దేశం చూస్తుందని అందుకే దేశం మొత్తం కూడా తెలంగాణ గ్యారెంటీలను అమలు చేయాలని పార్టీ భావిస్తుందన్నారు. ఖమ్మంజిల్లాలో నీరు లేక పంటలు ఎండిపోలేదని ఎక్కువ భాగం భూగర్భ జలాల పైనే ఆధారపడి పంటలు పండిస్తున్నారని



రోజుకు రూ. 50 కోట్లు ఖర్చు పెట్టి రాష్ట్రంలో విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. బిఆర్ఎస్‌కు రాష్ట్రంలో ఒక్క స్థానం కూడా రానివ్వబోమని తుమ్మల సవాల్ విసిరారు. ఈ సభలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మి నారాయణ, నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్, దొబ్బల సౌజన్య, మలీదు వెంకటేశ్వర్లు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్, మిక్కిలినేని నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
శుక్రవారం, ఏప్రిల్ 05

## దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష

మోడీ హయాంలో బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నాయి. రాష్ట్రాల హక్కులను హరిస్తూ, సమాఖ్య స్ఫూర్తిని కాలరాస్తూ ఏక స్వామ్య విధానాన్ని ప్రవేశపెట్టేందుకు కేంద్రం కంకణం కట్టుకున్నట్టుంది. ముఖ్యంగా బిజెపికి కొరుకుడుపడని దక్షిణాది రాష్ట్రాలపై కక్ష పెంచుకుందేమోగాని, రాజ్యాంగ బద్ధంగా అందించాల్సిన నిధులను కూడా నిలిపేసి వేధిస్తున్నది. కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య తన మంత్రివర్గ సహచరులతో కలిసి న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు దిగారంటే, పరిస్థితి తీవ్రతను ఊహించుకోవచ్చు. కర్నాటకతోపాటు, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు కూడా కేంద్ర పన్నుల్లో వాటా, జిఎస్‌టి పరిహారం రద్దు, రాష్ట్ర రుణాల కార్యక్రమాలకు కేంద్ర మద్దతు, కరువు లేదా వరద పరిస్థితుల్లో ప్రత్యేక సాయం వంటి ప్రధాన డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతున్నాయి. భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నిధులను డిమాండ్ చేస్తున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 293ను బేఖాతరు చేస్తూ, రాష్ట్రాల రుణ పరిమితిని కుదిస్తూ, కేంద్రం నిరంకుశంగా వ్యవహరిస్తున్నదన్న విమర్శలు ఉన్నాయి. కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా (సిఎఫ్ఐ) నుంచి గ్యారంటీతో రుణ పరిమితులను నిర్ణయించడానికి రాష్ట్రాలకు ఉన్న హక్కులను నీరుగారుస్తున్నదనే ఆరోపణలూ కొత్తకాదు. ద్రవ్య విధానంలోనూ సమాఖ్య మూలాలు ఉండాలన్న రాజ్యాంగ మూల సూత్రాన్ని మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. 15వ ఆర్థిక సంఘం సిఫారసు వల్లే తమ రుణాలపై కేంద్రం ఆంక్షలు విధించిందని, నిధుల ప్రవాహం తగ్గిపోయిందని మూడు దక్షిణాది రాష్ట్రాల ఆరోపణ. 2023 జూన్‌లో జిఎస్‌టి పరిహారం ముగియడం వల్ల కూడా నష్టపోతున్నామని వాపోతున్నాయి. జిఎస్‌టి వసూళ్లలో మొదటి స్థానం మహారాష్ట్రకాగా, రెండో స్థానంలో ఉన్న కర్నాటక గత ఆర్థిక సంవత్సరంలో 4.30 లక్షల కోట్ల రూపాయలకుపైగా పన్ను రూపంలో జమచేసింది. కానీ, ఇందులో కేవలం 12 నుండి 13 శాతం మాత్రమే కేంద్రం నుంచి పొందుతున్నది. కేరళ విషయంలోనూ మోడీ ప్రభుత్వం ఇదే రకమైన వివక్షను ప్రదర్శిస్తున్నది. రాష్ట్ర ఆదాయాల్లో రూ. 57,400 కోట్ల కోత విధించింది. జిఎస్‌టి పరిహారాన్ని నిలిపివేసిన కారణంగా రూ. 12,000 కోట్లు, రెవెన్యూ లోటు గ్రాంట్లలో రూ. 8,400 కోట్లు, కెఐఎఫ్‌బి, పెన్షన్ కంపెనీ రుణాలను ప్రభుత్వ అప్పులుగా లెక్కించడం వల్ల రుణ పరిమితిలో కోత రూ. 7,000 కోట్లు.. ఇలా కేరళ అన్ని విధాలా నష్టపోతున్నది. తమిళనాడును కూడా కేంద్రం వేధింపులకు గురి చేస్తూనే ఉంది. రెండు సార్లు తుపాన్లు, వరదలతో అల్లాడిపోయినప్పటికీ, తమిళనాడుకు సాయం చేయలేదు. అంతేకాదు [illegible], కర్నాటక, కేరళతో సమానంగానే తమిళనాడు కూడా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నది. ఈ మూడు రాష్ట్రాల నుంచి ప్రత్యక్ష పన్నుల రూపంలో చెల్లించిన మొత్తాల్లో కనీసం పావు వంతు కూడా కేంద్రం తిరిగి ఇవ్వడం లేదు. బిజెపి పాలిత రాష్ట్రాల విషయానికి వస్తే, ఉదారంగా సాయం చేస్తున్న కేంద్రం, కేరళ, కర్నాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల సంక్షేమ పథకాల వివరాలు, నివేదికలు ఇచ్చినా స్పందించడం లేదు. కరువుకాటకాలతో అల్లాడుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రకృతి వైపరీత్యాలతో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరిగినా చలించడం లేదు. ఈ పరిస్థితుల్లో కర్నాటక, కేరళ, తమిళనాడు హక్కుల కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించక తప్పలేదు. సుప్రీంకోర్టు జోక్యంతో కేంద్రం కేరళకు రూ.13వేలకోట్లు విడుదల చేసింది. అయినా రావల్సింది రెండు–మూడు రెట్లు ఉంది. వివాదాస్పద సాగు చట్టాల నుంచి నిన్నమొన్నటి ఎలక్టోరల్ బాండ్ల రద్దు వరకూ అనేక సందర్భాల్లో అత్యున్నత న్యాయ స్థానం ఆగ్రహించడం, ఆతర్వాత మోడీ ప్రభుత్వం వాటిని రద్దు చేయడం ఆనవాయితీగా మారింది. రాష్ట్రాలకు రాజ్యాంగపరంగా అందాల్సిన మొత్తాలను బిగపట్టి, ఆర్థికంగా ఉక్కిరిబిక్కిరి చేసి తన దారికి తెచ్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం రాజ్యాంగ విరుద్ధం. సమాఖ్య స్ఫూర్తికి విఘాతం.

# జెఎన్‌యులో లెఫ్ట్ యూనిటీ విజయం దేశానికి దిక్సూచి

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థిసంఘం (జెఎన్‌యుఎస్‌యు) ఎన్నికలలో వామపక్షాలు ఐక్యత ప్రదర్శించి విజయదుందుభి మోగించాయి. మార్క్సిస్టు భావజాలం, అంబేద్కర్ ఫూలే భావజాలం ఈ రెండూ సమైక్యమై విశ్వవిద్యాలయంలో మతశక్తులను ఈ ఎన్నికల్లో చిత్తుచేసిన కృషి అభినందనీయం. జెఎన్‌యులో వామపక్ష విద్యార్థి సంఘాలకు ఎన్నికల్లో విజయం కొత్త విషయం కాదు. కానీ 18వ లోక్‌సభ ఎన్నికలకు మొదటిదశ ఓటింగ్ ప్రక్రియ మరో 14 రోజుల్లో ప్రారంభం కానున్న తరుణంలో వామపక్ష మద్దతుగల విద్యార్థి సంఘాలు ఐక్యంగా సాధించిన ఈ విజయం దేశంలో నరేంద్రమోడీ పాలనకు వ్యతిరేకంగా మారుతున్న ఆలోచనా సరళికి ప్రతిబింబం. జెఎన్‌యు విద్యార్థి సంఘంలో కీలకమైన అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులూ వామపక్ష విద్యార్థి సంఘాలకే దక్కాయి. ఇంతకంటే అతిముఖ్యమైన మరో ప్రత్యేకత ఏమిటంటే 27 సంవత్సరాల తర్వాత జెఎన్‌యు ఎన్నికల్లో ఒక దళిత విద్యార్థి నాయకుడు అధ్యక్షపదవిని చేపట్టడం. అదేవిధంగా మైనారిటీ వర్గానికి చెందిన అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) నాయకుడు మహ్మద్ సాజిద్ సంయుక్త కార్యదర్శి పదవిని చేపట్టడం జెఎన్‌యు విద్యార్థులు సాధించిన ఘనత. వామపక్ష, అంబేద్కర్ భావజాలాలకు చెందిన విద్యార్థి సంఘాల కూటమి కీలకమైన నాలుగు పదవులనూ ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో గెలుచుకుని ఆర్‌ఎస్‌ఎస్ కాషాయ కూటమి సారథ్యానగల అఖిలభారత విద్యార్థి పరిషత్ (ఎబివిపి)కు చెందిన విద్యార్థికూటమిని మట్టికరిపించింది. లోక్‌సభ ఎన్నికలవేళ ఆర్‌ఎస్‌ఎస్ కూటమికి ఇది పెద్ద శరాఘాతం. తద్వారా దేశంలో మతోన్మాద నియంతృత్వ పోకడలను వ్యాప్తిచేసే ఫాసిస్టు శక్తులను నిర్మూలించవచ్చునని ఎఐఎస్‌ఎఫ్‌తోపాటు ఎస్‌ఎఫ్‌ఐ (భారత విద్యార్థి సమాఖ్య), సిపిఐ(ఎంఎల్) అనుబంధ అఖిలభారత విద్యార్థి సంస్థ (ఎఐఎస్‌ఎ), ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య(డిఎస్‌ఎఫ్)ల కూటమి దేశ ప్రజలకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. జెఎన్‌యులో ఈ ఎన్నికల ఫలితాలు ప్రకటించగానే లాల్ హాయ్...పూరా క్యాంపస్ లాల్ హాయ్...అనే నినాదాలు మిన్నుముట్టడంతో ఒక సరికొత్త లౌకిక ప్రజాస్వామ్య భావనలు సర్వత్రా వ్యాపించాయి. ఎఐఎస్‌ఎకు చెందిన దళిత విద్యార్థి నాయకుడు ధనంజయ్ అధ్యక్ష పదవిని గెలుచుకోగా, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు అవిజిత్ ఘోష్ ఉపాధ్యక్ష పదవిని చేపట్టారు. ప్రధాన కార్యదర్శి పదవికి బిఎపిఎస్‌ఎకు చెందిన ప్రియాన్షీ ఆర్య ఎన్నికయ్యారు. వామపక్షాలు మద్దతు ఇచ్చిన డిఎస్‌ఎఫ్‌కు చెందిన విద్యార్థి నాయకురాలు స్వాతి సింగ్‌ను ప్రధాన కార్యదర్శి పదవికి ఎంపిక చేయగా పోలింగ్‌కు కొద్దిసేపటి ముందు ఎబివిపి కుట్రచేసి ఆమె పేరును పోటీలో లేకుండా చేశారు. దాంతో ఆర్య వామపక్ష అభ్యర్థిగా తెరమీదకు వచ్చారు.

గడచిన 12 సంవత్సరాలలో లేనివిధంగా ఈసారి ప్రతిష్ఠాత్మకంగా జరిగిన విద్యార్థిసంఘు ఎన్నికల్లో రికార్డుస్థాయిలో 73 శాతం పోలింగ్ నమోదైంది. దేశంలో నెలకొన్న పరిస్థితులను అర్థం చేసుకున్న చైతన్యవంతమైన విద్యార్థిలోకం ఎంతో చురుకుగా, క్రియాశీలమైన ఆలోచనాధోరణితో నిర్ణయం తీసుకుని లౌకిక ప్రజాస్వామ్య భావజాలంగల వామపక్ష అంబేద్కర్ విద్యార్థి కూటమిని గెలిపించింది. ఎఐఎస్‌ఎఫ్ నాయకుడు సాజిద్ 508 ఓట్ల మెజారిటీతో ఎబివిపి అభ్యర్థిని ఓడించారు. అధ్యక్షపదవికి పోటీచేసిన దళిత విద్యార్థి నాయకుడు ధనంజయ్ 922 ఓట్లతో తన ఎబివిపి ప్రత్యర్థిపై విజయం సాధించారు. ఉపాధ్యక్షుడు అవిజిత్ ఘోష్ 927 ఓట్లతో గెలిచారు. అదేవిధంగా వామపక్ష విద్యార్థుల మద్దతుగల బిర్సా అంబేద్కర్ ఫూలే స్టూడెంట్స్ అసోసియేషన్ (బిఎపిఎస్‌ఎ)కు చెందిన ప్రియాన్షీ ఆర్య 926 ఓట్లతో అత్యంత కీలకమైన ప్రధాన కార్యదర్శి పదవిని దక్కించుకున్నారు.

**కాషాయ అనుకూల జెఎన్‌యు యంత్రాంగం కుట్రలు :**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేసే జెఎన్‌యు పాలనాయంత్రాంగం దీర్ఘకాలం గా విశ్వవిద్యాలయంలో ఎబివిపి అనుకూల విధానాలు అవలంబిస్తూ వస్తోంది. అనేక మార్గాల్లో ఈ ఎన్నికల ఫలితాలను తలక్రిందులు చేసేందుకు ఈ ఎన్నికలను పెద్దగా ఎవరి దృష్టిలోకీ రాకుండా చేసేందుకు మొదటినుండి ప్రయత్నాలు చేస్తూ వచ్చింది. జెఎన్‌యు పాలనాయంత్రాంగం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో హింసకు తలుపులు తీసింది. ఈ కారణంగా వామపక్ష, లౌకిక, దళిత భావజాల విద్యార్థిసంఘాల నాయకులపై ఎబివిపి ఇష్టానుసారంగా దాడులుచేస్తూ వస్తోంది. ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు ఎఐఎస్‌ఎఫ్ నాయకుడు జెఎన్‌యుఎస్‌యు సంయుక్త కార్యదర్శి డేనిష్ ప్రయత్నాలు చేయడంతో కక్షగట్టి ఎబివిపి నాయకులు ఆయనపై దాడిచేశారు. జెఎన్‌యు యంత్రాంగం సహాయంతో ఎబివిపివారు వామపక్ష విద్యార్థి కార్యకర్తలే లక్ష్యంగా హింసకు పాల్పడింది. అన్యాయాన్ని ప్రతిఘటించినవారి గొంతు నొక్కేసింది. ఒకవైపు ఎబివిపి భౌతికదాడులు చేస్తుంటే మరోవైపు జెఎన్‌యు యంత్రాంగం పలు నిబంధనల పేరుచెప్పి వారిని అణచివేతకు గురిచేసింది. క్రమశిక్షణా చర్యలు పేరుతో నానాఇబ్బందులు పెడుతూ వచ్చింది. ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎ కార్యకర్తలపై అనేకసార్లు వారు హింసకు పాల్పడ్డారు. పలుమార్గాల్లో ఈ ఎన్నికలకు ఆటంకాలు కలిగించి లెఫ్ట్ యూనిటీని దెబ్బతీసేందుకు ఎబివిపి ప్రయత్నించింది. ఎన్నికలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేసింది. అయితే ఎఐఎస్‌ఎఫ్ నాయకుడు డేనిష్ కౌంటర్ పిటిషన్ దాఖలు చేయటంతో కోర్టు ఎదుటిపక్షం పిటిషన్ ను తిరస్కరించింది. ఆర్‌ఎస్‌ఎస్‌కు ముందే తెలుసు, జెఎన్‌యులో వామపక్ష విద్యార్థి సంఘాలు విజయకేతనం ఎగురవేస్తాయని. అందుకే వారు ఎన్నికలలో గెలిచే ప్రయత్నాలు చేయకుండా వామపక్ష విద్యార్థి సంఘ నాయకులను మానసికంగా దెబ్బతీసేందుకు దాడులు ప్రారంభించారు. అయినప్పటికీ వామపక్షాలు ఐక్యంగా నిలబడి ఈ ఎన్నికల్లో ఘనవిజయం సాధించాయి. వామపక్షాలు దేశంలో రైతు ఉద్యమానికి మద్దతుగా నిలిచాయి. కార్మికోద్యమాలకు మద్దతుగా నిలిచాయి. ఇప్పుడు దేశంలో కార్మిక, కర్షక ఉద్యమం జరుగుతోంది. ఆ ప్రభావం జెఎన్‌యు విద్యార్థి సంఘాల ఎన్నికలపై కూడా ప్రభావం చూపించింది. అందుకే ఎబివిపిని ఓడించేందుకు బిరసా అంబేద్కర్ ఫూలే స్టూడెంట్స్ అసోసియేషన్ (బిఎపిఎస్‌ఎ)కు చెందిన ప్రియాన్షీ ఆర్యను ప్రధాన కార్యదర్శి పదవికి నిలబెట్టారు. బిఎపిఎస్‌ఎ ఆవిర్భవించిన పదేళ్లకి ఈ సంస్థ తొలి విజయం సాధించింది.

ఇకమీదట జెఎన్‌యు క్యాంపస్‌లో ఆర్‌ఎస్‌ఎస్, ఎబివిపి మతోన్మాద కార్యకలాపాలకు తావులేదు. వాటిని సహించేదిలేదని నాయకులు హెచ్చరించారు. విద్యార్థులకు కేటాయించే సీట్లలో కోతవిధించటం, భారీగా ఫీజులు పెంచేయటం, నిధులను తగ్గించేయటం, వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్యతను దెబ్బతీయటం వంటి అనేక చర్యలకు వీరు పాల్పడ్డారు. యూనివర్శిటీలో ఫీజుల పెరుగుదలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎప్పుడూ ముందంజలోనే ఉంది. రిజర్వేషన్‌లను దెబ్బతీసేందుకు జరిగిన ప్రయత్నాలను ప్రతిఘటించటంలో, విద్యార్థు ల సంక్షేమాన్ని రక్షించటంలో వామపక్షాలు ఎల్లప్పుడూ ముందే ఉన్నాయి. ఇప్పుడు గెలిచిన విద్యార్థుల కూటమి మరింత పటిష్టంగా క్యాంపస్‌ను సమర్థవంతంగా నడిపించగలవు. కేంద్రప్రభుత్వం జెఎన్‌యులో విద్యార్థులకు ఎప్పుడూ ద్రోహమే చేసింది. వారు అధికార యంత్రాంగ పక్షం వహించారు తప్ప విద్యార్థుల సమస్యలను పట్టించుకోలేదు. ఎబివిపి కూడా తప్పుడు ప్రచారాలతో జెఎన్‌యు ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నాలే చేసింది. క్యాంపస్‌లో మహిళలకు రక్షణ ఇవ్వటం, ఫీజులు తగ్గించటం, శాంతిని కాపాడటం ఎన్నికైన కొత్తకమిటీ లక్ష్యం.




**జెఎన్‌యులో విజయం భారతదేశ విజయం:**

జెఎన్‌యు క్యాంపస్‌లో విద్యార్థి సంఘాల విజయం భారతదేశ లౌకిక ప్రజాస్వామ్య విజయం అని ఎన్నికలలో గెలిచిన తరువాత జెఎన్‌యుఎస్‌యు సంయుక్త కార్యదర్శి మహ్మద్ సాజిద్ కృతజ్ఞతలు తెలియచేశారు. మార్చి 24న ఎన్నికల తరువాత ఫలితాలు వెలువడ్డాక విజయోత్సవ ర్యాలీ జరిగింది. అనంతరం గంగాధాబా వద్ద బహిరంగ సభ కూడా నిర్వహించారు. ఈ బహిరంగ సభలో సాజిద్ మాట్లాడుతూ మేము ఇప్పుడు విద్యకోసం పోరాటం చేస్తాం అన్నారు. ఫీజుల పెరుగుదలపై పోరాటం చేస్తాం. రిజర్వేషన్ కోటాను తగ్గించటాన్ని ప్రతిఘటిస్తాం. సీట్ల కేటాయింపులో కోత పెట్టటాన్ని వ్యతిరేకిస్తాం. మహిళలపై అత్యాచారాలను అడ్డుకుంటాం అని సాజిద్ చెప్పారు. జెఎన్‌యులో ఇటీవల మహిళలపై లైంగిక వేధింపులు పెరిగాయి. ప్రొఫెసర్ అతుల్ జోహ్రికి వ్యతిరేకంగా ఒక ఫిర్యాదు కూడా దాఖలైంది. పోలీసులు కూడా చాలా సందర్భాల్లో వేధింపుదారులకు మద్దతు ఇచ్చారు. ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కూడా సరైన చర్యలు తీసుకోలేదు. వీటికి వ్యతిరేకంగా తాము పోరాడతామని, మహిళలకు రక్షణ ఇస్తామని సాజిద్ చెప్పారు. వామపక్ష ఐక్యతను సమున్నతంగా చాటిచెపుతూ యూనివర్శిటీ రక్షణకు, విద్యార్థుల రక్షణకు పోరాటం చేస్తామని, మా లక్ష్యాలు సాధించేదాకా కృషిచేస్తామని ఆయన చెప్పారు. ఒక నిరుపేద తండ్రి బిడ్డలకు, ఒక గ్రామీణ పేదకు, అదేవిధంగా ఒక భారత రాష్ట్రపతి స్థాయి వ్యక్తికి లభించే విద్య ఒకేవిధంగా ఉండేట్టు చూస్తామని, విద్యావ్యవస్థలో అందరికీ సమానమైన నాణ్యతా ప్రమాణాలు ఉండేలా చూస్తామని విద్య వ్యాపారీకరణకు, విద్యలో మత ఉన్మాదాన్ని చొప్పించటానికి వ్యతిరేకంగా నిరంతర పోరాటాలు చేస్తామని కూడా సాజిద్ ప్రతినబూనారు. (న్యూ ఏజ్ సౌజన్యంతో)




ధనంజయ్ (ఎఐఎస్‌ఎ) ప్రెసిడెంట్ | అవిజిత్ ఘోష్ (ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు) వైస్ ప్రెసిడెంట్ | ప్రియాన్షీ ఆర్య (బిఎపిఎస్‌ఎ) ప్రధాన కార్యదర్శి | మహమ్మద్ సాజిద్ ఎఐఎస్‌ఎఫ్ నాయకుడు జాయింట్ సెక్రటరీ

## ఆహారం పరబ్రహ్మ స్వరూపం...

తినడానికి వీలుగా ఉండి కూడా తినకుండా విస్మరించబడిన లేదా విసిరేసిన ఏవైనా ఆహార పదార్థాలను ఆహార వ్యర్థాలని అంటారు. 2022లో ప్రపంచ వ్యాప్తంగా 1.05 బిలియన్ టన్నుల ఆహార వ్యర్థాలు(తినదగిన పదార్థాలతో సహా)ఉత్పత్తి చేయబడ్డాయి. ప్రపంచ వ్యాప్తంగా 783 మిలియన్ల మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. జనాభాలో మూడవ వంతు ఆహార అభద్రతను అనుభవిస్తున్నారు. గృహాల ద్వారా రోజుకు సుమారు ఒక బిలియన్ భోజనం వృధా అవుతుంది. వినియోగదారులకు అందుబాటులో ఉన్న మొత్తం ఆహారంలో దాదాపు ఐదవ వంతు వృధా అవుతుంది. సగటున ప్రతీ వ్యక్తీ 79 కిలోల ఆహారాన్ని వృధా చేస్తున్నారు. వృథాలో పావు శాతం ఆదా చేస్తే ప్రపంచ వ్యాప్తంగా ఆకలితో జీవిస్తున్న 870 మిలియన్ల మందికి ఆహారాన్ని అందించవచ్చు.

**ఆహార వ్యర్థాల సూచిక 2024:** యు.యన్.ఇ.పి యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రాం మార్చ్ 27 తేదీన విడుదలచేసిన ఆహార వ్యర్థాల సూచిక 2024 ప్రకారం ఆహార వ్యర్థాలు 60 శాతం గృహాల నుండి, 28 శాతం ఆహార సేవారంగం నుండి, 12 శాతం రిటైల్ రంగం నుండి వస్తున్నాయి. ఇవి వరుసగా 631మి.ట, 290.మి.ట, 131 మి. ట గా ఉన్నాయి.( మి.ట అంటే మిలియన్ టన్నులు ) ప్రపంచంలోని వార్షిక తలసరి ఆహార వృధా 132 కిలోలుగా ఉంది. ఐక్య రాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యం 12.3 అనేది 2030 నాటికి రిటైల్ మరియు వినియోగదారు స్థాయిలలో తలసరి ప్రపంచ ఆహార వ్యర్థాలను సగానికి తగ్గించాలని లక్ష్యించింది.

**మన దేశంలో....**ఫుడ్ అండ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ వేసిన అంచనా ప్రకారం భారతదేశంలో ఉత్పత్తి చేయబడిన ఆహారంలో దాదాపు 40 శాతం ఆహారం అసమర్థమైన సరఫరా గొలుసు వ్యవస్థ కారణంగా ప్రతి సంవత్సరం వృధా అవుతుంది. విద్దూరం ఏమిటంటే ఆహారం వినియోగదారునికి చేరకముందే నష్టం జరుగుతుంది. వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రకారం ప్రతి సంవత్సరం ఉత్పత్తి చేయబడిన రూ.50,000 కోట్ల విలువగల ఆహారం వృధా అవుతుంది. దేశంలో దాదాపు 23 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్నారు. దాదాపు 3000 మంది ప్రతిరోజు సరైన ఆహారం లేని కారణంగా అనారోగ్యంతో మరణిస్తున్నారు.

**ఆహార వృధాను ఎలా తగ్గించాలి? :** అవసరమైనప్పుడు మాత్రమే అవసరమైన పరిమాణంలో ఆహారాన్ని కొనుగోలు చేయాలి. ఆహారాన్ని సరిగ్గా భద్రపరచాలి. మిగిలిపోయిన ఆహారాన్ని తిరిగి ఉపయోగించడం, అదనపు ఆహారాన్ని అవసరమైన వారికి అందించడం, ఫుడ్ బ్యాంకులకు పంపించడం మొదలైనవి చేయాలి. మిగిలిన ఆహార వ్యర్థాలను కంపోస్టింగ్ చేయాలి. ఒక ఇంటి కంపోస్టింగ్ ద్వారా 150 కిలోల వరకు ఆహారవ్యర్థాలనునివారించవచ్చు.

# కరువు పరిస్థితులు... కారణం ఎవరు?

గత పదేళ్లలో ఎన్నడూ లేనంతగా తెలంగాణలో ఇప్పుడు కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రస్తుత రబీ సీజన్లో లక్షల ఎకరాల్లో వేసిన పంటలు ఎండిపోయాయి. రైతులు దారుణంగా నష్టపోయారు. వ్యవసాయ అధికారులు నష్టాలను లెక్కించడం ప్రారంభించనప్పటికీ, ఈ వ్యవసాయ సంక్షోభం మే 13 న తెలంగాణలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ సమస్యపై ఇటు అధికార కాంగ్రెస్, అటు ప్రధాన ప్రతిపక్షం బిఆర్‌ఎస్ మాటల యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. కారణం మీరంటే మీరంటూ వాదనలకు దిగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో, కరువు పరిస్థితులకు దారి తీసిన పరిస్థితులను సింహావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉంది. నీటి పారుదల నిపుణుల అభిప్రాయం ప్రకారం, గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల కరువు పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా, కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో ప్రకృతి ప్రకోపమే కరువు పరిస్థితులకు కారణమైంది. 40 ఏళ్ల తర్వాత తొలిసారిగా కృష్ణా నది తీవ్ర నీటి లోటును ఎదుర్కొంటోంది. కృష్ణా పరివాహక ప్రాంతంలో వర్షాలు చాలా తక్కువగా కురవడంతో మహారాష్ట్ర, కర్నాటకలో కూడా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాడు ఖరీఫ్ సీజన్‌లో నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలోని ప్రాంతాల్లో అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. కర్ణాటక ప్రభుత్వం కూడా నారాయణపుర ప్రాజెక్టు పరిధిలోని ప్రాంతాల్లో క్రాప్ హాలిడే ప్రకటించింది. అయితే, ఆ తర్వాత కూడా రైతులు రబీ పంటలను సాగుచేశారు. కృష్ణానదిలోకి తగినంత ఇన్ ఫ్లో లేకపోవడంతో పంటలను రక్షించలేకపోయారు. అయితే, ఈ ఏడాది గోదావరి నదికి తగినంత ఇన్ ఫ్లో వచ్చింది. డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలల్లో కూడా గోదావరిలోకి రోజుకు 10,000 నుంచి 15,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఎక్కువగా ప్రాణహిత నది నుంచి వచ్చి చేరింది. వ్యవసాయ రంగానికి జరగబోయే ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి ప్రభుత్వం పక్కాగా ప్రణాళిక వేసి ఉంటే పంటలు ఎండిపోయేవి కావన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. గోదావరి బేసిన్‌లో నీరు అందకపోవడానికి మేడిగడ్డ బ్యారేజీ పైర్లు మునిగిపోవడమే ప్రధాన కారణం. అయితే, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలు బాగోలేదని కొందరి వాదన. అన్నారం, సుందిళ్లలో సిసి బ్లాక్‌లు కోతకు గురవుతున్నాయని, మేడిగడ్డను పట్టి పీడిస్తున్న సాంకేతిక సమస్యలు ఈ రెండు బ్యారేజీల్లో కూడా ఉన్నాయని ఇతర ప్రభుత్వ అధికారులు, మంత్రులు స్పష్టం చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) బృందం ఇటీవల మూడు బ్యారేజీలను పరిశీలించింది. ప్రభుత్వం మేడిగడ్డకు 15 కిలోమీటర్ల దూరంలో కాఫర్‌డ్యామ్ నిర్మించి, సమీపంలోని పంప్‌హౌస్‌కు నీటిని మళ్లించాల్సి ఉండింది. ఇది జరిగి ఉంటే, గోదావరిలోకి రోజుకు 15,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నందున, అధికారులు రెండు పంప్‌హౌస్‌లను నిర్వహించి రోజుకు 3,5000 క్యూసెక్కులను ఎత్తిపోసే పరిస్థితి ఉండేది. ఇది



ఎల్లంపల్లి, మిడ్ మానేరు, మల్లన్నసాగర్ నింపేందుకు ఉపయోగపడేది. గతంలో నల్గొండ జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో సుమారు రెండు లక్షల ఎకరాలను రక్షించడానికి ఎస్‌ఆర్‌ఎస్‌పి స్టేజ్2 వరకు నీటిని మళ్లించవచ్చని కొందరు అధికారులు అంటున్నారు. కానీ ఇప్పుడు గోదావరిలోకి ఇన్‌ఫ్లో రోజుకు 1,500 క్యూసెక్కులకు తగ్గడంతో ఉత్తర తెలంగాణలోని పంటలు ఇప్పటికే ఎండిపోయాయి. రాష్ట్రంలో క్రమంగా కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. గతంలో నల్గొండ, కరీంనగర్ జిల్లాలతో పాటు జనగాం, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లో కరువు పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈ రబీ సీజన్‌లో రైతులు బోరుబావులు తవ్వి, ట్యాంకర్లతో తమ పంటలను కాపాడుకునేవారు. అలాంటి దారుణమైన రోజులు తిరిగి వచ్చాయి. రైతులను కరువు వైపు నెట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని బిఆర్‌ఎస్ అధినేత, ప్రతిపక్షనేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఆరోపిస్తున్నప్పటికీ, 2023 డిసెంబర్ మొదటి వారం వరకు అధికారంలో ఉంది ఎవరు? కాబట్టి, రైతులు ఎదుర్కొంటున్న కష్టాలకు, సాగునీటి ఎద్దడికి, కారువు పరిస్థితులకు కారణం ఎవరు? అంటూ నీటిపారుదల శాఖ మంత్రి ఉతమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్న వాదనలో నిజం ఉంది. ఈ సంవత్సరం నీటి మట్టం దిగువకు చేరుకున్న నాగార్జున సాగర్ నుండి పొరుగు రాష్ట్రాలకు నీటిని తీసుకోవడానికి అనుమతించినందున ప్రస్తుత పరిస్థితికి బిఆర్‌ఎస్ బాధ్యత వహించక తప్పదు. ఇలావుంటే, నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రస్తుత సంక్షోభానికి మరో ప్రధాన కారణం వ్యవసాయ శాఖ ప్రణాళికా లోపం. నీటి వసతి ఉండదని కొన్ని జిల్లాల్లోని రైతులకు ముందస్తుగా సమాచారం అందించడంలో అధికారులు విఫలమయ్యారు. వరి నాట్లు వేయవద్దని వారికి సలహా ఇచ్చి ఉండాల్సింది. అయితే రబీ సీజన్ మొదటి రెండు నెలల్లో అధికార యంత్రాంగం, రాజకీయ పార్టీలు అసెంబ్లీ ఎన్నికలతో బిజీగా ఉండడంతో రాబోయే ప్రమాదంపై దృష్టి సారించలేదు. ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం ఇతర అంశాలకు ప్రాధాన్యమిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వరిసాగు ప్రక్రియను ప్రారంభించే ముందు రైతులు భూగర్భ జలాలు ఉన్నాయా? లేదా? అన్నది ముందుగా తెలుసుకోవాలి. ఈ విషయంలో అధికారులే రైతులకు అవగాహన కల్పించాలి. ఇక, ప్రస్తుత పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకునే ఉద్దేశంతో కెసిఆర్ ఇటీవల నల్గొండ, జనగాం జిల్లాల్లో పర్యటించారు. ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఆ మరుసటి రోజే నాగార్జున సాగర్ నుంచి తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం కొద్దిపాటి నీటిని విడుదల చేసింది. కెసిఆర్ కరీంనగర్ పర్యటనకు ముందు, పంటలను కాపాడటానికి ప్రభుత్వం గాయత్రి పంప్ హౌస్ నుండి నీటిని విడుదల చేసింది. మల్లన్నసాగర్ నుంచి కుడవెల్లికి 24 గంటల్లో నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని మాజీ నీటిపారుదల శాఖ మంత్రి డిమాండ్ చేయగా, దాదాపు 15 వేల ఎకరాల్లో నిలిచిన పంటలకు చివరి నీరందించేందుకు కొన్ని గంటల్లోనే ప్రభుత్వం 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేసింది. మొత్తం మీద రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రైతుల్లో ఎంతోకొంత ఆశలు కలిగిస్తున్నాయి. కాగా, ఈ ఏడాది వర్షాలు బాగానే కురిశాయి. కానీ వర్షపు రోజులు 120 రోజులు విస్తరించి ఉండవలసి ఉంది. ఆకాశం మేఘావృతం కారణంగా 25 నుండి 30 రోజులకు ఈ కాలాన్ని తగ్గించారు.



అతి కొద్ది కాలంలో భారీ వర్షాలు కురవడం వల్ల రైతులకు ప్రయోజనం ఉండదు. ఆతర్వాత ఏర్పడే వర్షాభావ పరిస్థితులను వారు ఎదుర్కోక తప్పదు. తెలంగాణ వ్యాప్తంగా నేడు లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. దాదాపు 40 ఏళ్ల తర్వాత కృష్ణా నదికి ఇన్ ఫ్లో చాలా తక్కువగా వచ్చింది. మేడిగడ్డ పైర్లు మునిగిపోవడంతో గోదావరి నీటిని తరలించలేకపోయారు. గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకూ గోదావరి నుంచి 2,822.512 టిఎంసిలు, కృష్ణా నుంచి 62.608 టిఎంసిలు చొప్పున నీరు వృథాగా సముద్రంలోకి వెళ్లాయి. ఇవన్నీ కరువు పరిస్థితులకు దోహదం చేస్తున్న అంశాలే. కాబట్టి అధికార, ప్రతిపక్షాలు పరస్పర ఆరోపణలను, విమర్శలను మానుకొని, రైతులకు మేలు చేకూర్చే చర్యలకు ఉపక్రమించడం తక్షణావసరం.

చంద్రం

## మొక్కలూ బాధతో అరుస్తాయి!

తీవ్రమైన బాధ కలిగినప్పుడు ప్రతి ప్రాణీ బాధతో అరవడం సహజం. మొక్కల్లో ప్రాణం ఉంటుందని జగదీశ్ చంద్రబోస్ నిరుపించిన తర్వాత, వాటి మనుగడపై పరిశోధనలు విస్తృతమయ్యాయి. కాగా, తాజా పరిశోధనల్లో, మొక్కలను వేళ్లతో సహా పెకలించినప్పుడు అవి అరుస్తాయని శాస్త్రవేత్తలు గుర్తించారి. మొదటిసారి ఆ ధ్వనిని రికార్డు చేశారు. శబ్దం అనేది కేవలం మనుషులు చేసేది మాత్రమే కాదు. ప్రకృతిలో వివిధ రకాలైన ధ్వనులు వినిపిస్తాయి. అయితే, ఏదైనా మానసిక లేదా శారీరక బాధకు గురైనప్పుడు జీవులు చేసే శబ్దాలనే అరుపులు అంటాం. ఈ తత్వం మొక్కల్లోనూ ఉందని ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు కనుగొన్నారు. వారి తాజా అధ్యయనం ప్రకారం, మొక్కలు తమ బాధలను తమ చుట్టూ ఉన్న ప్రపంచానికి తెలియజేయడానికి, బాధతో అరచినట్టు శబ్దాలు చేస్తాయి. నిజానికి నిశ్శబ్ద క్షేత్రంలోనూ శబ్దాలు ఉంటాయి. కానీ, మన చెవులకు అవి వినిపించవు. ఇలాంటి శబ్దాలను కొన్ని జంతువులు వినగలవని ఇప్పటికే శాస్త్రవేత్తలు రుజువు చేశారు. మొక్కలు అన్ని సమయాలలో కీటకాలు, ఇతర జంతువులతో సంకర్షణ చెందుతాయి. ఈ జీవులలో చాలావరకు కమ్యూనికేషన్ కోసం ధ్వనిని ఉపయోగిస్తాయి. కాగా, మొక్కలు ఒత్తిడిలో ఉన్న సమయాల్లో, అవి కొన్ని నాటకీయ మార్పులకు లోనవుతాయి. వాటిలో ఒకటి కొన్ని శక్తివంతమైన వాసనలు వెదజల్లుతాయి. కొన్ని రకాల మొక్కలను రంగును మార్చుకుంటాయి. మరికొన్నిటి ఆకారం రూపాంతరం చెందుతుంది. అదే విధంగా కొన్ని మొక్కలు శబ్దాలు కూడా చేస్తాయి. ఒత్తిడి లేని మొక్కలు మొక్కలు ఒక రకంగానూ, కాండం కత్తిరించినప్పుడు మరో రకంగానూ, వేళ్లతోసహా పెకలించినప్పుడు మరో రకంగానూ అవి శబ్దాలు చేస్తాయి. ఈ తేడాను టెల్‌అవీవ్ శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే, మొక్కలు శబ్దాలను ఎలా ఉత్పత్తి చేస్తాయి అనేది ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఏదిఏమైనా మొక్కలు కూడా బాధను వ్యక్తం చేస్తూ అరుస్తాయన్న వార్త ఇప్పుడు అందరినీ విస్మయానికి గురి చేస్తున్నది.



## అర్యుల వలస సిద్ధాంతంపై గందరగోళం

కొన్ని శతాబ్దాల పాటు జరిగిన ఎన్నో పరిశోధనలు... చర్చలు.. వాదోపవాదాల తర్వాత స్థిరపరచుకున్న ఆర్యుల వలస సిద్ధాంతం ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) 12వ తరగతి పాఠ్యపుస్తకాల్లో 'ఆర్యన్ ఇమ్మిగ్రేషన్' సిద్ధాంతాన్ని తప్పుపట్టే పాఠ్యాంశాలు ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి, ముఖ్యంగా మధ్య ఆసియా నుంచి ఆర్యులు భారతదేశంలోకి వలస వచ్చారని, ప్రస్తుత భారతీయుల మూలాలు హరప్పా నాగరికతలో ఉన్నాయని పేర్కొంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయని సమాచారం. కొత్త విద్యా సంవత్సరం (2024–25) 7, 8, 10, 11, 12 తరగతులకు సంబంధించిన చరిత్ర, సామాజిక శాస్త్ర పాఠ్యపుస్తకాల్లో భారీ మార్పులు జరిగాయి. వీటిలో అత్యంత ముఖ్యమైనవి 12వ తరగతి పాఠ్యపుస్తకంలోని 'హరప్పా నాగరికత' అనే అధ్యాయంలో కనిపిస్తాయి. భారతీయులకు 5,000 సంవత్సరాల నాటి 'అవిచ్ఛిన్నమైన' చరిత్ర ఉందని, హరప్పా నాగరికత వీరికి సంబంధించిందేనని ఈ అధ్యాయంలో ఉంది. రాఖిగర్హీలో ఇటీవల నిర్వహించిన పురాతత్వ పరిశోధన తవ్వకాల్లో లభించిన ఆధారాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తాయని ఆ పాఠం సారాంశం. హరప్పా నుంచి ఎంతో మంది మధ్య ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని వివిధ దేశాలకు వలస వెళ్లారని ఎన్‌సిఇఆర్‌టి కొత్త సిలబస్‌లో పాఠాలు ఉన్నాయి. హరప్పన్లు వైదిక ప్రజలనీ, వారే భారతీయుల పూర్వీకులనీ చరిత్రతోపాటు, సైన్స్‌లోని పాఠాల్లోనూ కొత్త సిద్ధాంతాన్ని చేర్చారు. హరప్పా నాగరికతలో తొలి నాళ్లకు, ఆతర్వాతి కాలానికి మధ్య ఉన్న తేడాలను వివరించిన మునుపటి పుస్తకాల్లోని వాస్తవాలను కొత్త పుస్తకాల నుంచి తొలగించారు. బిర్సా ముండా మిషనరీలను, హిందూ భూస్వాములను వ్యతిరేకించాడని 6వ తరగతి చరిత్ర పుస్తకంలో పేర్కొన్నారు.



అయితే, 'హిందూ' ప్రస్తావనను మాత్రం తొలగించారు. శివ భక్తులైన నయనార్లపై 7వ తరగతి పాఠపుస్తకంలో కుల నేపథ్యాల ప్రస్తావనను 'సామాజిక నేపథ్యాలు'గా మార్చారు. ప్లస్ టూ సామాజిక శాస్త్రంలో ఆదివాసీ పోరాటాలపై ఒక అధ్యాయం ఉంది. అయితే, ఎస్‌టిలు, ఎస్‌సిలను అప్పట్లో శక్తిహీనులుగానూ, సామాజిక కళంకులుగానూ పరిగణించేవారన్న వాదనను కూడా పాఠం నుంచి తొలగించాలి. అదే తరగతికి చెందిన ఒక పుస్తకంలో మతపరమైన అల్లర్ల చిత్రాన్ని 'ప్రస్తుత కాలానికి చెందినది కాదు' అనే కారణం చూపిస్తూ తీసేశారు. మొత్తం మీద ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల ద్వారా హిందూత్వ ప్రచారాన్ని బిజెపి పెద్దఎత్తున చేస్తున్నదని ప్రతిపక్ష పార్టీలు చేసిన ఆరోపణలు సత్యందూరం కావని ఈ మార్పులు స్పష్టం చేస్తున్నాయి.

## రఘువీర్‌రెడ్డిని మెజారిటీతో గెలిపించాలి



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి : కాంగ్రెస్ పార్టీ నల్గొండ పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి గురువారం మండల కేంద్రంలోని మన కార్యాలయం మనందరి కార్యాలయంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మూడావత్ మంగ్య నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. చెన్నారం, గుమ్మడవెల్లి, కొల్‌ముంతల్‌పహాడ్ ఎంపిటిసిల పరిధిలోని యువజన కాంగ్రెస్ నాయకులతో ఎంపిపి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ యువకులు రాజకీయాల్లో క్రియాశీల పాత్ర వహించాలన్నారు. యువజన కాంగ్రెస్ నాయకులు క్రియాశీలకంగా పనిచేసి రఘువీర్‌రెడ్డి గెలుపుకై కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, ఎంపిటిసిలు జగన్‌నాయక్, రాణిరాజునాయక్, మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్, ఏరుకొండ రాము, బచ్చనబోయిన శ్రీను, పిల్లి కృష్ణ, రమేష్‌నాయక్, సరిత, రామకృష్ణ, భాస్కర్, రమేష్, అనిల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పరిహారం ఇవ్వండి సారూ...



ప్రజాపక్షం/మునగాల: వరిపొలం పూర్తిగా ఎండిపోయిందని తెచ్చిన అప్పులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నానని ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం ఇవ్వాలని చిన్నకారు రైతు నారగాని వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన రైతు నారగాని వెంకన్న గురువారం విలేకరులతో మాట్లాడుతూ నాకున్న నాలుగు ఎకరాల పొలంలో వరిని సాగు చేశాను. ప్రస్తుతం భూగర్భజలాలు పడిపోవడంతో బోర్ల కింద ఉన్న పొలం రెండు ఎకరాలు మాత్రమే నీరు సరిపోతుంది. మిగతా రెండు ఎకరాలు పూర్తిగా ఎండిపోయింది. పదిహేను రోజుల క్రితం సాగర్ ఎడమకాలువకు నీటిని విడుదల చేస్తే మా పంట పొలాలు ఎండిపోకుండా ఉండేవని, తాగునీటి అవసరాల నిమిత్తం అంటూ నీటిని ఖమ్మంకు తరలించడం సరైంది కాదన్నారు. పంట నష్టపోయిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

## నాణ్యమైన వడ్లు తెచ్చి మద్దతు ధర పొందండి

యాదాద్రి భువనగిరి అడిషనల్ డిఆర్‌డిఒ శ్రీనివాస్



ప్రజాపక్షం/మోటకొండూర్ : రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాన్యమైన వడ్లు తెచ్చి మద్దతు ధరను పొందాలని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు డిఆర్‌డిఒ శ్రీనివాస్ తెలిపారు. ఆయన గురువారం మోటకొండూరు మండలంలోని మేడికుంటపల్లి, దిలావర్పుర్, ఇక్కుర్తి, చామపుర్, కొండాపూర్, ఖదిరేనిగుడెం, కటేపల్లి గ్రామాలలో ఐకెపి వరి ధాన్యం కోనుగోలు కేంద్రాలను మండల తహశీల్దార్ శాంతిలాల్, ఎంపిడిఒ ఇందిరలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టి, పట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. రైతులు ప్రైవేట్ వారికి, దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యంను అమ్మి మద్దతు ధర పొందగలరని తెలుపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుజాత, మండల ఎపిఎం జి.సత్యనారాయణ, సిసిలు కె.మల్లేష్, సంతోష, ఆర్ఐ, ఎఇఒలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ మహిళా సంఘం సభ్యులు, విఒఎలు, రైతులు పాల్గొన్నారు.

## జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



ప్రజాపక్షం/డిండి : డిండి మండలంలో గురువారం బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న డిండి మండల జెడ్‌పిటిసి దేవేందర్ రావు, పిఎసిఎస్ చైర్మన్ నాగార్జున రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జంగారెడ్డి,విష్ణు వర్ధన్ రెడ్డి, గోపాల్ రావు,మేకల కాశన్న,సాయమ్మ, వైస్ ఎంపిపి పుల్లమ్మ,సుధాకర్ రెడ్డి, ఓర్సు అంజయ్య,రాములు, నర్సింహా రావు, శ్రీనివాస్ రెడ్డి, సంజీవ, మధు, ఎంపిటిసి తిరుపతి,బుజ్జి, మాజీ సర్పంచ్‌లు లాలు, సత్తయ్య, ఖలీంతో పాటు 2000 బిఆర్ఎస్ కార్యకర్తలకు జానారెడ్డి, బాలు నాయక్ లు కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బిఆర్ఎస్ పార్టీని విడి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాలన, సంక్షేమ పథకాలను చూసి చలించిపోయి మాజీ మంత్రి జానారెడ్డి, దేవరకొండ ఎంఎల్‌ఎ బాలు నాయక్‌ల సమక్షంలో పార్టీలో చేరారు.పార్టీలో చేరినవారు కొత్త, పాత అనే తేడా లేకుండా పార్టీ బలోపేతానికి పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు శంకర్ నాయక్, మాజీ జడ్పి వైస్ చైర్మన్ లింగారెడ్డి, జాల నర్సింహారెడ్డి, వేణుధర్ రెడ్డి,సిరాజ్ ఖాన్,మండల పార్టీ అధ్యక్షులు రాజేష్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## రైతు దీక్ష విజయవంతం చేయండి

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

ప్రజాపక్షం / హుజురాబాద్ : రైతులకు సకాలంలో సాగునీరు అందించకుండా రైతుల జీవితాలతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శనివారం హుజురాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఒక్క రోజు నిరాహార దీక్ష చేపడుతున్నామని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. గురువారం జమ్మికుంటలో మొక్కజొన్న పంటను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతులు సాగునీరు కోసం ఎదురుచూస్తున్నప్పటికి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టే ఉంటుందన్నారు. కేసిఆర్ పాలనలో ఒక్క ఎకరం కూడా తెలంగాణలో ఎండ లేదని, కాంగ్రెస్ పాలన నాలుగు నెలల్లోనే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మరో తడి కోసం వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం ఎన్నిసార్లు ప్రభుత్వాన్ని నిలదీసినప్పటికి పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. రైతులకు మద్దతుగా శనివారం హుజురాబాద్ ప్రధాన చౌరస్తాలో చేపట్టిన ఒక్క రోజు దీక్షను రైతులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# మద్దతుధరకే ధాన్యం కొనుగోలు చేయండి

హమాలీల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోండి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే నిర్వాహకులు, అధికారులు వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని, అంతకంటే తక్కువ ధరకు కొనుగోలు చేయవద్దని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గురువారం మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ది హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ అసోసియేషన్ (హాకా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం క్వింటాలు ధాన్యానికి రూ.2023, సాధారణ రకం ధాన్యానికి రూ.2183 ధర నిర్ణయించిందని తెలిపారు. ఈ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, తద్వారా కనీస మద్దతు ధర పొందాలని పేర్కొన్నారు. రైతులు మధ్యవర్తుల దోపిడీకి గురికాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో హమాలీలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పని చేయాలని తెలిపారు. వడదెబ్బ బారిన పడకుండా ఒఆర్ఎస్ ప్యాకెట్లను వారికి అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. వరి ధాన్యానికి తేమ 17 శాతం వచ్చేలా చూసి కొనుగోలు కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, సివిల్ సప్లై డిఎం రజనీకాంత్, డిసిఎస్‌వో గౌరీశంకర్, తహసీలార్ రాజు, ఎంపిడిఒ నర్సయ్య, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, హాకా ప్రతినిధి లక్ష్మణ్, పలువురు అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా స్వీప్ 2కె రన్

అర్హులైన వారందరూ బాధ్యతగా పార్లమెంటు ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. గురువారం ఉదయం కరీంనగర్ స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2కె రన్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిధిగా హాజరై 2కె రన్‌ను కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వాకర్స్, ఒలంపిక్ సంఘం ప్రతినిధులు, స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 2కె రన్ అంబేద్కర్ స్టేడియం నుంచి భగత్‌నగర్ చౌరస్తా, కలెక్టరేట్, ప్రతిమ మల్టీప్లెక్స్ మీదుగా సర్కస్ గ్రౌండ్ వరకు ఉత్సాహంగా సాగింది. రన్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు వేయడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనాలని పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు 30వేల మంది యువత ఓటు తప్పకుండా ఓటింగ్‌లో పాల్గొనాలని సూచించారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఓటు హక్కు లేని వారు ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఓటు హక్కు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజలంతా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటింగ్‌లో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సర్కస్ గ్రౌండ్‌లో ఓటు హక్కు వినియోగంపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, స్వీప్ నోడల్ అధికారి, మైనింగ్ శాఖ ఏడి రామాచారి, డివైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, మెప్మా పిడి రవీందర్, ఆర్‌డిఒ మహేశ్వర్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి నాగార్జున, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ నతానియల్, ఎన్‌వైకె కో ఆర్డినేటర్ వెంకట రాంబాబు, బిసి డెవలప్‌మెంట్ ఆఫీసర్ అనిల్ ప్రకాశ్, సంక్షేమ అధికారి సరస్వతి, ఒలంపిక్ సంఘం జిల్లా కార్యదర్శి జనార్దన్ రెడ్డి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత అంజనారెడ్డి తదితరులున్నారు.

## రాజకీయాలకు మూగజీవాలను వాడుకోవడం సరికాదు

ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



ప్రజాపక్షం/నందికొండ :నందికొండ మున్సిపాలిటీ పరిధిలో గురువారం నీటి ట్యాంకులో కోతులు పడి మృతి చెందిన విషయం చాలా బాధాకరమని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఈ సంఘటన జరిగిన ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ వేడిమిని తట్టుకోలేక మూగజీవాలు వాటి దాహార్తిని తీర్చుకునేందుకు వాటర్ ట్యాంకు పై ఎక్కాయని ఆ తర్వాత అవి మూత తీసి నీరు తాగటానికి అందులోకి దిగటంతో ప్రమాదవశాత్తు మృత్యువాత పడటం చాలా బాధాకరమైన విషయం అని అన్నారు. ఈ విషయం తెలుసుకునే లోపు ఈ ట్యాంకులోని నీరు కొన్ని ఇళ్లకు మాత్రమే సరఫరా అయ్యాయని అధికారులు జరిగిన ఘటనను వెంటనే తెలుసుకొని నీటి సరఫరాను ఆపివేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఈ వాటర్ ట్యాంకు ద్వారా ఎవరికైతే నీటి సరఫరా జరుగుతుందో వారికి వేరే కొత్త కనెక్షన్లు ఇవ్వడం జరిగిందని వెంటనే ఈ కోతులు మృతి చెంది న వాటర్ ట్యాంకును దమ్మీ చేయడం జరుగుతుందని అన్నారు. మూగజీవాల కోసం ఎండాకాలంలో నీటికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రతి చోటా నీటి తొట్లను ఏర్పాటు చేస్తామన్నారు. కొండగట్టులో మనుషులు చనిపోతే వాటి ఛాయాలకు కూడా పోని కొంతమంది పెద్దలు, ప్రతిపక్ష నాయకులు, ఈరోజు ఇక్కడ కోతులను చూడటానికి హైదరాబాదు నుంచి ఆత్రంగా తరలివస్తున్నారని, ఈ కోతులను కూడా రాజకీయానికి వాడుకోవడం వారికే చెల్లిందని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే భగత్ ఇంటిని ఎన్ఎస్‌పి అధికారులు స్వాధీనం చేసుకోవడం గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు మాట్లాడుతూ. అది ఎమ్మెల్యే భగత్ ఇల్లు కాదని అది కేవలం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ అని మాత్రమే అలాట్మెంట్ ఉందని, అందుకు తగినట్లు ఎన్ఎస్‌పి అధికారులు స్వాధీనం చేసుకున్నారని అన్నారు. అతని సొంత ఖర్చులతో మారమ్మతులు చేయించుకున్నంత మాత్రాన అది అతని ఇల్లు కాదని ప్రగతి భవనాన్ని ముఖ్యమంత్రి తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించుకున్నంత మాత్రాన ఆప్రగతి భవనం ముఖ్యమంత్రి సొంత భవనం ఎలా అవుతుందని అతని పదవి బాధ్యతలు పూర్తయిన తర్వాత దానిని ప్రభుత్వానికి అప్పగిస్తారని ఆ విషయం ఎమ్మెల్యేగా పనిచేసిన భగత్‌కు తెలియదా అని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ఈ నాగేశ్వరరావు, కౌన్సిలర్ ఈర్ల రామకృష్ణ, హాలమహానాడు రాష్ట్ర నాయకులు కోటి కోటేశ్వర రావు, చంద్రశేఖర్ రెడ్డి, శీను పాల్గొన్నారు.

## ప్రజలను... పాలనను గాలికి వదిలేసిన కాంగ్రెస్

మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



ప్రజాపక్షం/నందికొండ : కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను, ప్రజలను పూర్తిగా గాలికి వదిలేసిందని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక హిల్ కాలనీలో బుధవారం కోతులు పడి మృతి చెందిన మంచినీటి ట్యాంకును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోతులు పడి మృతి చెందిన వాటర్ ట్యాంక్ నుంచి సరఫరా అయిన నీటిని తాగిన ప్రజలకు వైద్య పరీక్షలు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కలుషిత వీటిని తాగిన ప్రజలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే దానికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో 2014 ముందు రోజులు పునరావృతమవుతున్నాయని, ఉన్న కొద్ది రోజుల్లోనే ఈ ప్రభుత్వ హయాంలో తాగు,సాగునీరు వ్యవస్థ అధ్వానంగా తయారైందన్నారు. ప్రజల బాగోగులు ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన ప్రభుత్వం ప్రజల పట్ల ఇలాంటి నిర్లక్ష్య ధోరణి కనపరచడం శోచనీయమని అన్నారు. ప్రజలు తాగే మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన అధికారులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే కోతులు వాటర్ ట్యాంకు లో పడి చనిపోయాయని అదికూడా కోతులు చనిపోయిన మూడు రోజుల వరకు ఎవరూ స్పందించటకపోవడం చాలా దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ నోముల భగత్, ఎంఎల్‌సి ఎంసి కోటిరెడ్డి, కౌన్సిలర్ రమేష్ జి పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోండి

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన




ప్రజాపక్షం/నల్లగొండ : ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు లోకసభ ఎన్నికలలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకోవాలని, పోలింగ్ రోజున ఎన్నికల విధులలో ఉంటూ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయలేని వారు మాత్రమే ఈ సౌకర్యం వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన తెలిపారు. లోక సభ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన అత్యవసర సేవలు అందించే శాఖల ఉద్యోగులందరు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గురువారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉన్న ఎఫ్‌సిఐ, ఎస్ఎన్ఎల్, రైల్వే, వైద్య, ఆరోగ్య, ట్రాన్స్‌ఫోర్టు, టిఎస్ఎస్‌పిడిసిఎల్ , పౌర సరఫరాలు, ఎక్సైజ్, పోలీస్, ఫైర్, ఇంటలిజెన్స్, ఐ అండ్ పి ఆర్ శాఖల నోడల్ అధికారులతో పోస్టల్ బ్యాలెట్‌పై సమీక్షించారు. పై శాఖల అధికారులందరు వారి నియంత్రణలో పని చేసే ఉద్యోగులందరికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకునేందుకు వెంటనే ఫారం12 డిని అందజేసి ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పాలని అన్నారు. ఏ ఒక్క ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం గురించి తమకు తెలియదని చెప్పకూడదన్నారు. ఫారం 12 పొందిన ఉద్యోగులందరు వారి ఎన్నికల డ్యూటీ ఆర్డర్, ఓటరు గుర్తింపు కార్డ్ పూర్తి వివరాలతో, మీడియా ప్రతినిధులైతే ఎన్నికల సంఘం జారీ చేసిన అథారిటీ లెటర్ జతచేసి సంబంధిత నోడల్ అధికారికి నిర్దేశించిన సమయంలో సమర్పించి ధ్రువీకరణ పొంది సంబంధిత ఏఆర్‌ఓకు సమర్పించాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ పోస్ట్ ద్వారా వేసే ఓటు కాదని,ప్రత్యేకంగా ఏర్పాటు చేసే ఫసిలిటేషన్ కేంద్రాలకు ఉద్యోగి స్వయంగా వెళ్లి ఓటు వేయాల్సి ఉంటుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకొనే ఉద్యోగుల వివరాలన్ని ఎక్సెల్ షీట్‌లో పొందుపరచాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎవరు నిర్లక్ష్యం వహించవద్దని చెప్పారు.

### రాజకీయ ప్రకటనలకు అనుమతులను ఇవ్వాలి

ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ : లోక సభ ఎన్నికల సందర్భంగా మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) ద్వారా నిర్దేశించిన సమయంలో రాజకీయ ప్రకటనలకు అనుమతులను ఇవ్వాలని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన అన్నారు. అంతేకాక ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు అందించాలని ఆదేశించారు. లోక సభ ఎన్నికల సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసిఎంసి, మీడి యా కేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంసిఎంసి ద్వారా నిర్వహించే పెయిడ్ న్యూస్,రాజకీయ ప్రకటనల ముందస్తు అనుమతి,సోషల్ మీడియా,తదితర అంశాలను సమీక్షించడమే కాకుండా ఇందుకు సంబంధించిన అన్ని ఫైళ్లు,రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు చురుకుగా ఉంటూ ప్రింట్ ,ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే పెయిడ్ న్యూస్, ప్రకటనలు పరిశీలించాలని,అనుమతులు సకాలంలో ఇవ్వాలని సమాచార శాఖ ఏ డి (డిపిఆర్ ఓ) వెంకటేశ్వర్లును ఆదేశించారు. ఈ సందర్భంగా ఏడియు.వెంకటేశ్వర్లు, ఎంసిఎంసి కార్యకలాపాలను జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఎంసిఎంసి, డిపిఆర్‌ఓ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## 9,999 మందితో జనజాతర సభకు వెళ్తా

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వెల్లడి



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: తుక్కుగూడలో ఏప్రిల్ 6న జరిగే జన జాతర సభను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఎ బీర్ల ఐలయ్య పిలుపునిచ్చారు. యాదగిరిగుట్టలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ జన జాతర సభలో జాతీయ మేనిఫెస్టోను తెలుగులో ప్రకటించనునట్లు తెలిపారు. దగాపడ్డ తెలంగాణాలో కాంగ్రెస్ అధికారంలోకి తీసుకురావడానికి తుక్కుగూడ సభలో ఆరు గ్యారంటీలను తెలుగులో ప్రకటించనున్నారని వివరించారు. 5 న్యాయాలు, 25గ్యారంటీలను ప్రకటించే సభకు ఆలేరు నియోజకవర్గంలో 309 బూతుల్లో 9,999 మందితో తుక్కుగూడ సభకు తరలి వెళ్తామని చెప్పారు. దేశంలో యువ న్యాయ, కిసాన్ న్యాయ, నారీ న్యాయ్,శ్రామిక న్యాయ్, ఎస్‌సిదారీ వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని వీటిని తుక్కుగూడ సభలో ఎఐసిసి అధ్యక్షులు ఖర్గే, మాజీ అధ్యక్షులు రాహూల్ గాంధీ ప్రవేశపెడతారని చెప్పారు. బిఆర్ఎస్, బిజెపి మతిభ్రమించి మాట్లాడుతున్నారని అధికారం పోయిన అక్కసుతో కెటిఆర్ మాట్లాడుతున్నాడన్నారు. రాబోయే ఎంపి ఎన్నికల్లో చామల కిరణ్ కుమార్ రెడ్డిని ఆలేరు నియోజకవర్గం నుంచి లక్ష మేజార్టీ ఇస్తామని చెప్పారు.ఆలేరు నియోజకవర్గానికి 4,500 ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వబోతున్నామని వివరించారు. బిఆర్ఎస్, బిజెపిలకు కాలం చెల్లిందని ఒకరు సెంటిమెంట్‌తో మరొకరు మతంతో ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. తొమ్మిదిన్నర సంవత్సరాలు అధికారం ఇస్తే మదం ఎక్కి బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడవద్దు

పురోగతిలో ఉన్న తాగునీటి పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

జిల్లా ప్రత్యేక అధికారిణి అనితా రామచంద్రన్



ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి : జిల్లాలోని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని నల్లగొండ జిల్లా తాగు నీటి సరఫరా ప్రత్యేక అధికారిణి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ ఆదేశించారు. గురువారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్ లో జిల్లాలోని గ్రామీణ పట్టణ, ప్రాంతాలలో త్రాగు నీటి సరఫరాపై మిషన్ భగీరథ, మున్సిపల్, ఇంజనీరింగ్, ఎంపిడిఒ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేసవిలో ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రతి ఇంటికి మిషన్ భగీరథ తాగునీరు వెళ్లాలని ,ఇంజనీరింగ్ అధికారులు,ఎంపిఒ, ఎంపిడిఒలు క్షేత్రస్థాయిలో గ్రామాలలో పర్యటించి తాగునీటి సమస్యలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా తాగినీటి సమస్య ఉత్పన్నమైతే తక్షణమే పరిష్కరించాలని అన్నారు. ముఖ్యంగా అన్ని తాగు నీటి వనరులను శుభ్రం చేయించడంతోపాటు, తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన మాట్లాడుతూ . జిల్లాలో 884 రెవెన్యూ గ్రామాలు, 1744 హాబిటేషన్‌లో తాగునీటిని సరఫరా చేస్తున్నామని ,మూడు లక్షల 78,000 ఇండ్లకు తాగునీటి సరఫరా చేస్తుండగా, పట్టణ ప్రాంతంలో ప్రతిరోజు 68 ఎంఎల్‌డి నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. నల్గొండ పట్టణానికి సంబంధించి ఉదయ సముద్రంలో సరిపోయినంత తాగునీరు ఉందని చెప్పారు.

సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి పూర్ణచందర్, ఆర్ అర్డబ్ల్యుఎస్ ఎస్ ఈ వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఒ నాగిరెడ్డి, డిపిఒ మురళి, జెడ్‌పి సిఇఒ ప్రేమ్ కరణ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడిఒలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఉపాధి హామీ పనుల కింద కూలీలకు కనీస వేతనం 300 రూపాయలు వచ్చే విధంగా చూడాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ అనిత రామచంద్రన్ అన్నారు.

### పటిష్ట చర్యలు చేపట్టాలి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: వేసవి కాలంలో జిల్లాలోని ప్రతి చివరి గ్రామానికి తాగునీరు చేరేలా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అని తా రామచంద్రన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశ మందిరిలో జిల్లా కలెక్టర్ ఎస్‌వెంకట్రావ్ అధ్యక్షతన తాగునీటిపై సమీ క్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక పక్క వర్షాభావ పరిస్థితు లు, మరొక పక్క ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్నందున జిల్లాలోని మున్సిపాలిటిలు, గ్రామాల్లో తాగునీటి ఎద్ద డి లేకుండా వేసవి యాక్షన్ ప్లాన్‌ను పటిష్టంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో నీటి ల భ్యత, నిల్వలు, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకోని ముందుకెళ్లాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి ఎద్దటి నివారణకు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూరల్ ప్రాంతాల్లో ఎస్‌డిఎఫ్ కింద రూ. 363.5 లక్షలతో చేపట్టిన 184 పనులలో 151 పూర్తి కాగా మిగిలిన 33 పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు.

## వడదెబ్బపై అధికారులు అప్రమత్తం

కలెక్టర్ హనుమంతు కె.జండగే



ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్: జిల్లాలో ప్రజలు వడదెబ్బ తగలకుండా సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాల ని కలెక్టర్ హనుమంతు కె.జండగే అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై.పాపారావు అధ్యక్షతన వడదెబ్బ నివారణ కొరకు జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది వేసవి తీవ్ర ప్రభావం చూపుతుందని, దీనివల్ల ఎండలో పని చేసేవారు వడ దెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఖనిజ లవణాలు విసర్జించడంతో డిహైడ్రేషన్‌కు గురై వడదెబ్బ తగిలే అవకాశం ఉందని నివారించడానికి అన్ని శాఖలు సమన్వయంతో ప్రణాళికలు తయారు చేసుకుని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ కె. గంగాధర్ మాట్లాడుతూ ప్రజలు ఎక్కువ సమయం ఎండలో గడప రాదని, వ్యవసాయ పనులు ఉదయం 12 గంటలకు లోపు చేసుకోవాలన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. వై. పాపారావు మాట్లాడుతూ ప్రజలు ఎండలో తిరగడం వలన వడ దెబ్బ తగిలే అవకాశం ఎక్కువ ఉంది అన్నారు. అనంతరం 108కి ఫోన్ చేసి సమీప ప్రభుత్వాసుపత్రికి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. యం. సుమన్ కళ్యాణ్, డా. వంశీ క్రిష్ణ, నోడల్ ఆఫీసర్ డా. అశ్విని కుమార్ జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోలింగ్ అధికారుల పాత్ర కీలకం

## మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి** : ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం మెదక్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిఓ, ఏపిఓ ప్రిసైడింగ్ (పి.ఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ (ఏపిఓ)లకు ఏర్పాటు చేసిన ఎన్నికల శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించి కొనసాగుతున్న శిక్షణ విధానాన్ని పరిశీలించారు. ఎన్నికలు నిర్వహణలో అవలంభించాల్సిన విధివిధానాలు, పోస్టల్ బ్యాలెట్ వినియోగం తదితర అంశాలపై కలెక్టర్ రాహుల్ రాజ్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ అధికారులకు ముఖ్యంగా ఈవీఎం యంత్రాలపై సంపూ ర్ణ అవగాహన కలిగి ఉండాలని, మాక్ పోల్ నిర్వహణ, ఈవిఎం యంత్రాల పని తీరు, బాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్ల కనెక్షన్లు, వాటి పని తీరు, మరమ్మత్తు జరిగితే తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. మొదటి విడత శిక్షణ లో భాగంగా 488 మంది పిఓలు, ఏపిఓలు శిక్షణ పొందినట్లు అధికారులు వెల్లడిస్తు రెండో విడత శిక్షణ ఈనెల 06 తేదీన శిక్షణ కొనగనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు ఎన్నికల అధికారి జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటేశ్వర్లు,స్వీప్ నోడల్ అధికారి రాజిరెడ్డి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆర్డీవో తూప్రాన్ జయచంద్రారెడ్డి, తహసీల్దార్లు మెదక్ శ్రీనివాస్, పాపన్నపేట లక్ష్మణ్ బాబు, హవేలీ ఘనపూర్ నారాయణ, రామాయంపేట రజని, ట్రైనర్స్ పాల్గొన్నారు.




## ఎన్నికల ప్రక్రియలో సెక్టర్ అధికారుల పాత్ర కీలకం: మనుచౌదరి

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి** : ఎన్నికల ప్రక్రియలో సెక్టర్ అధికారుల పాత్ర కీలకమైందని జిల్లా ఎన్నికల అధికారి మనుచౌదరి అన్నారు. లోకసభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల విధులు నిర్వహించే సెక్టర్ అధికారులకు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లలో రూట్ మ్యాప్ తయారు చేసుకోవాలన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ స్టేషన్లలో అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఓటింగ్ ప్రక్రియ చేపట్టెటప్పుడు అయా బిఎల్ఓల సహాయం తీసుకోవాలన్నారు. ఇవిఎం మిషన్లో డిస్ట్రిబ్యూషన్ నుండి పోలింగ్ ప్రకియ ముగిసి కౌంటింగ్ కేంద్రాల్లో స్ట్రాంగ్ రూంలో భద్రపరిచే వరకు మీదే బాధ్యత అన్నారు. పోలింగ్ డే రోజు మాక్‌పోల్ ప్రక్రియ, ఈవిఎం మిషన్లు మొరాయిస్తే అతి త్వరగా మార్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈసిఐ గైడెన్స్ ఉన్న అంశాలను జాగ్రత్తగా చదివి వాటి ప్రకారం పోలింగ్ ప్రక్రియ నడిచేవిదంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీఓ బన్సిలాల్, డిపిఓ దేవకి పాల్గొన్నారు.




# స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోండి

## జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి** : పోలింగ్ కేంద్రంలో ఓటరు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకునేట్లు చూడాల్సిన బాధ్యత ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేశ్ మిశ్రా తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని మాంటిసోరి ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పార్లమెంటు ఎన్నికలు నిర్వహణలో పిఓ, ఎపిఓ విధులు నిర్వహించు సిబ్బందికి నిర్వహిస్తున్న ఒకరోజు శిక్షణ తరగతులను పరిశీలించి ఎన్నికలు నిర్వహణలో అవలంబించాల్సిన విధివిధానాలు, పోస్టల్ బ్యాలెట్ వినియోగం తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై పిఓ, ఏపీవోలు పూర్తిస్థాయిలో అవగాహన కలగి ఉండాలని అన్నారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో భారత ఎన్నికల సంఘం నిబంధనలు ప్రకారం ఎలాంటి ఉల్లంఘనలు లేకుండా ఖచ్చితంగా మార్గదర్శకాలను పాటించాలన్నారు. ఈవిఎం, వివిపాట్ వినియోగంపై పిఓలు, ఎపివోలు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని, నిర్లక్ష్యం వల్ల ఏ చిన్న పొరపాటు జరిగినా ఎన్నికల నిబంధనలు మేరకు తీవ్రమైన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. శిక్షణ తరగతులను తేలికగా తీసుకోవద్దని ఒక వేళ ఇంతకుముందు ఎన్నికల్లో పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ ఎన్నికల కమిషన్ నుండి ఎప్పటి కపుడు వస్తున్న నూతన నియమాలను తెలుసుకోవడానికి ఈ శిక్షణా కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు 560 మంది శిక్షణా కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉండగా 22 మంది గైర్హాజరయ్యారని వారందరికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని తెలిపారు. ఈ రోజు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన సిబ్బంది 6వ తేదీన నిర్వహించే శిక్షణకు తప్పక హాజరు కావాలని, 6వ తేదీన నిర్వహించు శిక్షణకు గైర్హాజరైన సిబ్బందిపై ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సిబ్బంది మేనేజ్మెంట్ నోడల్ అధికారులు శామ్యూల్, అవినాష్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి నారాయణరావు, బిసి సంక్షేమ అధికారి శైలజ, ఆర్డిఓ మంగిలాల్ పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే సహించేది లేదు : సుధాకర్



**ప్రజాపక్షం/తొర్రూరు** : రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే సహించేది లేదని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ అన్నారు. మాలమహానాడు ఆధ్వర్యంలో చేపడుతున్న రాజ్యాంగ రక్షణ యాత్ర గురువారం తొర్రూరుకు చేరుకున్న సందర్భంగా తొర్రూరు డివిజన్ మాల మహానాడు నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈసందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ రక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మాల మహానాడు జాతీయ అధ్యక్షులు అద్దంకి దయాకర్ నేతృత్వంలో ఈయాత్రను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశంలో 400 ఎంపి స్థానాలు గెలిపిస్తే రాజ్యాంగాన్ని మార్చుతామన్న పాలకులకు బుద్ధి చెప్పి మన రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని, దీనికి బహుజన దళిత గిరిజనులందరూ ఏకం కావాలన్నారు. దేశంలో ఫాసిస్టు విధానాన్ని వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదే స్ఫూర్తితో పాలకులకు బుద్ధి చెప్పాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘం జాతీయ కార్యదర్శి ఆశాధ భాస్కర్, మన్నె బాబు, నాయకులు చిట్టిమల్ల సమ్మయ్య, గుర్రాల లింగయ్య, చిట్టిమల్ల మహేష్, గొడిశాల నవీన్, అనపర్తి నాగేష్, గార అనిల్, కొప్పుల శ్రీనివాస్, అంజయ్య, మల్లేష్, ప్రవీన్, రాకేష్, ధర్మయ్య, రవి, ప్రశాంత్ పాల్గొన్నారు.

# ఎస్‌బి పరిశ్రమలో మరో కార్మికుడి శవం లభ్యం

## చుట్టుపక్కల గ్రామస్తులు భయాందోళనకు గురి



**ప్రజాపక్షం/హత్నూర** : హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులోని ఎస్‌బి ఆర్గానిక్ పరిశ్రమలో ఆయిల్ బాయిలర్ రియాక్టర్ పేలి భారీ అగ్ని ప్రమాదం సంభవించి బీభత్సం సృష్టించింది. గురువారం మరో మృతదేహం లభించింది. మృతిచెందిన వ్యక్తి కొన్యాల గ్రామానికి చెందిన వడ్డేపల్లి రమేష్ గా గుర్తించినట్లు సమాచారం. రియాక్టర్ పేలడంతో భారీ విస్ఫోటం దాటికి పలు గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. కూత వేటు దూరంలో ఉన్న బోర్పట్ల గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల భవనం తలుపులు, అద్దాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. కుటుంబ సభ్యులు పరిశ్రమ ముందు బైఠాయించి దుక్క శోకాలతో ఆవేదన చెందారు. రోధించిన కుటుంబ సభ్యులను కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్యం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాజయ్యలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల ప్రాణాలు బలిగొన్న పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పాతకాలపు రియాక్టర్ లతో పనిచేస్తున్న పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యానికి కార్మికుల ప్రాణాలు బలి అవుతున్నాయని, పరిశ్రమ సంబంధిత అధికారులు పలుమార్లు పరిశ్రమలలో ప్రమాదాలు జరిగిన అధికారులు పట్టించుకోక పోవడంపై మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం,పరిశ్రమ యాజమాన్యం మృతి చెందిన కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని, గాయాల పాలైన క్షతగాత్రులకు 50 లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ పిసిసి రాష్ట్ర నాయకులు నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ జరిగిన సంఘటనపై ద్రిగ్భాంది చెందారు. జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి విధంగా చూస్తానని మృతి చెందిన కుటుంబాలకు తగు న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. గాయాలు పాలైన కార్మికులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పూర్తి సహాయ సహకారాలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు. డి.ఎస్.పి రవీందర్ రెడ్డి, సిఐ సుధీర్ కుమార్, ఎస్సైలు సుభాష్ మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అగ్నిమాపక సిబ్బంది పరిశ్రమలో చిలరేగుతున్న మంటలను అదుపులోకి తీసుకొని చర్యలు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు.

# విద్యతోనే చక్కటి భవిష్యత్ : కలెక్టర్



**ప్రజాపక్షం/గజ్వేల్ :** పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని గజ్వేల్ పట్టణంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా తరగతులను నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ లో తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రూప్1, 2, 3, 4 తదితర పోటీ పరీక్షలకు మూడు నెలల ఫౌండేషన్ కోర్సుల ఉచిత శిక్షణ శిబిరాన్ని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కవితతో కలిసి కలెక్టర్ మను చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పోటీ పరీక్షలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా విద్యతోనే చక్కటి భవిష్యత్తు ఉంటుందని పేర్కొంటూ విజయ శిఖరాలకు చేరుకొని సమాజంలో మంచి గుర్తింపు పొందాలని తెలిపారు. ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఉమ్మడి జిల్లాలో 150 మందికి పైగా వివిధ విభాగాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు పొందినట్లు చెప్పారు. శిక్షణ తీసుకునే అభ్యర్థులు రోజు వారిగా ఒకే సబ్జెక్ట్ కాకుండా సెషన్ వైజ్ సబ్జెక్ట్ తరగతులు నడిచేలా చూడాలని, స్టడి మెటీరియల్ ముందుగానే ఇస్తే చదువుకోడానికి వీలు ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో కలెక్టర్ మను చౌదరి సానుకూలంగా స్పందించడంతో పాటు తన యొక్క సివిల్స్ పరీక్షల అనుభవాలు గుర్తుకు తెచ్చుకుంటూ పలు సూచనలు చేశారు. పోటి పరీక్షలు అత్యంత ముఖ్యమని, సెలబస్, సెలక్టెడ్ పుస్తకాలు తప్పని సరిగా భావించాలని అన్నారు. పరీక్షలు సులభంగా ఉండాలని అనుకోకూడదని, ఎంత కఠిన పరీక్షనైనా రాయగలిగేలా ప్రిపేర్ కావాలని పేర్కొన్నారు.

# పెట్రోల్ బంక్ కార్మికులకు కనీస వేతనచట్టం అమలు చేయాలి



**ప్రజాపక్షం/భూపాలపల్లి టౌన్** : జిల్లావ్యాప్తంగా పెట్రోల్ బంకులలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని పెట్రోల్ బంకు యూనియన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆధ్వర్యంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ (ఏఎల్ఓ) ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఆకు దారి రమేష్ మాట్లాడుతూ కార్మిక శాఖ కనీస వేతనాల సవరణ కోసం, 2024 జనవరి 29న పిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేసిందని, మరుసటి రోజు జనవరి 30న గెజిట్ ముద్రించి అందులో జీవో నెంబర్ ఆర్టి నంబర్ 53, జనవరి 29 నందు పేర్కొన్న కనీస వేతనాలను సవరించాలని విజ్ఞప్తి చేశారు. 1948 కనీస వేతనాల చట్టం ప్రకారం వేతనాలు పెరిగిన ధరల కనుగుణంగా నిర్ణయించలేదని, కార్మికులు యొక్క కుటుంబాలు మూడు వినియోగ యూనిట్స్ కు అయ్యే ఖర్చులకు ఏమాత్రం సరిపోవుట లేదన్నారు. 15 ఐఎలసి తీర్మానం ఆక్వాయిడ్ ఫార్ములా 1992 సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా లెక్కించాలని, కావున పెరిగిన ధరల ఆధారంగా కనీస మూల వేతనం పంపు అటెండర్, డిజిల్ ఫిల్టర్, వాచ్మెన్, హెల్పర్, క్లీనర్, సెక్యూరిటీ, సేల్స్ మెన్, సర్వీసింగ్ మెన్, కంప్యూటర్ ఆపరేటర్, అకౌంటెంట్, ఫోర్ మెన్, మేనేజర్లు వేతనాలు సవరించి వీడిఏ రేట్లు కూడా పెరిగిన వేతనానికి, 1768 వీడిఏ పాయింట్లతో భాగించి ఎంత వస్తుందో వేతనాన్ని నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తీగల రవి, పందుల అశోక్, అజ్మీరా రాజేందర్ పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్‌లకు రేపటితో గడువు పూర్తి




**ప్రజాపక్షం/హన్మకొండ** : లోకసభ ఎన్నికల నేపథ్యంలో అత్యవసర సేవల విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు వారి జాబితాను నోడల్ అధికారుల ద్వారా ఈ నెల ఆరవ తేది వరకు కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో లోకసభ ఎన్నికల నేపథ్యంలో అత్యవసర సేవల విభాగంలో పని చేసే వారికి పోస్టల్ బ్యాలెట్ అంశంపై పలు శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ అత్యవసర సేవల్లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకునేలా ఆయా శాఖల అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ నెల 6వ తేది వరకు అందే దరఖాస్తులను ఆన్‌లైన్ చేయనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ, ఎన్పీడీసీఎల్, వైద్య ఆరోగ్యశాఖ, సివిల్ సప్లయి, బీఎస్ఎన్ఎల్, అగ్నిమాపక, సమాచార, పౌర సంబంధాల శాఖ, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, ఎఫ్‌సీఐ, రైల్వే శాఖల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ వై.వి.గణేశ్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్ సురేశ్‌బాబు, ఆర్టీసీ డీఎం ధరమ్‌సింగ్, ఎంవీఐ రమేశ్‌రాథోడ్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్‌మోహన్‌రావు, కలెక్టరేట్ ఏఓ సత్యనారాయణ, పోలీస్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దళారులను విక్రయించొద్దు

**ప్రజాపక్షం/తొర్రూరు రూరల్ :** రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎం సంజీవరావు అన్నారు. గురువారం మండలంలోని ఫత్తేపురం గ్రామంలో ఐకెపి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని మధ్య దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఐకెపి కొనుగోలు కేంద్రాలలోనే విక్రయిస్తే రైతులకు గిట్టుబాటు ధర వస్తుందన్నారు. ఎ గ్రేడ్ ధాన్యానికి రూ. 2203, సాధారణ రకానికి రూ. 2183 చొప్పున నేరుగా రైతుల ఖాతాలలోకి జమ చేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి సుధాకర్, ఎఈఒ భరత్ చంద్ర, సీసీ పద్మావతి, సీఎలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# 'ఫోన్ ట్యాపర్' పల్లాను బర్తరఫ్ చేయాలి

## డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆరోపణ



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి** : తన ఇంటికి వంద మీటర్ల దూరంలో ఇల్లు కిరాయికి తీసుకొని తన పోన్ ట్యాప్ చేసి దొంగ ఓట్లతో గెలిచిన పల్లాను వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఏ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోన్ ట్యాపింగ్‌లో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుతో పాటు పల్లా రాజేశ్వర్ రెడ్డికి సంబంధం ఉందన్నారు. ఆ అనుభవంతోనే అసెంబ్లీ ఎన్నికల్లో తన ఇంటికి వంద మీటర్ల దూరంలో ఇల్లు కిరాయికి తీసుకొని తాను మాట్లాడే పోన్లను ట్యాఫ్ చేశాడని ఆరోపించారు. తాను మాట్లాడిన వారిని డబ్బులతో కొనుగోలు చేసి అక్రమంగా గెలిచాడన్నారు. పల్లాకు తాను పెట్టిన పేరు దొంగ ఓట్ల ఎంఎల్ఏ అని రెండు మాసాల్లోనూ 24వేల నుండి 30వేల ఓట్లు చేర్పించి అక్రమంగా గెలిచాడన్నారు. ఆయనపై హైకోర్టులో కేసు వేశానని త్వరలోనే విచారణ చేపట్టి ఏడాది లోగా ఇంటికి పంపించడం ఖాయమన్నారు. తనతో పాటు తన కుటుంబీకులు మాట్లాడిన పోన్లకు కూడా ట్యాంప్ చేశాడని ఆరోపించారు. వెంటనే విచారణ చేపట్టి బర్తరఫ్ చేయాలని కోరారు. ఈ నెల 6వ తేదీన తుక్కుగూడ సభకు జనగామ నియోజకవర్గం నుండి 500 వాహనాల్లో 5వేల మందికి తరలి వెళ్తున్నట్లు తెలిపారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

**కాంగ్రెస్‌లో భారీగా చేరికలు** : బిఆర్ఎస్‌కు పలువురు రాజీనామ చేసిన కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇంఛార్జీ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. పెంబర్తి సర్పంచ్ అంబాల అంజనేయులు సుమారు వందమందితో కాంగ్రెస్‌లో చేరారు. తరిగొప్పుల మండలానికి చెందిన మాజీ ఎంపిటిసి, సర్పంచ్ గుండెబోయిన కిష్టయ్య సుమారు 50 మందితో బిఆర్ఎస్‌కు రాజీనామ చేసి కాంగ్రెస్‌లో చేరారు. జనగామ మున్సిపల్ 30వ వార్డు కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి డి కుమార్‌తో పాటు పలువురు బిఆర్ఎస్‌కు రాజీనామ చేసి కాంగ్రెస్‌లో చేరారు. వారికి ప్రతాప్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా స్వాగతం పలికారు.

# అనుమతులు లేని వాటర్ ప్లాంట్లకు జరిమానాలు

## 4 వాటర్ ప్లాంట్లకు రూ. 80 వేల జరిమానా



**ప్రజాపక్షం/హన్మకొండ** : గ్రేటర్ వరంగల్ నగరంలో సుమారు 50 ప్లాంట్లను అందులో భాగంగా 56వ డివిజన్‌లోని గోపాల్‌పూర్ లోని సుమారు 4 వాటర్ ప్లాంట్లను ఆరోగ్యాధికారి రాజేష్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించి నీటి స్వచ్ఛత, ప్రమాణాలు పాటించని ప్లాంట్లు, అనుమతులు లేకుండా వ్యాపారం నిర్వహిస్తు ల్యాబ్ నివేదికలను సక్రమంగా నిర్వహించనందుకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గోకుల్‌నగర్, ఇందిరానగర్, గోపాల్‌పూర్ ప్రాంతాల్లోని 4 వాటర్ ప్లాంట్లను సందర్శించిన నేపథ్యంలో నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లకు కమిషనర్ ఆదేశాల మేరకు రూ. 80 వేల జరిమానా విధించిన నోటీసులు జారీ చేయడం జరిగిందని, నోటీసులు స్వీకరించిన వాటర్ ప్లాంటు నిర్వాహకులు ఏడు రోజుల్లో అనుమతులు పొందాల్సి ఉంటుందని, అనుమతులు పొందని వాటర్ ప్లాంట్లపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టడంతో పాటు ఆ ప్లాంట్లను మూసి వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్లు అనిల్, గోల్కొండ శ్రీను, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

# భేదాభిప్రాయాలు ఉండొద్దు

## పరకాల ఎంఎల్ఏ రేవూరి ప్రకాశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్** : వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు పాత, కొత్త బేదాభిప్రాయాలు లేకుండా గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హనుమకొండ భవాని నగర్‌లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగరవేయాలన్నారు. కార్యకర్తలు, నాయకుల మధ్య సమన్వయం ఉండాలన్నారు. గెలుపే లక్ష్యంగా అన్నిస్థాయిల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ డాక్టర్ కడియం కావ్యను ఓడించేందుకు ఎస్సీల్లో సెంటిమెంట్‌ను రగిలిస్తున్నారన్నారు. కడియం శ్రీహరికి మాదిగలను దూరం చేయాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

# త్వరితగతిన సిఎంఆర్ లక్ష్యాలు

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి** : వానాకాలం 2023/24 సిఎంఆర్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ఆదేశించారు. గురువారం జనగామ మండలంలోని ఓబుల్‌కేశవాపూర్ గ్రామంలోని మహాలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్ ధాన్యమిత్ర రా రైస్ మిల్లును సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లర్లు తమకే కేటాయించిన లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. అదే విధంగా రబీ ధాన్యం నిల్వ చేసేందుకు స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. సిఎంఆర్ బియ్యాన్ని తరలించే విధానాన్ని గన్నీ బ్యాగుల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిసిఎస్ఓ రోజారాణి, డిఎం సిఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కడియం కావ్యకే ఎంఆర్‌పిఎస్ మద్దతు



**ప్రజాపక్షం/హన్మకొండ** : స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా నాయకులు హనుమకొండలోని కడియం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు శుభకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యకు ఎమ్మార్పీఎస్ పూర్తి మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న, గౌరవ అధ్యక్షులు సండ్రపల్లి వెంకన్నలు ప్రకటించారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగల సంపూర్ణ మద్దతు కడియం కావ్యకే ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేదాసి మోహన్, ఉపాధ్యక్షుడు కొమ్మగాని దాసు, అధికార ప్రతినిధి కొమ్ముల బిక్షపతి, వరంగల్ తూర్పు ఇన్‌చార్జ్ వక్కల కుమార్, రాష్ట్ర నాయకులు మిట్టపల్లి కొమురయ్య, జిల్లా నాయకులు కలిమెంట్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కొంగర మహాలక్ష్మి పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు పరిరక్షించండి

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** మండలంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతూ తహసీల్దార్ కృష్ణమోహన్‌కు భూ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. గురువారం కమిటీ అధ్యక్షులు వెంకట్ నర్సింహారెడ్డి, కన్వీనర్ మునీర్‌లతో పాటు సభ్యులు తహసీల్దార్‌ను కలిసి జగదేవ్‌పూర్‌లో రియల్ వ్యాపారులు పాల్పడుతున్న భూకబ్జాలను అపాలని కోరారు. స్థానిక అంబారెడ్డి చెరువు, రెడ్డమైన చెరువు, ధర్మాయకుంట, దేవతల కుంట తదితర చెరువు, కుంటలను ఆక్రమించి సాగు చేస్తున్న వారిపై కటిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. శిఖం భూముల సర్వే నిర్వహించి హెచ్చరిక బోర్డుడలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. అలాగే జగదేవ్‌పూర్ గ్రామంలో ఆక్రమనకు గురైన కట్టు కాలువలు, నలాలను పరిరక్షించాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాల్‌నర్సయ్య, మల్లేశం, కలీమ్,వెంకట్‌రెడ్డి,జహంగీర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# వేలూరులో దొంగల బీభత్సం

**ప్రజాపక్షం/గజ్వేల్ :** వర్గల్ మండలం వేలూరులో బుధవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామానికి చెందిన 8 గృహాల్లో చోరీకి పాల్పడగా, తాళం వేసి ఉన్న ఇండ్లు లక్ష్యంగా వారు దొంగతనానికి పాల్పడ్డారు. సుమారు 27 తులాల బంగారం, 30 తులాల వెండి , రూ.8 లక్షల 62 వేలు దోచుకున్నట్లు బాధితులు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన కుమ్మరి వేణు, చిలుముల నవీన్, గడ్డం లక్ష్మణ్, కటిక పెంటయ్య, కటికే భాగ్యమ్మ, మల్యాల దశరథ, కటిక చంద్రయ్య, కటిక మల్లేశం ఇండ్లలో దొంగతనానికి పాల్పడగా, గురువారం బాధితులు గౌరారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు డాగ్ స్క్వాడ్ రప్పించి విచారణ చేపట్టారు. ఈ సమాచారం తెలుసుకున్న రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రతి కుటుంబానికి రూ 5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. కాగా ఈ సంఘటనలో పేద కుటుంబాలే నష్టపోయినట్లు ప్రతాప్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట తాజా మాజీ సర్పంచ్ పాపిరెడ్డి, పార్టీ నాయకులు మల్లేశం తదితరులు ఉన్నారు.



# జోరుగా ఐపిఎల్ బెట్టింగ్

**ఆన్‌లైన్ ద్వారా ఆర్థిక లావాదేవీలు**

**అప్పుల ఊబిలో కూరుకుపోతున్న బాధితులు**





**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :** ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. బంతికి బంతికి, షాట్ షాట్‌కి బెట్టింగ్ హవా సాగుతోంది. వికెట్ పడితే ఇంత, ఎల్‌బి అయితే ఇంత, ఫోర్ కొట్టిన, బంతిని నేరుగా గ్రౌండ్ అవతలికి పంపిన డబ్బులే డబ్బులు.. ఈ బెట్టింగ్ల పుణ్యమా అని వ్యాపారులతో పాటు యువత, ఉద్యోగస్తులు అప్పులపాలు అవుతున్నారు. జిల్లాలో జోరుగా బెట్టింగులు సాగుతున్నట్లు తెలుస్తుంది. జిల్లాలోని పెంచికల్‌పేట్, కాగజ్ నగర్, దహేగాం, బెజ్జూర్, కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూర్ మండలాలతో పాటు తదితర ప్రాంతాలలో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని సమాచారం. మండలాలతో పాటు పట్టణ, పల్లె ప్రాంతాలలో పలువురు ఉద్యోగులు, వ్యాపారులు, యువకులు బెట్టింగ్ల పేరిట భారీ మొత్తంలో నష్టపోయినట్లు తెలుస్తుంది. క్రికెట్ అంటే నేటి యువతకు ఎంతో మక్కువ ఉంటుంది. సమయం దొరికితే చాలు బ్యాట్ బాల్ పట్టుకొని మైదానాల వెంట పరుగులు తీస్తుంటారు. ఇక దేశవాళి క్రికెట్ పోటీలు జరిగే రోజులు వారికి సందడే సందడి. గతంలో టీవీలకు అతుక్కుని కూర్చున్న యువత ఇప్పుడు సెల్ ఫోన్లు పట్టుకుని ప్రతి బంతిని నిశితంగా చూస్తున్నారు. గత కొంతకాలంగా పల్లెల్లో బెట్టింగ్ల వైపు మొగ్గు చూపుతూ తమ అభిమాన జట్టు విజయం సాధిస్తుందని వేలాది రూపాయలు బెట్టింగ్లు కాస్తున్నారు. ప్రస్తుతం ఐపిఎల్ సీజన్ సాగుతుండడంతో జిల్లాలో బెట్టింగ్ల రాయులు రంగంలో దిగి క్రికెట్ బ్యాట్ మోజు ఉన్న వారిని టార్గెట్ చేసుకొని ఈ జూదంలోకి దింపుతున్నారు. పలు ప్రాంతాల్లో అడ్డాలు తయారు చేసుకుని అక్కడ నుండి ఈ రాకెట్‌ను కొనసాగిస్తున్నారు. దీంతో ప్రతినిత్యం లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి.

**జిల్లాలో బెట్టింగ్ రాయుళ్లపై కేసులు**

జిల్లాలో ఇటీవల నిషేధిత అప్లికేషన్స్ ద్వారా అన్ లైన్ ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న వారిని టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్‌పి సురేష్ కుమార్ ఆదేశాలమేరకు జిల్లాలో ఐపియల్ క్రికెట్ బెట్టింగ్ భారీగా జరుగుతుందని టాస్క్ ఫోర్స్ పోలీసులకు అందిన పక్క సమాచారం మేరకు కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జీడిచేను గ్రామ శివారులో, పెంచికల్ పేట్ మండలంలో ప్రభుత్వ నిషేధిత అప్లికేషన్స్ ద్వారా, ఐపియల్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఐదు గురిని పట్టుకుని కేసులు నమోదు చేసి వారి వద్ద నుండి రూ. 30,000/ నగదు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకునట్లు టాస్క్ ఫోర్స్ సిఐ రాణా ప్రతాప్ తెలిపారు. వివరాల్లోకి వెళ్ళితే పెంచికల్‌పేట్ మండలంలోని ఎలకపల్లి గ్రామానికి చెందిన పోలోజు నరేష్ అనే వ్యక్తి ని పట్టుకొని విచారించగా అతని వద్ద ఉన్న వ్యక్తుల ద్వారా ప్రభుత్వ నిషేదిత అప్లికేషన్స్ ద్వారా ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్‌ని వాట్సాప్ , టెలిగ్రాం తోపాటు వివిధ సోషల్ నెట్వర్కింగ్ సైట్లలో పోస్ట్ చేస్తున్నాడని తేలింది. అతనిని పట్టుకొని విచారించగా అతని వద్ద ఉన్న వారిలో మేడిగొండ లక్ష్మ ణ్ జీడిచేను గ్రామం, భూజడి తిరుపతి పెంచికల్ పేట్, బొడ్డు రాజశేకర్ జీడిచెను, బుసా సుభాష్ జీడీచెను వారు ఉన్నారని తెలిసింది.

**చట్టరీత్య చర్యలు తప్పవు : టాస్క్‌ఫోర్స్ సిఐ రాణా ప్రతాప్**

పేకాట, ఆన్ లైన్ మట్కా, జూదం, ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్ ఫోర్స్ సిఐ రాణా ప్రతాప్ హెచ్చరించారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా లోని వివిధ గ్రామాల్లో, మండలాల్లో పేకాట, ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్, ఆన్ లైన్ జూదం, మట్కా, లాంటివి ఆడి జీవితాలు పాడుచేసుకోవద్దన్నారు. ఐపిఎల్ బెట్టింగ్‌లు చేస్తూ, ఆన్‌లైన్ మాట్కా, జూదం ఆన్ లైన్ గేమ్ లు ఆడుతున్న వారి పై చర్యలు తీసుకుంటామని, ఆడినవారు దొరికితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా యువత ఇలాంటి ఆన్ లైన్ జూదం, క్రికెట్ బెట్టింగ్‌లు ఆడుతూ అత్యాశకు పోయి జీవితాలు పాడుచేసుకోవద్దని, ఆర్థికంగా నష్టం పోతారని, కేసులు నమోదయ్యితే ఉద్యోగ అవకాశాలు, ఇతర అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. పేకాట, ఆన్ లైన్ మట్కా, జూదం, ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారి సమాచారం ఉంటే పోలీసులకు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసి మధు, రమేష్, సంజీవ్ పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని రైస్ మిల్లులపై కఠిన చర్యలు



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** ప్రభుత్వ నిబంధనలు పాటించని రైస్ మిల్లులపై కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.గురువారం సోన్ మండలం గంజాల్ లోని రైస్ మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. మిల్లింగ్ ప్రక్రియను, ధ్యాన్యం నిల్వలు, శుభ్రతను పరిశీలించారు.మిల్లు కెపాసిటీ,లేబర్, రోజువారీ మిల్లింగ్ వంటి అంశాలను అధికారులను అడిగితెలుసుకున్నారు. రైస్ మిల్లర్లు నిబంధనలను తప్పనిసరి పాటించాలని కలెక్టర్ ఆదేశించారు.మిల్లు లలో శుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు.ప్రతి మిల్లును తనిఖీలు నిర్వహించి నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు.నిబంధనలు అతిక్రమిస్తున్న మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,డిఎస్ఓ నందిత,అధికారులు, నిర్వాహకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా ప్రజలు సహకరించాలి

**జిల్లా అదనపు ఎస్‌పి ప్రభాకర్‌రావు**



**ప్రజాపక్షం/ వాంకిడి :** వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అల్లర్లు, వర్గ బేధాలు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని జిల్లా అదనపు ఎస్‌పి ప్రభాకర్ రావు అన్నారు. గురువారం ఉదయం 11గంటలకు వాంకిడి మండలంలోని ఖమాన గ్రామంలో డిఎస్‌పి సదయ్య, వాంకిడి సిఐ శ్రీనివాస్, ఎస్ఐలు సాగర్, రాములు, సిఆర్‌పిఎఫ్ దళాలతో కలసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ భారత ఎలక్షన్ కమిషన్ సూచించిన గైడ్లెన్స్ ప్రకారం ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక దృష్టి పెట్టి నిరంతరం నిఘా ఉంచడం జరుగుతుందన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల వేళ ఎలాంటి అనుమతులు లేకుండా దేవాలయాలు. మసీదు, చర్చిలు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు. కార్యాలయంలో గోడపై ఎన్నికల ప్రచారం చేయరాదని, ఎన్నికల సమయంలో ఆయా పార్టీల నాయకులు ఇచ్చే మద్యం, డబ్బుల ప్రలోభాలకు ప్రజలు గురికావద్దని ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆనంతరం ఖమాన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

## భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి : కటకం ప్రసాద్

**ప్రజాపక్షం/ కాగజ్ నగర్ రూరల్ :** రైతులు భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఆధారంగా ఎరువులు వాడాలని కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ కంపెనీ మార్కెటింగ్ అధికారి కటకం ప్రసాద్ అన్నారు. కాగజ్ నగర్ మండలంలోని ఆరెగూడెం గ్రామంలో గురువారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఆధారంగా ఎరువులు వాడడం వల్ల అధిక లాభాలు పొందవచ్చు అని అన్నారు. రైతులు పంటల సాగులో మెళకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం కాగజ్ నగర్ మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని అన్నారు. గ్రామ రైతులకు భూసార పరీక్ష ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ కంపెనీ అగ్రోనమిస్ట్ ప్రీతం రెడ్డి, మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ట్రైనీ రాజయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో బాలికలను ప్రోత్సహించాలి

**ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి**



**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు.బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ ఆల్ఫోర్స్ పాఠశాలకు చెందిన బిరుదు మనస్విని జిల్లా అదనప కలెక్టర్ జె అరుణశ్రీ , డిఇఓ మాధవిలు జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా అభినందించి న గదు బహుమతిని గురువారం అందజేశారు , ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు విద్యార్థినిలకు వారికి ఇష్టమైన రంగంలో నిష్ణాతులైన శిక్షకులచే ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో రాష్ట్ర జాతీయస్థాయిలో ఆల్ఫోర్స్ విద్యార్థులు రాణిస్తున్నారని తెలిపారు,సుల్తానాబాద్ ఆల్ఫోర్స్ పాఠశాలకు చెందిన బిరుదు మనస్వి చత్తీస్గఢ్ రాష్ట్రంలోని కోర్బాలో జరిగిన అండర్ 14 జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీల్లో పాల్గొని అద్వితీయమైన ప్రతిభను కనబరిచిందని మనస్విని అభినందించారు , ఇక్కడ డివైఎస్ఓ సురేష్ , ప్రిన్సిపల్ ,అధ్యాపక బృందం తదితరులున్నారు.

## పసుపు బోర్డుపై అసత్య ప్రచారం వద్దు

**కాంగ్రెస్ నేతలకు గెజిట్ పత్రం చూపెట్టిన శ్రావణి**

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** ధర్మపురి అరవింద్ ఎన్నికల్లో రాసిచ్చిన బాండ్ పేపర్ ప్రకారం పసుపు బోర్డు తెచ్చారని దీనిపై ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి అసత్యపు ఆరోపణలు చేయకూడదని ఇదిగో గెజిట్ పేపర్ అంటూ బోగ శ్రావణి చూపించారు. మీ కాంగ్రెస్ హయంలో చెరుకు, పసుపు మామిడి రైతులు నష్టపోయారని రైతులను మభ్యపెట్టి మోసం చేయకూడదని పసుపు రైతు కళ్ళలో ఆనందం ఉంటే మీ కళ్లతో ఎందుకు నిప్పులు చేలరేగుతున్నారని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డిని ఉద్దేశించి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి మాట్లాడారు. గురువారం జగిత్యాలలో బిజెపి నాయకులతో కలిసి శ్రావణి మాట్లాడుతూ....అధికారం వచ్చాక మీఇంటి ముందు రోడ్డు వేయించుకున్నారు కానీ జగిత్యాల పట్టణ ప్రధాన యావర్ రోడ్డు సంగతి మర్చిపోయారని గుర్తు చేశారు. తాను చైర్మన్‌గా ఉన్నప్పుడు యావర్ రోడ్డు 100 ఫీట్లకు గెజిట్ తీసుకువచ్చామని 40 ఏండ్ల రాజకీయంలో మీరు ఏం చేశారని ప్రశ్నించారు. బిఆర్ఎస్ హయంలో మోసలి కన్నీరు కార్చిన కాంగ్రెస్ ఇప్పుడు రైతులకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. జీవన్‌రెడ్డి నిజామాబాద్ ఎంపిగా ఓడిపోతే రాష్ట్ర మంత్రి అవుతారని అరవింద్ గెలిస్తే ఆయన కేంద్రమంత్రి అవుతారని నిజామాబాద్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని శ్రావణి జ్యోస్యం చెప్పారు. ఈ సమావేశంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు రంగు గోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, జగిత్యాల పట్టణ మహిళ మోర్చా అధ్యక్షులు దూరిశెట్టి మమత, జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దెల గంగరాజం, పుష్పరెడ్డి, కాసెట్టి తిరుపతి, పురెల్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెరలకు ప్రభుత్వం ఆర్థికసాయం : జీవన్‌రెడ్డి



**ప్రజాపక్షం / జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో అంతర్గాం ఒడ్డెర కాలనీ మాజీ సర్పంచ్ గంగాధర్, ఎల్లయ్య, నర్సయ్య, స్వామి, కాలనీ యువకులతో పాటు గురువారం నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తాటిపర్తి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఒడ్డెర కాలనీలో మౌళిక వసతులు కల్పించి, భవన నిర్మాణ రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఒడ్డెర కులస్తులను ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించడంతో పాటు సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యత కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. నిర్మాణ రంగంలో వసూలు చేస్తున్న సెస్ కార్మికుల సంక్షేమానికి వెచ్చించాలని అన్నారు. శ్రమకు నిర్వచనమైన ఒడ్డెర కులస్తుల హక్కుల రక్షణకు తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. ఒడ్డెర కాలనీలోని పాఠశాలకు ప్రహరీ నిర్మాణంతో పాటు అదనపు గదులు నిర్మాణం చేపడతామని అన్నారు. అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు, చౌకల ధరల దుకాణం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం నుండి రూపాయి సాయం ఆశించకుండా రామాలయం నిర్మాణానికి విరాళాలు సేకరించుకొని నిర్మాణం చేపట్టడం అభినందనీయమని జీవన్ రెడ్డి అన్నారు. ఒడ్డెర కాలనీలోని సిసిరోడ్డు నిర్మాణం కోసం సియం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.లు 20లక్షలు కేటాయించామన్నారు. రామాలయ నిర్మాణానికి సిజిఎఫ్ నిదుల నుండి రూ.50 లక్షలు నిదులు మంజూరు చేస్తామని జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు. అంతర్గాంలోని ఆంజనేయస్వామి ఆలయానికి రూ.ల 1కోటి నిదులు కేటాయించామని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా అండగా నిలిచి, ఎంపిగా గెలిపించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడ జున్ను రాజేందర్, మండల కాంగ్రెస్ నాయకులు, అంతర్గాం ఒడ్డెర కాలనీ నాయకులు, యువకులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ నిబంధనలపై సంపూర్ణ అవగాహన

**సహాయ రిటర్నింగ్ అధికారి బి.గంగయ్య**



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనలపై పోలింగ్ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం పెద్దపల్లి శాసనసభ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి బి.గంగయ్య అన్నారు. గురువారం పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి బి.గంగయ్య మాట్లాడుతూ, మే13న జరిగే పోలింగ్‌ను విజయవంతం చేసేందుకు పోలింగ్ అధికారులు ఎన్నికల కమీషన్ నిబంధనలు, మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గతంలో అనేక మార్లు పోలింగ్ విధులు నిర్వహించినప్పటికీ ప్రతి ఎన్నిక ప్రత్యేకంగా ఉంటుందని, కొత్త నిబంధనలు వస్తుంటాయని, అధికారులు ఎవరూ నిర్లక్ష్యం వహించకుండా పోలింగ్ నిర్వహణ పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పోలింగ్ అధికారులు ఉదయం మాక్ పోలింగ్ నిర్వహించాలని, మాక్ పోలింగ్ ముగిసిన తర్వాత వివిప్యాట్ లో స్లిప్పులను తొలగించాలని, సి.ఆర్.సి తప్పినిసరిగ్గా చేయాలని, పోలింగ్ ముగిసిన తర్వాత కంట్రోల్ యూనిట్లో తప్పనిసరిగా క్లోజ్ బటన్ నొక్కాలని తెలిపారు. పోలింగ్ రోజు ప్రతి రెండు గంటలకు పోలింగ్ కేంద్రంలో నమోదవుతున్న పోలింగ్ శాతం వివరాలను అందజేయాలని, పోలింగ్ ముగిసే సమయంలో సంబంధిత నిబంధనలను పాటిస్తూ అవసరమైన రిపోర్టులు అందజేయాలని పేర్కొన్నారు. పోలింగ్ సమయంలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే సెక్టార్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్ గుర్తింపు కార్డు పరిశీలించి, ఓటరు జాబితాలో ఉన్న అతని వివరాలు చూసుకుని, రిజిస్టర్ లో పేరు నమోదు చేయాలన్నారు.ఈ శిక్షణా కార్యక్రమంలో తహాశీల్దార్ రాజ్ కుమార్, పాఠశాల అకాడమిక్ అధికారి పి.ఎం. షేక్, రెవెన్యూ అధికారులు, పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 26లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ రూరల్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నాన్ సెమిస్టర్ విధానంలో డిగ్రీలో అడ్మిషన్ తీసుకుని డిగ్రీ ఫెయి ల్ అయిన 2015, 2016 బ్యాచ్, అంతకు ముందు సంవత్సరం బ్యాచ్ వి ద్యార్థులు ఈనెల 26 లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ఎస్‌కెఇ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ తూడుర్ దత్తాత్రేయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇయర్ వైస్ (నాన్ సెమిస్టర్) బ్యాక్ లాగ్ సబ్జెక్ట్స్ ఉన్న అభ్యర్థులు ఈ అవకాశం వినియోగించు కోవాలని, ఇతర వివరాలకు సెల్ 9866398678, 9494314314, 7382929651లను సంప్రదించాలని పేర్కొన్నారు.

## వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ తనిఖీ



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఎస్‌పి అఖిల్ మహాజన్ ఆకస్మిక తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలతో పాటు పోలీస్ స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని త్వరితగతిన వాటిని పూర్తి చేయాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి నేరాలు జరుగుతున్నాయనే అంశాలను అడిగి తెలుసుకొని నేరాల నియాత్రణకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతు పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని, బ్లూకోట్స్, పెట్రో కార్ సిబ్బంది 24 గంటలపాటు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ తమ తమ విధులు క్రమశిక్షణతో నిర్వహించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకరవలన్నారు. రాబోయే లోక్ సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా, ఎన్నికల సమయంలో సమస్యలను సృష్టించిన వారిపై పూర్తి నిఘా ఉంచాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని నేరస్తుల, రౌడీ షీటర్ల వివరాలు,స్టేషన్ పరిధిలో గల సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి నాగేంద్రాచరి, సి.ఐ శ్రీనివాస్,ఎస్.ఐ మారుతి, సిబ్బంది పాల్గొన్నారు.

## రానున్న మూడు నెలలకు నీటి సరఫరా అంచనాలు సిద్ధం చేయాలి

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రాబోయే 3 నెలల పాటు హెచ్ ఎండబ్ల్యుఎస్ నీటి సరఫరా అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అంతర్గాం మండలంలోని ముర్మురులో ఉన్న 160 ఎంఎల్‌డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను పూర్తిస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్, నీటి శుద్ధి తీరు, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముర్మురులో ఉన్న హెచ్ ఎండబ్ల్యుఎస్ ఇంటెక్ వెల్‌ను కలెక్టర్ సందర్శించారు. గోదావరి నుంచి నీటి డ్రాయింగ్ పాయింట్ పరిశీలించిన కలెక్టర్, అందుబాటులో ఉన్న నీరు, ప్రతి రోజూ ఎంత సరఫరా చేస్తున్నాం వంటి పలు అంశాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హెచ్ ఎండబ్ల్యుఎస్ ఇంటెక్ వెల్, మూర్మురు 160 ఎం.ఎల్.డి నుంచి హైదరాబాద్ త్రాగునీటి అవసరాలకు, పెద్దపల్లి జిల్లా త్రాగునీటి అవసరాలకు, ఆర్ఎఫ్‌సిఎల్ పరిశ్రమ అవసరాలకు నీటి సరఫరా చేయడం జరుగుతుందని, త్రాగునీటి అవసరాలకు, పారిశ్రామిక అవసరాలకు ఎటువంటి నీటి కొరత రాకుండా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని,నీటిసరఫరా విడుదల ప్రణాళిక రూపకల్పన కోసం రెండు రోజులలో సంయుక్త సమావేశం నిర్వహించడం జరుగుతుందని, సదరు సమావేశానికి రాబోయే మూడు నెలల పాటు నీటి సరఫరా చేయడానికి కావాల్సిన ప్రతిపాదనలు, అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, సంపూర్ణ వివరాలతో హాజరు కావాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎండబ్ల్యుఎస్ డిజిఎం రామకృష్ణ, ముర్మూర్ వాటర్ ప్లాంట్ మేనేజర్ సతీష్, ఎరువుల కర్మాగారం ప్రొడక్షన్ డిజిఎం షా, సీనియర్ మేనేజర్ అమోల్ సోనారే, డిఇ, ఎస్‌వైపి కీర్తి, మిషన్ భగీరథ గ్రిడ్ ఎఇ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## గుండారం రిజర్వాయర్ నుండి సాగునీరు విడుదల



**ప్రజాపక్షం /రామగిరి :** గుండారం రిజర్వాయర్ నుండి మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు డి83 కెనాల్ ద్వారా స్థానిక నాయకులు గేట్లు ఎత్తి గురువారం సాగు నీటిని దిగువకు విడుదల చేశారు. ఎండలతీవ్రత పెరిగి పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆయకట్టు పరిధిలోని చివరి గుంట వరకు పంట పొలాలన్నిటిని కాపాడాలని శ్రీధర్ బాబు సంబంధిత ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో గేట్లు తెరిచి నీళ్లు ఇవ్వడం జరిగినదని వారు పేర్కొన్నారు. సాగు నీరు అందక పొలాలు ఎండిపోతాయని రైతులెవరూ అధైర్యపడవద్దని., సాగు నీటి విషయంలో శ్రీధర్ బాబు ఎప్పటికప్పుడు అధికారులతో చర్చిస్తున్నారని., అవసరమైనప్పుడల్లా నీటి విడుదల కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రామగిరి ఎంపిపి ఆరెల్లి దేవక్క కొమురయ్యాగౌడ్, మంథని మున్సిపల్ చైర్మన్ పెంద్రు రమ, వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, మంథని నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ బర్ల శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణరెడ్డి, మాజీ సర్పంచ్ బుద్ధార్తి బుచ్చన్న, రామగిరి మండల సోషల్ మీడియా ఇన్చార్జి సిద్ధం మురళీకృష్ణ, కలవచర్ల ఉపసర్పంచ్ కనకయ్య, మంథని మున్సిపల్ కౌన్సిలర్ వీకే రవి, చెవుల వినోద్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు

**కరీంనగర్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి**



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైతే మళ్లీ ఎంపి పదవి ఏమైనా బండి సంజయ్‌కు పునరావాస కేంద్రమా అని.. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని.. ప్రజలకు ఏం చేశామన్నదే ముఖ్యమని కరీంనగర్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కరీంనగర్ 59వ డివిజన్ కార్పోరేటర్ గందె మాధవిమహేష్ నివాసంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సంధర్భంగా బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ మూడు లక్షల జనాభా ఉన్న కరీంనగర్‌ను స్మార్ట్ సిటీ చేసి వెయ్యి కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కరీంనగర్‌లో రూ.50 కోట్ల వ్యయంతో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. కరీంనగర్ ఎంపిగా ఐదేళ్లలో బండి సంజయ్ బడి తేలేదు.. గుడి తేలేదన్నారు. కరీంనగర్‌కు మంజూరైన ట్రిబుల్ ఐటి బండి సంజయ్ అసమర్ధత కారణంగా ఇతర రాష్ట్రాలకు బిజెపి కేంద్ర ప్రభుత్వం తరలించిందన్నారు. ఐదేళ్లలో ఊరు ముఖం చూడని బండి సంజయ్‌కు ఇప్పుడు ప్రజలు గుర్తుకు వస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను బండి సంజయ్ తెచ్చినట్లు ప్రగల్బాలు పలకడం బావ్యం కాదన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎంపి అభ్యర్థిని ప్రకటించలేదని, బిజెపి కాంగ్రెస్ తిరిగి ఒక్కటవుతున్నాయన్నారు. బిజెపి, కాంగ్రెస్‌లు ఈ సారి ఎన్ని కుట్రలు చేసినా కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిగా తాను ఘన విజయం సాధిస్తానని అన్నారు. కార్యక్రమంలో కార్పోరేటర్ గందె మాధవి, మహేష్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ,బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కెజిబివి నర్సాపూర్ ఎస్ఒ విధుల నుండి తొలగింపు

**ప్రజాపక్షం నిర్మల్ ప్రతినిధి :** బుధవారం కెజిబివి నర్సాపూర్ జిలో అస్వస్థతకు గురైన 24 మంది విద్యార్థినులను మెరుగైన చికిత్స కోసం నిర్మల్ ఏరియా హాస్పిటల్‌కు తరలించి నిపుణులైన వైద్య బృందంచే చికిత్స అందించడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రవీందర్ రెడ్డి తెలిపారు. 24 మంది విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడిందని ఆయన తెలిపారు. అయినప్పటికీ 24 గంటలు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి విద్యార్థులను ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ చేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు.జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జిల్లా విద్యాశాఖ అధికారితో కలిసి ఏరియా హాస్పిటల్‌ను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థినుల తల్లిదండ్రులకి భరోసానిచ్చారు. వైద్యులకి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కలుషిత ఆహార ఘటనకి కారణంఅయి, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన కెజిబివి ప్రత్యేక అధికారిణి సునీతను విధుల నుండి తొలగించడం జరిగిందని,అలాగే వంట చేయడంలో నిర్లక్ష్యం వహించిన వంట మనిషి పద్మను విధుల నుండి తొలగించామని ఆయన తెలిపారు.కెజిబివి విద్యార్థినుల అస్వస్థతకు సంబంధించిన సమాచారాన్ని, జిల్లా యంత్రాంగానికి చేరవేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సెక్టోరల్ అధికారిణి శ్రీదేవికి షోకాజ్ నోటీసు జారీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, జిల్లాలోని అన్ని కెజిబివిల సిబ్బందికి ప్రత్యేకమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కెజిబివి నర్సాపూర్ ప్రత్యేక అధికారిణి సునీత,వంటమనిషి పద్మలపై క్రిమినల్ కేసుల నమోదుకు మండల విద్యాధికారిని ఆదేశించడం జరిగిందని ఆయన తెలిపారు. కెజిబివి ఇన్చార్జి ప్రత్యేక అధికారిణిగా అక్కడ పనిచేస్తున్న పిజిసిఆర్‌టి అనంతుల వనితను నియమించడం జరిగిందని ఆయన తెలియజేశారు.

## రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసే వరకు పోరాటం : ఏఐటియుసి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఎన్‌హెచ్ఎంలో పనిచేస్తున్న రెండవ ఎఎన్ఎంలను రెగ్యులర్ చేసేంతవరకు పోరాటం ఆగదని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ తెలిపారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో జరిగిన రెండవ ఎఎన్ఎంల జిల్లా స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న ఆరువేల మంది ఎఎన్ఎంల పనితో పోల్చుకుంటే మిగిలిన వాళ్ల పని తక్కువ అన్నారు. రోజుకు 10 నుంచి 12 గంటలపాటు ఏకధాటిగా పనిచేస్తున్నది రెండవ ఎఎన్ఎంలేనన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 16లో రెండవ ఎఎన్ఎంలను చేర్చి రెగ్యూలర్ చేయాలన్నారు. సమ్మెకాలంలో గత ప్రభుత్వం ఇచ్చిన వంద శాతం గ్రాఫ్ శాలరీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. త్రిసభ్య కమిటీ సమావేశపరిచి పనిభారం తగ్గించడానికి కృషి చేయాలన్నారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య మాట్లాడుతూ 9 సంవత్సరాల కాలంలో మొత్తంగా 30 సమ్మెలు జరిగాయని, ఏ సమ్మెకు కూడా సమ్మెకాలం జీతం పడలేదని కేవలం రెండవ ఏఎన్ఎంల సమ్మె కాలం జీతం మాత్రమే ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఒకే పని ఒకే విద్యార్హత ఉండి జీతంలో వ్యత్యాసాలు ఉండడం అన్యాయమన్నారు. సమావేశంలో రెండవ ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తోట రామాంజనాయులు పాల్గొన్నారు. అనంతరం కరీంనగర్ జిల్లా రెండవ ఎఎన్ఎంల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పి.రాణి, ఎం.రజిత, కోశాధికారిగా సరోజతో పాటు ఉపాధ్యక్షులుగా శోభ, విజయల, సహాయ కార్యదర్శులుగా విజయ, సరోజలతో పాటు మరో 18 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## నష్టపోయిన పంటకు పరిహారం



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** మండల కేంద్రాలలో మార్నింగ్ వాక్‌లు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ పొలాల బాట పట్టాలని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల సిపిఐ కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చిగురుమామిడి మండలంలో లంబాడిపల్లి గ్రామంలో సాగునీరు లేక ఎండిన వరి, మొక్కజొన్న, మామిడి పంటలను బాధిత రైతులతో కలిసి సిపిఐ నాయకులు పరిశీలించారు. సాగునీరు లేక పంట పొలాలు ఎండిపోతుంటే కనీసం పంట పొలాలను సందర్శించి రైతులకు మనోధైర్యం చెప్పే ఆలోచన కూడా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు లేకుండా పోయిందని వాపోయారు. వెంటనే వ్యవసాయ విస్తరణ అధికారులతో పంట నష్టంపై సర్వే చేయించి ఎకరాకు 20వేల రూపాయలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. క్వింటాలుకు 5వేల రూపాయల బోనస్ ఇస్తామని ఎన్నికలకు ముందు చెప్పిన కాంగ్రెస్ పార్టీ, ఆ హామీని పక్కనెబెట్టి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు మూడు ఎకరాల్లోపు వారికే పెట్టుబడి సహాయం కింద పదివేల రూపాయలు మాత్రమే అందించారన్నారు. తక్షణమే పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, అందె స్వామి, సింగిల్‌విండో డైరెక్టర్‌లు చాడ శ్రీధర్‌రెడ్డి, ముద్రకోల రాజయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, గోలి బాపురెడ్డి, ఎనగందుల రాజయ్య, తేరాల సత్యనారాయణ, అందె చిన్నస్వామి, విలాసాగరం అంజయ్య, కయ్యం తిరుపతి, ఉస్మాన్ పాషా, నక్క ఓదెలు యాదవ్, కయ్యం వీరయ్య పటేల్, దొంతరవేణి వెంకన్న యాదవ్, బందెల శ్రీనివాస్, బింగిస్వామి, అందె తిరుపతి, అందె సంపత్, కూన బాలయ్య, అప్పాల కుమార్, మంద ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి అవసరాలకు చెరువులు నింపండి : సిపిఐ వినతి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** సాగర్ ఆయకట్టు కింద నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోని చెరువులను కూడా తాగునీటి అవసరాలకు నింపాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణంలో జరిగిన సిపిఐ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో తాగునీటి అవసరాల కోసం సాగర్ నుండి నీరు విడుదలచేసి ఖమ్మం జిల్లాలోని పాలేరు చెరువును మాత్రమే నింపారని,మళ్లీ ఇప్పుడు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుండి రోజుకు 5వేల క్యూస్కెల నీరు విడుదల చేస్తూ పాలేరు చెరువుకు నీరు తరలిస్తున్నారు తప్ప సూర్యాపేట జిల్లాలోని ఏ ఒక్క చెరువును నింపకపోతే భూగర్భజలాలు ఎలా పెరుగుతాయని ఏప్రిల్,మే నెలలో ప్రజలకు పశుపక్షాదులకు తాగునీరు ఎలా అని ఆయన ప్రశ్నించారు.మండలంలోని సోమారం చెరువు నింపితే అక్కడ నుండి కల్లూరు, కల్లూరు నుండి పెంచికల్‌దిన్నె,చింతకుంట్ల, చిల్లేపల్లి చెరువులను అలుగుల ద్వారా నింపడం ద్వారా కొంతమే అయిన తాగునీటి లభ్యత ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ జిల్లాలోని శాసనసభ్యులు జోక్యం చేసుకుని ప్రభుత్వాన్ని ఒప్పించి ఈ ప్రాంత చెరువులను నింపాలని ఆయన డిమాండ్ చేశారు.కార్యక్రమంలో వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం,మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.లక్ష్మీ ,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐటియూసి మండల అధ్యక్షుడు ఊదర వెంకన్న, ఏఐఎస్ఎఫ్ నాయకులు కొమ్రరాజు వెంకట్, సిపిఐ నాయకులు బెల్లంకొండ గోవిందుగౌడ్ పాల్గొన్నారు.

## సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపాలి : రైతుసంఘం డిమాండ్

**ప్రజాపక్షం/ఖమ్మం :** నాగార్జునసాగర్ నీటితో ఖమ్మం జిల్లాలోని చెరువులు, కుంటలను నింపాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మంజిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో గ్రామీణ ప్రాంతాల్లో బావులు, బోర్లు ఎండి పోయాయని తీవ్రమైన నీటి కొరత ఏర్పడిందన్నారు. రానున్న కాలంలో సమస్య మరింత తీవ్రతరమయ్యే ప్రమాదం ఉందని వెంటనే సాగర్ నీటితో చెరువులు, కుంటలను నింపినట్లయితే భూగర్భ జల నీటి మట్టం పెరుగుతుందని తద్వారా నీటి కొరత నివారించబడుతుందన్నారు. పశువులు తాగేందుకు చుక్క నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పదేళ్లలో ఎండిపోని చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల్లో నీరు ఇంకిపోయిందని తెలిపారు. రైతులు, గ్రామీణ ప్రాంత ప్రజల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగర్ నీటితో ఆయకట్టు పరిధిలోని చెరువులను నింపాలన్నారు. ప్రభుత్వం తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి, తక్షణం అమలు చేయాలని, నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక నిధులు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

# స్వాతంత్ర్య పోరాటస్ఫూర్తితో మతోన్మాదశక్తులపై పోరాటం

### ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామకృష్ణ



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులపై ఆనాటి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఎఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షుడు జర్పుల ఉపేందర్ అధ్యక్షతన శేషగిరి భవన్‌లో గురువారం జరిగింది. సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విద్యను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలని చూస్తుందని, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేసేందుకే విదేశీ విశ్వ విద్యాలయాలకు అనుమతి ఇచ్చిందని, స్వదేశంలో ఆదాని, అంబాని, టాటా లాంటి కార్పొరేట్ సంస్థలకు విశ్వవిద్యాలయాలు పెట్టుకునేందుకు వెసులుబాటు కల్పించిందన్నారు. ఈ విధానాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థ ధ్వంసం చేయడానికి తీసుకుంటున్న చర్యలని విమర్శించారు. విద్యను కాషాయీకరణ వైపు తీసుకెళుతూ శాస్త్రీయమైన ఆలోచనలను, శాస్త్రీయ విద్యను దూరం చేసేందుకే మత భావాలు గల పాఠ్యాంశాలను జాతీయ నూతన విద్యా విధానం పేరుతోను తీసుకొస్తున్నారన్నారు. కేంద్రప్రభుత్వం తీసుకొస్తున్న విద్యా వ్యతిరేక సంస్కరణను విధానాలకు వ్యతిరేకంగా చైతన్యం గల ఎఐఎస్ఎఫ్ నాయకత్వంలో విద్యార్థులు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన విద్యా విధానం పేరుతో యూనివర్శిటీల స్వయంప్రతిపత్తి దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. యూనివర్శిటీలను మూడు, నాలుగు రకాలుగా విభజన చేసి విద్యను మరింత కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కమర్షియలైజ్, కాషాయీకరణ చేస్తుందన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఆరెస్సెస్ ఎజెండా అమలుకు బిజెపి ప్రయత్నం చేస్తుందని, అర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్నవారినే యూనివర్శిటీల్లో నియామకాలు చేస్తుందన్నారు. నూతన విద్యా విధానం విశ్వవిద్యాలయాలకు నిధుల కోత, ఫెలోషిప్స్ ఇవ్వకపోవడం, ఖాళీలు భర్తీ చేయకుండా ఉండటం, యూనివర్శిటీల్లో ప్రజాస్వామ్య వాతావరణ లేకుండా చేయడంపై ఉద్యమించాలన్నారు. కెస్ఎం కళాశాలను అప్‌డేట్ చేసి జెఎన్‌టియు యూనివర్శిటీగా ఏర్పాటు చేయాలన్నారు. టెక్నికల్ కోర్సులు పెంచి జిల్లా పరిధిలోని విద్యార్థులకు అవకాశాలు కల్పించాలని కోరారు. కాకతీయ యూనివర్శిటీ అనుబంధంగా ఉన్న కెఎస్ఎం కళాశాలను జెఎన్‌టియు యూనివర్శిటీగా ఏర్పాటు చేయడం వలన ఈ జిల్లాలో ఉన్నటువంటి గిరిజన విద్యార్థులకు మరింత విద్య అవకాశాలు ఉంటాయన్నారు. జెఎన్‌టియు కళాశాలకు ఏర్పాటుకు కావాల్సిన వసతులు అన్నీ కూడా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జెఎన్‌టియు యూనివర్శిటీ ఏర్పాటుకు దృష్టి సారించాలని ఆయన కోరారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఫహీం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హరీష్, ఆఫీస్ బేరర్స్, అజిత్, వంశీ, షాహిద్, పవన్ సాయి, జిల్లా నాయకులు రణధీర్, రాజు, శిరీష, సింధు, అను, నవ్య తదితరులు పాల్గొన్నారు.

# 'సింగరేణి' సమస్యలు పరిష్కరించండి

### సిఎండికి ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఎఐటియుసి నాయకులు సింగరేణి మేనేజింగ్ డైరెక్టర్ బలరాంనాయక్‌ను కోరారు. సింగరేణిలో 2023–2024 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని 70 మిలియన్ టన్నులు సాధించిన సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌లు సిఎండిని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. భవిష్యత్‌లో సింగరేణి కాలరీస్ మనుగడ కొనసాగాలంటే కొత్త గనులు రావాలని అడగగా త్వరలోనే కొత్తగూడెం వి.కె.7 గని, ఎల్లందు ఏరియాలోని ఎక్స్టెన్షన్ గని, తాడిచర్ల 2 గని కి త్వరలోనే పర్మిషన్ వచ్చే అవకాశం ఉందని, అలాగే ఒడిశా రాష్ట్రంలోని నైని ఓపెన్ కాస్ట్‌కు పర్మిషన్ వచ్చినా, బొగ్గు తీయుటకు కొన్ని అడ్డంకులు ఉన్న నేపథ్యంలో వాటిని కూడా త్వరలోనే అధిగమించి బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని సిఎండి తెలిపారని వారు పేర్కొన్నారు. సంస్థలో ఉన్న ఖాళీలను అంతర్గతంగా అర్హులైనటు వంటి ఉద్యోగులతో ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చి పూర్తిచేశామని తెలుపుతూ, చాలా మంది చదువుకున్న ఉద్యోగులు టెక్నికల్‌గా అర్హత కలిగిన ఉద్యోగులు సంస్థలో చాలామంది ఉన్నందున విండ్ పవర్, ఐడల్ పవర్, థర్మల్ పవర్ ,సోలార్ పవర్ జనరేషన్‌లు మన సంస్థ ద్వారానే చేపట్టి అర్హులైన ఉద్యోగులందరికీ శిక్షణ ఇచ్చి ప్రమోషన్లు కల్పించుకుందామని సిఎండి తెలిపారని వారు పేర్కొన్నారు. కొన్ని నెలల క్రితం అంతర్గత ప్రమోషన్లకు నోటిఫికేషన్లు ఇచ్చినప్పటికీనీ కొంతమంది ఉద్యోగులకు అర్హతలు రావడం లేదని అడుగగా, వారికి కూడా అర్హతలు కల్పించాలని కోరగా చైర్మన్ సానుకూలంగా స్పందిస్తూ ఏమైనా మార్పులకు అవకాశం ఉంటే చేద్దామని తెలియజేశారని, ప్రధానంగా మైనింగ్‌స్టాఫ్, ఈఅండ్ఎం ఉద్యోగులకు, మినిస్టీరియల్ స్టాఫ్ సిబ్బందికి అవకాశం కల్పిద్దామని సిఎండి తెలిపారని వారన్నారు. సింగరేణిలో పారదర్శకంగా జరగాలని ట్రాన్స్‌ఫర్స్ కానీ, ప్రమోషన్లు వచ్చినప్పుడు కౌన్సిలింగ్ విధానం అమలు చేయాలని కోరామని, సంస్థలో రాజకీయ జోక్యం ఉండకుండా చూడాలని తెలుపగా చైర్మన్ తప్పకుండా అమలు చేద్దామని తెలిపినారని వారన్నారు. 2024–25 కు సంబంధించిన 72 మి.ట.టార్గెట్ రీచ్ కొరకు గుర్తింపు సంఘంగా మీరు కృషి చేయాలని సిఎండి కోరగా, కొత్త మిషనరీ ,కావలసిన మ్యాన్ పవర్, కొత్త ఇన్సెంటివ్ విధానం అమలు చేసినట్లయితే టార్గెట్ రీచ్ అవుతుందని తెలియజేశామని వారన్నారు. చైర్మెన్‌ను కలిసిన వారిలో యూనియన్ అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిరియాల రంగయ్య, డిప్యూటీ ప్రధానకార్యదర్శులు కే.సారయ్య, వైవి రావు, కే.వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, మడ్డి ఎల్లాగౌడ్, గునిగంటి నర్సింగరావు తదితరులు ఉన్నారు.

# కార్మిక, కర్షక వ్యతిరేకి బిజెపి

### బండి సంజయ్ ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారు

### సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



**ప్రజాపక్షం/సిరిసిల్ల :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేకియని, కరీంనగర్ ఎంపిగాగెలిచిన బండి సంజయ్ ఎన్నికల ముందు రైతు దీక్షలు, ప్రజాహిత యాత్రలు చేస్తున్నారని, అవి ప్రజాహిత యాత్రలు కాదని, ప్రజా హత యాత్రలని సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు విమర్శించారు. గురువారం సిపిఐ కార్మిక భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతియుతంగా పోరాటం చేస్తున్న 12 వందల మంది రైతుల ప్రాణాలను బలిగొన్న బిజెపి ప్రభుత్వం, కరీంనగర్‌లో రైతుల పేరు మీద దొంగదీక్షలు చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు నష్టం కలిగించి, కార్పోరేట్ శక్తుల జేబులు నింపడానికి తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని డిమాండ్ చేస్తున్న రైతులను పొట్టన పెట్టుకున్నారన్నారు. కరీంనగర్ నియోజకవర్గానికి ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఏమి అభివృద్ధి సాధించారని, మళ్లీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. రైతుల ఉద్యమానికి తలొగ్గి, మీడియా ముందే క్షమాపణ కోరిన నరేంద్ర మోడీ, రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం దొంగ దీక్షలు చేస్తున్నారని, కార్మిక, రైతు మహిళా వ్యతిరేక బిజెపిని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించారని, ఉత్తరప్రదేశ్ లో, కుల దురంకార హత్యలు, మానభంగాలు అత్యాచారాలు జరుగుతుంటే బిజెపి ప్రభుత్వం చేష్టలుడిగి చూసిందని, దేశవ్యాప్తంగా కార్మికులకు నష్టం కలిగించే విధంగా లేబర్ కోడులను కుదించి, కార్పోరేట్ కంపెనీలకు ఉపయోగపడే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని, కార్పోరేట్ కంపెనీలకు లాభం చేకూర్చే విధంగా బిజెపి ప్రభుత్వం చట్టాలను మారుస్తూ, వారి వద్ద ఎలక్టోల్ బాండ్ల రూపంలో వేల కోట్ల రూపాయలు తీసుకుందన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని దేశ సంపదనంతా కార్పోరేట్‌లకు అమ్ముకుంటారని, రాజ్యాంగాన్ని మార్చి దేశ సమగ్రతకు, ఐక్యతకు విఘాతం కలిగిస్తారని మతకల్లోలాలు సృష్టించి, రాజకీయ పబ్బం గడుపుకుంటారని, ప్రజలు ఆలోచించి బిజెపికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు మీసం లక్ష్మణ్, అజ్జ వేణు, సోమ నాగరాజు పాల్గొన్నారు.

# ఫణిగిరి అభివృద్ధికి పూర్తిస్థాయి సహకారం

### ప్రపంచపటంలో ఫణిగిరిని నిలిపిన బౌద్ధ శిల్పాలు

### పురావస్తుశాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శైలజ రామఅయ్యార్



**ప్రజాపక్షం/తిరుమలగిరి(నాగారం):** ఫణిగిరిలో లభించిన అత్భుతమైన చారిత్రాత్మక బౌద్ధశిల్పాలు, నాణేలు మారుమూలన ఉన్న ఫణిగిరి గ్రామాన్ని ప్రపంచపటంలో నిలిపాయని ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి పర్యాటక సాంస్కృతిక, క్రీడల పురావస్తు శాఖ కార్యదర్శి శైలజ రామఅయ్యర్ తెలిపారు. గురువారం తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని నాగారం మండలం ఫణిగిరిలో బౌద్ధ క్షేత్రం కొండపై జరుగుతున్న తవ్వకాలలో వెలువడిన సీసాపు నాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫణిగిరిలోని తవ్వకాలలో లభించిన సీసపు నాణాలతో ఒక మైలురాయి దాటిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, నల్లగొండ జిల్లాలోని నాగార్జున కొండల్లో లభించిన బౌద్ధ చారిత్రాత్మక ఆనవాళ్లకు మించి ఫణిగిరిలో లభ్యమవుతున్నాయని చెప్పారు. ఇవి చాలా అద్భుతమైనవని పేర్కొన్నారు. చరిత్రలో ఇది మరచిపోలేని రోజని, క్రీ॥శ 2 నుండి క్రీ॥శ 4వ శతాబ్దం వరకు 3730 నాణాలు లభించడం అరుదైన విషయం అన్నారు. ఈ నాణాలపై ఒక వెపు వెనుగు, మరోవైపు ఉజ్జయిని గుర్తులు కలిగి ఉన్నట్లు తెలిపారు. ఇది ఇక్ష్వాకుల కాలం నాటి నాణాలుగా నిర్ధారించినట్లు చెప్పారు. ఫణిగిరిలో మ్యూజియం నిర్మాణానికి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు పూర్తి సహకారాన్ని అందించారని, దీని వల్ల తవ్వకాల్లో లభించిన చారిత్రాత్మక ఆధారాలు, పురాతన ఆధారాలు పర్యాటకలు తిలకించే విధంగా ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. ప్రతి బౌద్ధ మహాస్తూపం, ఉద్దేశిక స్థూపాలు, సభ మండపాలు, శిలాశాసనాలు, నాణేలు వీటన్నింటిని ఫణిగిరి గ్రామప్రజలే వారసులని తెలిపారు. ప్రజలు సహకరించాలని, అందరు కలిసి ఫణిగిరిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సహాయసహకారాలు అందించాలని కోరారు. మీడియా ద్వారా ప్రపంచానికి ప్రపంచానికి తెలిసేలా తొడ్పడాలన్నారు. తెలంగాణ వారసత్వ శాఖ సంచాలకురాలు భారతి హోలికేరీ మాట్లాడుతూ అర్కలాజి ఇండియా అనుమతితో తవ్వకాలు మొదలు పెట్టామని, ఇప్పటికే ఏడుసార్లు తవ్వకాలు నిర్వహించినట్లు చెప్పారు. ఇంకా రెండు చోట్ల తవ్వకాల అనుమతుల కోరినట్లు తెలిపారు. ఇక్కడ లభించినవి ఎంతో విలువైన చారిత్రాత్మక ఆధారాల్నరు. వీటిలో ముఖ్యమైనవి విహారాలు, గాజు, రాతి పూసలు, విరిగిన సున్నపురాతి విగ్రహాలు లభించినట్లు తెలిపారు. 2400 సంవత్సరాల క్రితమే ఏలాంటి సాంకేతిక పరికరాలు లేని రోజుల్లోనే పెద్ద రాళ్లను కొండలపైకి తీసుకవచ్చి శిల్పాలుగా మలచి వారి చరిత్రను చాటారన్నారు. ఇక్కడ లభించిన బుద్ధ స్థూపాలని కొన్ని న్యూయార్క్ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచినట్లు తెలిపారు. ఆనాటి కాలంలో ఉన్న చరిత్రను ప్రజలకు తెలిపేందు కు ఇవి ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. ఇక్కడ జరుగుతున్న తవ్వకాలకు ప్రజలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బిఎస్ లత, ఉపసంచాలకులు నారాయణ, అదనపు సంచాలకులు మల్లు నాయక్, తహసీల్దార్ భద్రయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గోదావరి నది కరకట్ట స్థలాలు పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/ఏటూరు నాగారం :** గోదావరి నది పరివాహక ముంపు ప్రాంతాలలో కరకట్ట నిర్మాణం కోసం ఏటూరు నాగారం మండలం రాంనగర్, కోయగూడెం, రామన్నగూడెం ప్రాంతాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం పరిశీలించారు. రాంనగర్ ప్రాంతంలో కరకట్ట నిర్మాణం కోసం సర్వే పూర్తి అయ్యిందని, మంగపేట మండలంలో పొదమనూర్ ముంపు ప్రాంతాలకు నూతన కరకట్ట నిర్మాణం కోసం స్థలం సర్వే పూర్తి అయిన వివరాలు సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ ఏటూరునాగారం మండలం ముళ్లకట్ట గ్రామంలో మిరప తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ కాలానుగుణంగా పంట మార్పిడి చేయాలని సూచించారు. రైతులకు లాభదాయకమైన పంటలపై, నాణ్యమైన విత్తనాల గురించి అవగాహన సదస్సులు నిర్వహించాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయభాస్కర్, ఎస్ఈ మోహన్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జగదీష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ చందర్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి వేణు, జేఈ, ఏఈ, పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఉత్సవాలు ఐక్యతను పెంపొందిస్తాయి : కూనంనేని



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉత్సవాలు, జాతరలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజలంతా కుల మతాలకు అతీతంగా మత సామరస్యాన్ని కాపాడుతూ సమాజాభివృద్ధికి తోడ్పాడాలన్నారు. గురువారం పాల్వంచలోని వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు కూనంనేని సాంబశివరావుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పూర్వ కాలం నుంచి పేద, ధనిక అనే భావం పాటించరాదన్న భావంతోనే అందరిని గౌరవిస్తూ ఉత్సవాలు నిర్వహించేవారని, ఆ పద్ధతిని ఇప్పటికీ కొనసాగించాలన్నారు. మత ఉన్మాదం ప్రమాదానికి దారి తీస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణ చందర్‌రావు, పాల్వంచ పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు దుగ్గిరాల సుధాకర్, వీసంశెట్టి పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, శెనగారపు శ్రీనివాసరావు, శేఖర్‌బాబు, ఎస్‌కె లాల్‌పాషా, వనపర్ల జాత్రయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

## ప్రజాపాలనతో ప్రజాసంక్షేమం

**ప్రజాపక్షం/తిరుమలగిరి:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజాపాలనలో ప్రజాసంక్షేమానికి నిరంతరం కృషిచేస్తుందని ఎంఎల్ఏ మందుల సామేల్ అన్నారు. హైద్రాబాద్‌లోని తుక్కుగూడలో ఈనెల 6న జరిగే జన జాతర సభకు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస, బిజెపి పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. వంద రోజుల్లోనే ఆరు హామీలను అమలు చేసిన ఘతన కాంగ్రెస్ పార్టీ, సిఎం రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డికి భారీ మెజార్టీ ఇవ్వాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో అనుబంధ సంఘాల నాయకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణులను సంరక్షించాలి : కలెక్టర్ సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** జిల్లాలో వన్యప్రాణుల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర పమేలా సత్పతి సూచించారు. వాటి ఆవాసాలు ధ్వంసం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కరీంనగర్ కలెకటరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అడవులను రక్షించుకోవడంతో పాటు మన్యప్రాణులను కాపాడుకోవాలని పేర్కొన్నారు. వేసవి కాలం నేపథ్యంలో వాటికి తాగునీటిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. వాటి రక్షణకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలని తెలిపారు. అటవీశాఖ అధికారులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డిఎఫ్‌వో బాలామణి, మైనింగ్ శాఖ ఏడి రామాచారి, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు కె.మహేశ్వర్, రమేష్ బాబు, సిసిఎస్ ఏసిపి కాశయ్య, అటవీశాఖ రేంజ్ ఆఫీసర్లు రెడ్డి రాజేందర్ రావు, ఏటిడివో దివాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కేజ్రీవాల్‌కు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

అని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. పిటిషనర్‌కు రాష్ట్రపతి, ఎల్‌జి వద్ద పరిష్కారం దొరుకుతుందని సూచించారు. కేజ్రీవాల్‌ను పదవి నుంచి తప్పించాలని పిల్ దాఖలు కావడం ఇది రెండోసారి. సూరజ్‌సింగ్‌యాదవ్ అనే వ్యక్తి గత నెల 28న దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా న్యాయస్థానం కొట్టేసింది.

### నియోజకవర్గాల్లో పర్యటించండి

ఎంఎల్‌ఎలంతా ఢిల్లీ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలని ఆప్ కన్వీనర్, సిఎం కేజ్రీవాల్ కోరారు. జైలు నుంచి ప్రజాప్రతినిధులకు పంపిన ఈ వినతిని ఆయన సతీమణి సునీత కేజ్రీవాల్ వీడియో సందేశం ద్వారా వెల్లడించారు. జైలుకు వెళ్లిన దగ్గరినుంచి కేజ్రీవాల్ తన మాటలను సునీత ద్వారా వినిపిస్తున్నారు. కాగా, తాను జైలులో ఉన్నప్పటికీ రెండు కోట్ల మంది ఢిల్లీ ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొనకూడదని తాజా సందేశంలో కేజ్రీవాల్ పేర్కొన్నారు. అధికారిక పనులతో పాటు ప్రజాసమస్యలను కూడా తాము పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com